


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

ఇపిఎఫ్ఒ పరిమితి పెంచేందుకు పుష్కరకాల జాప్యం



03

సంపుటి 09, సంచిక: 288 | శుక్రవారం | 18 -09-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## పోరాట యోధులకు
# తెలంగాణ పుట్టినిల్లు



- అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఎప్పటికప్పుడు ప్రజాచైతన్యాన్ని రగిలించిన నేల
- సమ్మక్క-సారలమ్మ పోరాటం నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం దాకా అన్యాయాన్ని ఎదిరించిన గడ్డ
- చరిత్రను మరువం – అక్కడే ఆగిపోం
- పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందాం

### ప్రజాపాలన దినోత్సవంలో సిఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటన

ప్రజాపక్షం/హైదరాబాద్

తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ అని, నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించిందని, సమ్మక్క సారలమ్మల పోరాటం నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వరకు అన్యాయాన్ని ఎదిరించడం తెలంగాణ గడ్డ స్వభావమన్నారు. చరిత్రను మరిచిపోబోమని, ఆ చరిత్ర వద్దనే ఆగిపోకుండా ఆ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందామని సిఎం పిలుపునిచ్చారు. 'సెప్టెంబర్ 17''ను పురస్కరించుకుని

తరువాయి 8లో






### అధికారికంగా విలీన దినోత్సవం జరిపేందుకు
# పాలకులకు భయమెందుకు?

- రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సిపిఐ నేతలు
- తెలంగాణ రైతాంగ సాయుధపోరాట అమరుల త్యాగఫలితమే హైదరాబాద్ సంస్థానం విలీనమని ఉద్ఘాటన
- వీరోచిత సాయుధ పోరాట చరిత్రను గుర్తించాల్సిందేనని డిమాండ్
- హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ మైదానంలో తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి సభ

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ చరిత్రలోనే 4500 మంది అమరవీరుల రక్తతర్పణంతో లిఖించబడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను గుర్తించేందుకు, విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి పాలకులకు భయమెందుకని సిపిఐ నాయకులు ప్రశ్నించారు. తెలంగాణ విలీన దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తే కొంత మంది బాధపడతారని గత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు చెప్పిన విషయాలనే నేటి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కూడా చెబుతున్నారని విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల త్యాగాల ఫలితమే నాటి హైదరాబాద్ సంస్థానం విలీనం, నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమని వారు స్పష్టం

తరువాయి 12లో

## రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాతే కాంగ్రెస్‌ది ప్రజాపాలనా? : పల్లా




తెలంగాణ స్వాతంత్ర దినోత్సవమైన సెప్టెంబర్ 17ను కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజా పాలన దినోత్సవం'గా బిఆర్ఎస్ 'సమైక్యత దినోత్సవం', బిజెపి 'విమోచనం దినోత్సవం' పేరుతో బహిరంగ సభలను నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పల్లా వెంకట రెడ్డి అన్నారు. తెలంగాణ విలీన దినోత్సవం అధికారికంగా నిర్వహించడం వల్ల కొంత మంది బాధపడుతారని గతంలో నాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నిసిగ్గుగా చెప్పిన విషయాలనే

తరువాయి 12లో

## బిజెపి నాయకులు చరిత్ర విచ్ఛిన్నకారులు : కూనంనేని

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారసులుగా సెప్టెంబర్ 17ను 'తెలంగాణ స్వాతంత్ర దినోత్సవం' పేరుతో ఉత్సవాలు జరుకుంటుంటే కాంగ్రెస్ 'ప్రజాపాలన' బిఆర్ఎస్ 'సమైక్యత దినోత్సవం', బిజెపి 'విమోచన దినోత్సవం' పేరుతో సభలు జరుపుకోవడం సిగ్గుచేటని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రను చరిత్రగా గుర్తించలేని కాంగ్రెస్, బిజెపి నాయకులు చరిత్ర నిర్మాణకారులు కాదని,

తరువాయి 12లో



### ఆర్‌టిసి ఎన్నికల జాప్యంపై
# 22న మహాధర్నా

### అక్టోబర్ మొదటి వారంలోగా ఎన్నికలు నిర్వహించాలి: ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసిలో గుర్తింపు సంఘ ఎన్నికల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించి, అక్టోబర్ మొదటి వారంలోగా ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై ఐదు నెలలు గడిచినా షెడ్యూల్ ప్రకటించడంలో జాప్యం జరుగుతోందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న ఆరోపించారు. ఎన్నికల తర్వాతే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో, ఎన్నికల ప్రక్రియను ఆలస్యం చేయడం వల్ల విలీన ప్రక్రియ కూడా వాయిదా పడుతోందని వారు పేర్కొన్నారు. ప్రతి నెల వందలాది మంది ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నారని, వారికి విలీనం ద్వారా లభించే ప్రయోజనాలు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ సెప్టెంబర్ 22న

తరువాయి 8లో

## పోలీసు ఉద్యోగాల పరీక్షలకు
# తేదీలు ఖరారు

నవంబర్ 29న ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్ష

డిసెంబర్ 20న కానిస్టేబుల్ పరీక్ష

03

## మహనీయుల త్యాగాలతోనే..
# భారత్‌లో హైదరాబాద్ విలీనం

- 'తెలంగాణ విమోచన దినోత్సవ'ంలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్

ప్రజాపక్షం/హైదరాబాద్




హైదరాబాద్ సంస్థానం భారత్‌లో అంతర్భాగం కావడానికి ఎంతో మంది మహనీయులు ప్రాణ త్యాగాలు చేశారని భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'తెలంగాణ విమోచన దినోత్సవ' వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లోని పోలీస్ అమరవీరుల స్మృతి స్థూపం వద్ద నివాళులర్పించిన ఆయన, అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, గజేంద్ర సింగ్ షెకావత్, బండి సంజయ్, ఎంపి ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ 1948లో చేపట్టిన ఆపరేషన్ పోలో ద్వారానే హైదరాబాద్ స్వాతంత్ర్యం సాధ్యమైందని, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ దార్శనికత బలమైన భారత్ నిర్మాణానికి తోడ్పడిందని కొనియాడారు. కుమురం భీం, రాంజీ గోండు, తుర్రేబాజ్ ఖాన్ వంటి యోధుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించినప్పుడే

తరువాయి 8లో




## సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో
# విచారణకు సిద్ధమా?

### కెసిఆర్, రేవంత్‌రెడ్డి కుటుంబాలకు చెందిన ఆస్తులపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సవాల్

- కెసిఆర్ పుట్టిందే వందల ఎకరాల ఆస్తులున్న కుటుంబంలో అని వెల్లడి
- కొండల్‌రావు ఆస్తులను కెసిఆర్ ఖాతాలో వేస్తు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

మాజీ సిఎం కెసిఆర్ ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి ఇద్దరి కుటుంబాలకు చెందిన ఆస్తులపైన హైకోర్టు లేదా సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణకు సిద్ధమా? అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు సవాల్

తరువాయి 8లో

## సున్నా ఎకరాల నుంచి
# రూ.వేల కోట్లకు ఎలా ఎదిగారు?



### కెసిఆర్ 2004 అఫిడవిట్‌పై మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కెసిఆర్) ఎన్నికల అఫిడవిట్‌లలో ప్రకటించిన ఆస్తుల వివరాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కెసిఆర్ స్వయంగా

తరువాయి 8లో

పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో నిజమైన తెలంగాణ ఉద్యమకారులకు అప్పులే మిగిలాయని విమర్శ కెసిఆర్ కుటుంబానికి లక్షల కోట్ల ఆస్తులు వచ్చాయని ఆవేదన

### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల
# ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల




ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల స్థానాలకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రాథమిక కసరత్తు ప్రారంభమైంది. మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ స్థానంతో పాటు వరంగల్, ఖమ్మం, నల్లగొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ స్థానాలు 2027 మార్చి నాటికి ఖాళీ కానున్న నేపథ్యంలో నూతన ఓటర్ల జాబితా ప్రక్రియ ప్రారంభించేందుకు నోటిఫికేషన్ షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ నూతన షెడ్యూల్ ప్రకారం, 2026 నవంబర్ 1 నాటికి

తరువాయి 8లో



## స్వీడన్ ఎన్నికల్లో వామపక్షాల గెలుపు

### ప్రధానమంత్రి క్రిస్టెర్‌సన్ రాజీనామా
### కొత్త ప్రధానిగా ఆండర్‌సన్‌కే అవకాశం

స్టాక్‌హోమ్ : స్వీడన్ ఎన్నికల్లో ముందుగా ఊహించిన విధంగానే వామపక్ష కూటమి స్వల్ప ఆధిక్యంతో పార్లమెంటు అధికారాన్ని కైవసం చేసుకుంది. పోల్ సర్వేలు ముందుగానే ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. అధికార, ప్రతిపక్ష

తరువాయి 8లో

# 100% భారత్, చైనాలపై ట్రంప్ సుంకాలు

- రష్యాపై ఆర్థిక ఒత్తిడి పెంచేందుకు ఆంక్షల బిల్లు ఆమోదం
- బిల్లుకు 57 మంది డెమోక్రాట్ల మద్దతు



**వాషింగ్టన్ :** రష్యాపై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి తీసుకువచ్చేందుకు ట్రంప్ ఆలోచనల మేరకు ఆంక్షలబిల్లును అమెరికా కాంగ్రెస్ గురువారం ఆమోదించింది. దీంతో రష్యా నుండి చమురు, సహజవాయువులను దిగుమతి చేసుకునే భారత్–చైనా సహా ఐదు అగ్రదేశాలపై నూటికి నూరుశాతం సుంకాలు విధించేందుకు డోనాల్డ్ ట్రంప్‌కు అపారమైన అధికారాలు లభించాయి. ఈ బిల్లుకు అనుకూలంగా 262 మంది,వ్యతిరేకంగా 159 మంది ఓటు వేశారు. బిల్లు ఇక చట్ట రూపం దాల్చడానికి అధ్యక్షుడి సంతకానికి వెళుతుంది.అనుకూలంగా ఓటు వేసినవారిలో అధికార రిపబ్లికన్‌పార్టీకి చెందిన 202 మంది ప్రతినిధులుండగా, ప్రతిపక్షం నుండి 57 మంది డెమోక్రటిక్ సభ్యులు ఉన్నారు. పార్టీ ఆదేశాన్ని ఉల్లంఘించి వారంతా అనుకూల ఓటు వేశారు. ఒక ఇండిపెండెంట్ కూడా అనుకూలంగా ఓటు వేశారు.రిపబ్లికన్‌పార్టీ నుండి తొమ్మిదిమంది నెగెటివ్ ఓటు వేశారు. డెమోక్రాట్స్‌లో ఏడుగురు నెగెటివ్ ఓటు

తరువాయి 8లో



### యూట్యూబర్ వైష్ణవి భర్త
# దారుణహత్య

### పదునైన ఆయుధంతో హరిబాబుపై దుండగుల దాడి

ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్

యూట్యూబర్ వైష్ణవి హత్యకేసులో నిందితుడు, ఆమె భర్త చిత్తరి హరిబాబు(26) నిజామాబాద్ నగరంలో దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొన్ని రోజులుగా హరిబాబు తన తల్లితో కలిసి

తరువాయి 8లో

# పెరిగిన ద్రవ్యోల్బణం తగ్గిన జీవన ప్రమాణం

ఐరోపాలో యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తత, పైపైకి పోతున్న అంతర్జాతీయ ముడిచమురు ధరలు, వర్షాభావ పరిస్థితులు, ఆగని రూపాయి మారక విలువ పతనం వంటి పలు అంశాలు ఆర్థిక శాస్త్రవేత్తల చర్చల్లో వినిపించే పదాలుగా కనిపించవచ్చు. కానీ సామాన్యుడి జీవితంలో వీటి అర్థం చాలా సూటిగా ఉంటుంది. జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. మార్కెట్‌కు వెళ్లినప్పుడు అదే సరుకుకు ఎక్కువ డబ్బు చెల్లించాలి. వంటింటి ఖర్చు పెరుగుతుంది. ప్రయాణ ఖర్చు పెరుగుతుంది. చిన్న వ్యాపారి ఖర్చు పెరుగుతుంది. చివరికి కుటుంబ బడ్జెట్‌లో మిగిలే మొత్తం తగ్గుతుంది. ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన ఆగస్టు మాసానికి చెందిన ద్రవ్యోల్బణ గణాంకాలు ఈ ప్రమాదాన్ని మరోసారి గుర్తు చేస్తున్నాయి. టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం జులైలో 9.78 శాతం ఉండగా, ఆగస్టులో 9.92 శాతానికి పెరిగింది. ప్రజల జీవన ప్రమాణాన్ని దారుణంగా తగ్గించింది. ఆహార పదార్థాలు, ఇంధనం, తయారీ వస్తువుల ధరలు ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలు. ముఖ్యంగా ఇంధనం, విద్యుత్ విభాగంలో ద్రవ్యోల్బణం 20.05 శాతం నుంచి 22.93 శాతానికి ఎగబాకడం ఆందోళన కలిగించే అంశం. అదే సమయంలో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణ సూచీ (సిపిఐ) జులైలో 4.45 శాతం నుంచి ఆగస్టులో 4.82 శాతానికి పెరిగింది. ఆహార ద్రవ్యోల్బణం 5.52 శాతం నుంచి 5.95 శాతానికి చేరింది. ఉల్లిపాయ ధరల పెరుగుదల ఏకంగా 48.27 శాతానికి చేరింది. వెల్లుల్లి 43.6 శాతం, అల్లం 73.82 శాతం ద్రవ్యోల్బణాన్ని నమోదు చేశాయి. టమాటా, బంగాళాదుంప వంటి కొన్ని కూరగాయల ధరలు తగ్గినా, వంటింటి మొత్తం ఖర్చుపై ఒత్తిడి తగ్గడానికి అది సరిపోలేదు. ఈ గణాంకాల్లో అత్యంత ముఖ్యమైన విషయం రిటైల్ ద్రవ్యోల్బణం ఎంత ఉందన్నది అనేదాని కంటే, హోల్‌సేల్ ధరల ఒత్తిడి రేపటి రిటైల్ ధరలకు ఏ సంకేతం ఇస్తుందన్నదే ప్రధానం. తయారీ వస్తువుల హోల్‌సేల్ ద్రవ్యోల్బణం కొత్త సిరీస్‌లోనే అత్యధికంగా 8.37 శాతానికి చేరింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం ఈ పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది. అంతర్జాతీయ ఇంధన ధరలు పెరిగితే భారతదేశం వంటి భారీ దిగుమతి ఆధారిత ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం తప్పదు. ముడిచమురు ధర పెరిగితే పెట్రోల్, డీజిల్ ధరలకే పరిమితం కాదు. రవాణా, వ్యవసాయం, విద్యుత్, పరిశ్రమ, విమానయానం, ప్లాస్టిక్, రసాయనాలు దాదాపు ప్రతి రంగం మీద, చివరికి సామాన్యుడి భుజాలపై పడుతుందనేది బహిరంగ రహస్యం. ధరలు పెరుగుతున్నంత వేగంగా ఆదాయాలు పెరగవు. జీతాలు పెరగవు. కుటుంబ అవసరాలు తగ్గవు. ఫలితంగా జీవన ప్రమాణాలు దారుణంగా పతనమవు తాయి. తక్కువ ఆదాయ కుటుంబాలు తమ ఆదాయంలో అధిక భాగాన్ని ఆహారం, ఇంధనం, రవాణాపైనే ఖర్చు చేస్తాయి. ధరల పెరుగుదల వారిని పొదుపుల నుంచి దూరం చేస్తుంది. అప్పులపై ఆధారపడే పరిస్థితిని పెంచుతుంది. ఈ పరిస్థితిని చక్కదిద్దడమే ఇప్పుడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ముందున్న ప్రధాన సవాలు. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని ప్రధానంగా పరిగణించే ఆర్‌బిఐ ద్రవ్య విధాన కమిటీ అక్టోబరు 5 నుంచి 7 వరకు సమావేశం కానున్న నేపథ్యంలో, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేందుకు వడ్డీ రేట్లు పెంచే అవకాశాలపై దృష్టి సారించవచ్చు. దీనివల్ల సామాన్యుడికి వచ్చే సత్వర ఊరట అంటూ ఏదీ ఉండదు. కాబట్టి, ఈ దశలో కేవలం వడ్డీ రేటును పెంచడం సరిపోదు. ఆర్‌బిఐ ద్రవ్య విధానం, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానం, రాష్ట్రాల మార్కెట్ జోక్యం పరస్పరం సమన్వయంతో పనిచేయాలి. ద్రవ్యోల్బణం సరఫరా వైపు నుంచి వస్తున్నప్పుడు దానికి మొత్తం సమాధానాన్ని వడ్డీ రేటులో వెతకడం సరైన విధానం కాదు.

ఆహార సరఫరా గొలుసుపై ప్రభుత్వం ముందుగా దృష్టి పెట్టాలి. నిత్యావసరాల ధరల్లో భారీ హెచ్చుతగ్గులు రైతుకూ, వినియోగదారుడికి నష్టం చేస్తాయి. రైతు పంటకు మంచి ధర రాకపోవచ్చు. వినియోగదారుడు కొన్ని నెలల తర్వాత అదే పంటకు అధిక ధర చెల్లించాల్సి రావచ్చు. మధ్యవర్తులు లేదా దళారీలు, నిల్వ సామర్థ్యం, కోల్డ్ స్టోరేజీ, రవాణా, మార్కెట్ సమాచారం వంటి సమస్యలను పరిష్కరించకుండా ధరల స్థిరత్వం సాధ్యం కాదు. ప్రభుత్వం అవసరమైన సమయంలో బఫర్ స్టాకులను ఉపయోగించాలి. మార్కెట్‌లో కొరత ఏర్పడినప్పుడు నిల్వలను విడుదల చేయడం, అధిక ధరల సమయంలో దిగుమతులను తాత్కాలికంగా సులభతరం చేయడం, ఎగుమతి విధానంలో ఆకస్మిక మార్పులను తగ్గించడం వంటి చర్యలు తీసుకోవాలి. అయితే ఇలాంటి జోక్యాలు రైతు ప్రయోజనాలను దెబ్బతీయకుండా జాగ్రత్తగా రూపొందించాలి. వినియోగదారుడికి తక్కువ ధర కల్పించాలనే ఉద్దేశంతో రైతు ఆదాయాన్ని దెబ్బతీస్తే దీర్ఘకాలంలో ఉత్పత్తి తగ్గి సమస్య మరింత తీవ్రమవుతుంది. ఇంధన రంగంలో ప్రభుత్వం మరింత ముందు చూపుతో వ్యవహరించాలి. అంతర్జాతీయ ముడిచమురు ధరలు పెరిగిన ప్రతిసారీ దేశీయ ధరలు పెరిగే పరిస్థితి ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరం. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను సమర్థంగా ఉపయోగించడం, దిగుమతి వనరులను విస్తరించడం, దేశీయ శుద్ధి సామర్థ్యాన్ని పెంచడం, పునరుత్పాదక ఇంధనాన్ని వేగంగా విస్తరించడం వంటి చర్యలకు ఇప్పుడు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. ఇవి ఒక్క నెలలో ధరలను తగ్గించకపోయినా, భవిష్యత్తులో అంతర్జాతీయంగా ఏర్పడి తీవ్రమైన ఆర్థిక వ్యత్యాసాలు, ఒడిదుడుకుల ప్రభావాన్ని తగ్గిస్తాయి. ధరల సమాచారాన్ని ప్రజలకు మరింత పారదర్శకంగా అందించడం కూడా అత్యవసరం. ఏ వస్తువు ధర ఎందుకు పెరిగింది? ఉత్పత్తిదారుడి ధర ఎంత పెరిగింది? రవాణా ఖర్చు ఎంత పెరిగింది? మధ్యవర్తుల వాటా ఎంత మారింది? దిగుమతి ధర ప్రభావం ఎంత? ఇలాంటి సమాచారాన్ని క్రమం తప్పకుండా ప్రజల ముందుంచాలి. ద్రవ్యోల్బణం గురించి గణాంకాలను విడుదల చేయడంతో ప్రభుత్వ బాధ్యత తీరిపోదు. ఆ గణాంకాల వెనుక ఉన్న కారణాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. టోకు ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణ సమస్య ప్రస్తుతం సామాన్యుడి జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో, ఇప్పటికిప్పుడు ద్రవ్యోల్బణాన్ని పూర్తిగా అదుపులోకి తీసుకురావడం సులభం కాకపోవచ్చు. కానీ, సరైన నిర్ణయాలు తీసుకొని, వాటిని సమర్థంగా అమలుచేస్తే, పరిస్థితి కొంతవరకైనా మెరుగుపడవచ్చు. భారత ఆర్థిక వ్యవస్థకు విస్తారమైన మార్కెట్, విస్తృత ఉత్పత్తి సామర్థ్యం, బలమైన వ్యవసాయ ఆధారం ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పుడు చేయాల్సింది సంక్షోభం వచ్చిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే సరఫరా వ్యవస్థను సిద్ధం చేయడం. ఆహార నిల్వలు, ఇంధన భద్రత, వ్యవసాయ మార్కెట్లు, రవాణా మౌలిక సదుపాయాలు, దిగుమతి విధానం, చిన్న వ్యాపారాలకు ఆర్థిక సహాయం వంటివి ఒకే ద్రవ్యోల్బణ వ్యూహంలో భాగం కావాలి. ధరలు పెరిగిన తర్వాత ఉపశమన చర్యలు ప్రకటించడం కంటే, ధరలు పెరగకుండా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం అవసరం. ప్రజల ఆదాయాన్ని పెంచే విధానాలు, ఆహార భద్రతను కాపాడే చర్యలు, ఇంధన దిగుమతి ప్రమాదాన్ని తగ్గించే దీర్ఘకాల వ్యూహం, పారదర్శక మార్కెట్ పర్యవేక్షణలే ద్రవ్యోల్బణ నియంత్రణకు సరైన సమాధానాలు. ●



## ప్రపంచానికి శుభ సంకేతం

**ప్రపంచ అగ్రదేశాలు చైనా–అమెరికా మధ్య పరస్పర సమానత్వం ఉండాలి. సమాన గౌరవం ఉండాలి. పరస్పర ప్రయోజన స్ఫూర్తి కొనసాగాలి. సహకారాన్ని ముందుకు తీసుకువెళ్ళాలి. అన్నింటికంటే ముఖ్యంగా విభేదాలు పరిష్కరించుకోవాలి. ఒకరి కీలక ప్రయోజనాలు మరొకరు గౌరవించుకోవాలి. నిర్మాణాత్మక, వ్యూహాత్మక సంబంధాలు పెంపొందాలి. ప్రపంచశాంతిని, అభివృద్ధిని ఉమ్మడిగా ప్రోత్సహించడం అగ్రదేశాల కీలక బాధ్యత. ఇరుదేశాలూ ప్రపంచ శాంతికి దోహదపడతాయన్న సానుకూల సందేశం ముందుగా ప్రపంచానికి పంపించాలి.**

– చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ




## మానవాళికి నీరే జీవనాధారం

జీవులకు ప్రాణాధారం నీరు మాత్రమే. నీరు ఒక సార్వత్రిక ద్రావణి. జలం లేకుండా జీవనం సాగదు. ప్రకృతి ప్రసాదించిన సహజ అమూల్య వనరులుగా నీటి నిల్వలు కలిపిస్తాయి. నదులు, సరస్సులు, చెరువులు, వాగులు, సముద్రాలు, భూగర్భజలాలు లాంటి పలు నీటి వనరులు సకల ప్రాణికోటికి అందుబాటులో ఉన్నాయి. రసాయనశాస్త్రపరంగా నీటిని త్రిపరమాణుక విజాతీయ అణువుగా నామకరణం చేశారు. రెండు హైడ్రోజన్ పరమాణువులు, ఒక ఆక్సిజన్ పరమాణువు కలిసి $H_2O$ అను రసాయన ఫార్ములాతో సూచించడం జరుగుతోంది. కలుషిత నీరు తాగితే కలరా, డయేరియా, టైఫాయిడ్, డిసెంట్రీ, హెపటైటిస్, మలేరియాసిస్ లాంటి తీవ్రమైన వ్యాధులు సోకుతాయి. మానవాళి ఎదుర్కొంటున్న 80 శాతం రోగాలకు కలుషిత తాగు నీరే కారణమని తెలుస్తున్నది. ప్రపంచ మరణాల్లో 5 శాతం వరకు కలుషిత నీటివల్ల కలుగుతున్నట్లు నిర్ధారించారు. భారత్‌లో 70 మిలియన్ల మరణాలు డయేరియా కారణంగా నమోదు అవుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, విశ్వవ్యాప్తంగా ప్రతి ముగ్గురు జనాభాలో ఒక్కరు సురక్షిత నీటికి దూరంగా ఉన్నట్లు తెలుస్తున్నది.

**సురక్షిత తాగు, సాగు నీటి కోసం యుద్ధాలు వద్దు:**

నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, తరుచుగా నీటి నాణ్యతను పరీక్షించుకోవడం, సురక్షిత తాగు నీటి అవసరాలను అవగాహన పరచడం, సభలు/ సమావేశాలు నిర్వహించి నీటి పర్యవేక్షణ ప్రాధాన్యాన్ని వివరించడం లాంటి కార్యక్రమాలను చేపట్టాలి. నీటి రవాణాలో లీకేజీలను అడ్డుకోవడం, నల్లా నీరు వృధా కాకుండా చూసుకోవడం, సూక్ష్మ సేద్యం చేయడం, స్ప్రింక్లర్లను వాడడం, నీటి పొదుపు పట్ల విద్యార్థులకు అవగాహన కలిపించడం లాంటివి వివరించాలి. గ్రామీణ భారతంలో 83 శాతం, పట్టణ జనాభాలో 91 శాతం జనాభాకు సురక్షిత నీరు లభిస్తున్నట్లు ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పేదరికం, అధిక జనాభా, నిరక్షరాస్యత వంటి కారణాలు కూడా సురక్షిత నీటి లభ్యతకు ప్రతిబంధకాలుగా పనిచేస్తున్నాయి. విద్య, వైద్యం, సురక్షిత తాగు నీరు లభించడం ఒక ప్రాథమిక హక్కు అని తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద అధికంగా ఉన్నది. నీటిని పొదుపుగా వాడుకుంటూ, కలుషితం కాకుండా చూసుకుంటూ, ఆయురారోగ్యాలతో మనుగడ సాగిద్దాం, నీటి ఆధార అనారోగ్యాలకు అడ్డుకట్ట వేద్దాం.

*(18 సెప్టెంబర్ ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం సందర్భంగా)*

# జెఎన్‌యులో శరవేగంగా కాషాయీకరణ

**సవేరా**

భారతదేశంలోని అత్యుత్తమ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో ఒకటిగా, ముఖ్యంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ అధ్యయనాలు, పరిశోధనలకు జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు) ప్రసిద్ధి. ఆ యూనివర్సిటీ అధ్యాపకుల నియామకాలలో జరుగుతున్న అవకతవకలపై రిపోర్టర్స్ కలెక్టివ్ (ఆర్‌సి) ఇటీవల వెలువరించిన ఒక నివేదిక ప్రజల దృష్టిని విస్తృతంగా ఆకర్షించింది. నియామక ప్రక్రియలో నిబంధనలను దారుణంగా, ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిన ఏడు ఉదంతాలను ఆర్‌సి బహిర్గతం చేసింది. అయితే, అసలు కథ ఈ ఏడు కేసులకు మాత్రమే పరిమితం కాదు, లేదా ప్రత్యేకంగా వాటికే సంబంధించినది కూడా కాదు. ఇది కేవలం నిబంధనల ఉల్లంఘన గురించి మాత్రమే కాదు, ఒక ప్రభుత్వ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల నియామకాలను నియంత్రించే నిబంధనల వెనుక ఉన్న ప్రధాన లక్ష్యాలను పద్ధతి ప్రకారం దెబ్బతీయడం గురించినది. ఈ ఏడు ఉదంతాలు జెఎన్‌యులోని అధ్యాపకుల నియామక ప్రక్రియలో పాతుకుపోయిన ఒక లోతైన రుగ్మతకు కేవలం లక్షణాలు మాత్రమే. ఇది ఒక ప్రముఖ విశ్వవిద్యాలయం నాశనమయ్యే ప్రక్రియలో ఒక ముఖ్యమైన అంశాన్ని సూచిస్తుంది.

నివేదించిన ప్రతి కేసులోనూ నియమితులైన వారు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) నిబంధనలలో నిర్దేశిత కనీస అర్హత షరతులను నెరవేర్చలేదనేది ఆరోపణ. ఇది కేవలం పొరపాటు కాదు. అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించినప్పటి నుంచి ఎంపిక కమిటీ వారిని ఇంటర్వ్యూ చేసే వరకు జరిగిన ప్రక్రియలలో, ఈ అభ్యర్థుల అర్హతకు సంబంధించిన సమస్యలు గుర్తించబడినవి. అయినప్పటికీ, వాటిని పక్కనపెట్టి, ఇతర దరఖాస్తుదారులను వారి అర్హత కారణాలతో ఇంటర్వ్యూలకు హాజరు కాకుండా నిరోధించినప్పటికీ, ఈ అభ్యర్థులను వివరించలేని విధంగా ఇంటర్వ్యూలకు హాజరయ్యేందుకు అనుమతించారు. ప్రశ్న ఏమిటంటే, ఒక విశ్వవిద్యాలయ పరిపాలన కొందరు నిర్దిష్ట అభ్యర్థులకు 'సర్దుబాటు' చేయటానికి ఎందుకంతగా ప్రయత్నిస్తుంది? దీనికి ఉన్న ఏకైక హేతుబద్ధమైన వివరణ ఏమిటంటే, విశ్వవిద్యాలయ బాధ్యులు ఈ అభ్యర్థుల పట్ల తమ ప్రాధాన్యతను ముందుగానే నిర్ణయించుకుని, వారిని ఎంపిక చేయడానికి నియామక ప్రక్రియను తమకు అనుగుణంగా మార్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ మార్పు ఆ తర్వాత జరిగిన ప్రక్రియకు కూడా విస్తరించింది. అనర్హులైన ఈ అభ్యర్థులు ఇతర అర్హులైన అభ్యర్థులను 'దాటుకొని', వారి వారి ఎంపిక కమిటీలకు మొదటి 'ఎంపిక'గా నిలిచేలా చేసింది. ఈ పక్షపాతం కొందరికి అనుకూలంగా, మరికొందరికి వ్యతిరేకంగా రెండు వైపులా పనిచేస్తోందని సూచిస్తుంది. జెఎన్‌యు టీచర్స్ అసోసియేషన్ ప్రకారం, 150 సందర్భాలలో ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులైన అభ్యర్థులు అందుబాటులో ఉన్నప్పటికీ, ఎంపిక కమిటీలు ఎవరినీ 'నియామకానికి తగినవారుగా' ఎందుకు గుర్తించలేకపోయాయి. ప్రత్యేకించి అనేక రిజర్వ్‌డ్ పోస్టుల విషయం లో ఇది జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి.

నిజానికి, స్పష్టంగా ఉన్న నియమాలను దాటవేయడం కంటే, అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి, వారిలో ఎవరిని ఎంపిక చేయాలో తుది నిర్ణయం తీసుకునే ఎంపిక కమిటీని వైస్ ఛాన్సలర్ స్వయంగా ఎంపిక చేసుకోవడం సులభం. అదనంగా ప్రతి ఎంపిక కమిటీకి వైస్ ఛాన్సలర్ అధ్యక్షుడిగా ఉంటారనేది వాస్తవం. కమిటీలోని ముగ్గురు విషయ నిపుణులైన సభ్యులను ఎంపిక చేసే అధికారాన్ని కూడా ఈ 'నియమాలు' వైస్ ఛాన్సలర్‌కు కట్టబెడతాయి. వారిని విశ్వవిద్యాలయం శాసనబద్ధ సంస్థలచే ముందుగా ఆమోదించబడిన ఒక ప్యానెల్ నుండి ఎన్నుకోవాలి. ఈ సంస్థలకు కూడా వైస్ ఛాన్సలర్ అధ్యక్షత వహిస్తారు. ప్రస్తుతం జెఎన్‌యులో, విసి ఇప్పటికే తీసుకున్న అన్ని నిర్ణయాలను 'ఆమోదించడానికి' ఈ సమావేశాలన్నీ ఆన్‌లైన్‌లో జరిగి, త్వరితగతిన ముగుస్తాయి.

జెఎన్‌యు వైస్ ఛాన్సలర్‌గా ఎం.జగదీశ్ కుమార్ ఉన్నప్పటి నుండే, నియామకాలు జరగాల్సిన సంబంధిత కేంద్రాలు లేదా విభాగాల అధ్యాపకులు సిఫార్సు చేసిన పేర్లతో మాత్రమే నిపుణుల 'ఆమోదిత' జాబితాను రూపొందించే పద్ధతి ఆగిపోయింది. తద్వారా ఆ సమతుల్యతను కాపాడే విధానం తొలగించి, వైస్ ఛాన్సలర్లు (విసిలు) తమకు నచ్చిన పేర్లను ప్యానెళ్లలో చేర్చడం ప్రారంభించారు. విశ్వవిద్యాలయానికి వెలుపలి నుంచి ఉండాల్సిన విషయ నిపుణులతో పాటు, సంబంధిత కేంద్రం/విభాగం చైర్‌పర్సన్, సంబంధిత డీన్ ఆఫ్ స్కూల్స్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. అయితే, గత విసి కాలం నుంచే ఈ పదవుల్లో ఉండేవారిని విసి స్వయంగా ఎంపిక చేయడం, వారి పదవీకాలం పూర్తిగా విసి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండటం మొదలైంది. అంతకుముందు దశాబ్దాల పాటు, అర్హులైన అధ్యాపకుల సీనియారిటీ ఆధారంగా ఈ పదవులు రొటేషన్ పద్ధతిలో (వారీగా) కేటాయించబడేవి.

నిపుణుల ప్యానెళ్లను ఆమోదించే, ఎంపిక కమిటీల సిఫార్సులను స్వీకరించే చట్టబద్ధమైన సంస్థలలో కూడా ఈ విభాగ అధిపతులు, డీన్‌లే అత్యధిక సంఖ్యలో సభ్యులుగా ఉంటారు. అధ్యాపకుల నియామక ప్రక్రియలో భాగమైన 'ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్' (ఐక్యూఎసి) డైరెక్టర్ వంటి ఇతర పదవులకు కూడా విసియే నియామకాలు చేపడతారు. అధ్యాపకుల నియామక ప్రక్రియలో వచ్చిన ఈ మార్పులన్నీ ఎంపిక ప్రక్రియపై నియంత్రణను పూర్తిగా విసి చేతుల్లోకి కేంద్రీకరించాయి. నియామకాలపై విసి తన ఇష్టాయిష్టాలను రుద్దడానికి వీలు కల్పించాయి.

నియామకాలకు సంబంధించిన ప్రస్తుత యుజిసి నిబంధనలు 2018లో జారీ చేయబడ్డాయని, ఎం. జగదీశ్ కుమార్ విసిగా ఉన్న సమయంలోనే జెఎన్‌యు వాటిని అమలులోకి తెచ్చిందని కూడా గమనించాలి. ప్రస్తుత విసి శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ లాగే, ఆయనను కూడా మోదీ ప్రభుత్వం నియమించింది. ఆ తర్వాత ఆయన యుజిసి చైర్మన్ పదవికి పదోన్నతి పొందారు. ప్రతి ఎంపిక కమిటీలోని చివరి సభ్యుడైన 'విజిటర్ నామినీ'ని కూడా ప్రభుత్వమే నియమిస్తుంది. అయినప్పటికీ, అధ్యాపకుల నియామక ప్రక్రియపై జెఎన్‌యు విసికి ఉన్న సంపూర్ణ నియంత్రణను అదుపు చేయడానికి ప్రభుత్వం ఎప్పుడూ చర్యలు తీసుకోలేదు. పైగా నిబంధనల ఉల్లంఘనలు స్పష్టంగా కనిపిస్తున్నప్పుడు కూడా మౌనం వహించింది.

కొన్ని నెలల క్రితం ఒక పాడ్‌కాస్ట్‌లో చేసిన వ్యాఖ్యల కారణంగా జెఎన్‌యు విసిని తొలగించాలన్న డిమాండ్లను కూడా మోదీ ప్రభుత్వం తోసిపుచ్చింది. ఆ పాడ్‌క్యాస్ట్‌లో ఆమె యుజిసి నిబంధనలను బహిరంగంగా ప్రశ్నించడమే కాకుండా, అత్యంత కులతత్వపూరితమైన వ్యాఖ్యలు కూడా చేశారు. జెఎన్‌యు మాజీ, ప్రస్తుత వైస్‌ఛాన్సలర్ల వ్యవహార శైలికి లభించిన ఈ మౌన ఆమోదానికి ఒకే ఒక కారణం ఉండవచ్చు. అధ్యాపకుల నియామక ప్రక్రియలో ప్రభుత్వం కోరుకున్న విధంగానే వారు వ్యవహరించడం. విద్యాపరమైన అర్హతలు లేదా సామర్థ్యానికి బదులుగా, అభ్యర్థుల రాజకీయ సైద్ధాంతిక ధోరణి లేదా ప్రభుత్వం, జెఎన్‌యు యంత్రాంగంలోని శక్తివంతమైన వ్యక్తులతో వారికి ఉన్న వ్యక్తిగత సంబంధాలే నియామకానికి ప్రాతిపదికగా మారాయి. జెఎన్‌యులో, బోధనేతర ఉద్యోగాలు అమ్ముడుపోవడం, అవి జెఎన్‌యు యంత్రాంగంలోని వ్యక్తులకు ఆర్థిక లాభం చేకూర్చే వనరులుగా మారడం అనే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేము.




గత పదేళ్లలో జెఎన్‌యులో జరిగిన పరిణామాల ప్రాముఖ్యతను ఈ క్రింది అంశాల ద్వారా అంచనా వేయవచ్చు. జెఎన్‌యు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం (2026 ఆగస్టు 8 నాటికి), జెఎన్‌యులోని మొత్తం 705 మంది రెగ్యులర్ అధ్యాపకులలో 322 మంది (దాదాపు 46 శాతం) ప్రస్తుత, మాజీ వైస్‌ఛాన్సలర్ల హయాంలోనే నియమితులయ్యారు. వీరిలో 189 మంది శాంతిశ్రీ పండిట్ పదవీకాలంలో (ఇది ఇంకా కొనసాగుతోంది)నియమితులైనవారే. ఈ కొత్త నియామకాలలో 246 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లలో 146 మంది, 182 మంది అసోసియేట్ ప్రొఫెసర్లలో 111 మంది ఉన్నారు. ప్రొఫెసర్ల విభాగంలో వీరి సంఖ్య సాపేక్షంగా తక్కువగా ఉంది. మొత్తం 277మందిలో కేవలం 65 మంది మాత్రమే ఉన్నారు. ఇందులో తక్కువ స్థాయి పోస్టుల్లో మొదట నియమితులై, ఆ తర్వాత పదోన్నతి ద్వారా ప్రొఫెసర్లుగా మారిన వారు కూడా ఉన్నారు. మరో మాటలో చెప్పాలంటే, నేరుగా ప్రొఫెసర్లుగా నియమితులైన వారి కంటే, ఈ కొత్తగా నియమితులైన వారిలో ఎక్కువమందికి విశ్వవిద్యాలయంలో సుదీర్ఘ పదవీకాలం లభిస్తుంది. 2016కు ముందు నియమితులైన వారు ఇప్పటికీ మొత్తం ప్రొఫెసర్ల సంఖ్యలో నాలుగింట మూడు వంతుల వాటాను కలిగి ఉన్నప్పటికీ, పదవీ విరమణలు, కొత్త నియామకాల కారణంగా ఆ నిష్పత్తి క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఫ్యాకల్టీ నియామకాలే కాకుండా, పదోన్నతుల ప్రక్రియ, ఈ కాలంలో నియమితులైన వారి ప్రొబేషన్ తర్వాత నియామకాలను ధృవీకరించడం వంటివి కూడా వివక్షాపూరిత సాధనాలుగా మార్చబడ్డాయి. 2016కు ముందు నియమితులైన వారిలో 100 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 71 మంది అసోసియేట్ ప్రొఫెసర్లలో చాలామంది ఇప్పటికీ అదే పదవుల్లో కొనసాగుతున్నారు. ఎందుకంటే, వారు కూడా విసి, ఆమె అధిపతుల నియంతృత్వానికి లొంగేంత వరకు వారి పదోన్నతులను నిలిపివేశారు.

జెఎన్‌యు ఫ్యాకల్టీ నియామకాలలో జరుగుతున్న దానిని, గతంలో వామపక్షాలు చేశాయని ఆరోపించబడిన దానిని సరిదిద్దడం లేదా తిప్పికొట్టడమేనని బిజెపి – ఆర్‌ఎస్‌ఎస్ కూటమి సమర్థిస్తోంది. జెఎన్‌యుకు సొంత ప్రవేశ పరీక్షలు ఉండటం, వాటిలో ప్రశ్నపత్రాల రూపకల్పన, మూల్యాంకనం ఫ్యాకల్టీ చేతుల్లోనే ఉండటం వల్ల, విద్యార్థుల కూర్పును, భావజాలాన్ని కూడా ఫ్యాకల్టీయే నియంత్రిస్తోందని వారు వాదించారు. ఈ వాదనలలోని అసంబద్ధత ఇప్పుడు ప్రభుత్వ చర్యల ద్వారానే రుజువైంది. ఫ్యాకల్టీ కూర్పును మార్చడమే కాకుండా, విశ్వవిద్యాలయం సొంత ప్రవేశ పరీక్షల స్థానంలో సియుఇటి, నెట్‌లను ప్రవేశపెట్టారు.

జెఎన్‌యుఎస్‌యు ఎన్నికలలో ఇప్పటికీ వామపక్షం ఆధిపత్యమే ఉంది. అంతేకాకుండా, జెఎన్‌యుకు చెందిన గత వైస్‌ఛాన్సలర్‌లలో ఎవరినీ ఏమాత్రం వామపక్షవాదిగా పరిగణించలేనప్పటికీ, గత ఇద్దరు విసిలు ఆర్‌ఎస్‌ఎస్, దాని సిద్ధాంతం పట్ల తమ విధేయతను, అనుబంధాన్ని ఎన్నడూ రహస్యంగా ఉంచలేదు. వారి ఆదేశాల మేరకే అధ్యాపకుల నియామకాలు పూర్తిగా విసి నియంత్రణలోకి వచ్చాయి. స్వతంత్ర ఆలోచనను, అధ్యయనాన్ని ప్రోత్సహించే ఒక విద్యాసంస్థగా విశ్వవిద్యాలయాన్ని నాశనం చేయడానికి, దాని అధ్యాపకులను పైనుంచి వచ్చే ఆదేశాలకు విధేయులుగా మార్చడానికి మోదీ ప్రభుత్వ హయాంలో జెఎన్‌యు అధ్యాపకుల నియామకాలు ప్రధానంగా ఒక ప్రక్రియలో భాగమనే నిజాన్ని, దాని బూటకపు సమర్థన ఏదీ తొలగించలేదు. **(ఐపిఎ సర్వీస్)**

# యుపిఐపై కొత్త రుసుము ప్రయోజనం

**ఒక అభిప్రాయం**

భారతదేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవానికి యుపిఐ ఒక ప్రధాన కారణం. చిన్న టీ దుకాణం నుంచి పెద్ద షాపింగ్ మాల్ వరకు, కూరగాయల బండి నుంచి ఆన్‌లైన్ వ్యాపారం వరకు ప్రతి చోటా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి క్షణాల్లో డబ్బు చెల్లించడం ఇప్పుడు సాధారణమైపోయింది. ముఖ్యంగా వినియోగదారుడి నుంచి అదనపు రుసుము వసూలు చేయకపోవడం యుపిఐ విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటి. కానీ సెప్టెంబర్ 2026లో కేంద్ర ప్రభుత్వం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొత్త విధానాన్ని ప్రకటించడంతో యుపిఐ భవిష్యత్తుపై చర్చ మొదలైంది. అసలు మారింది ఏమిటి? ఎవరు డబ్బు చెల్లించాలి? వినియోగదారుడిపై భారం పడుతుందా? అమెరికా ఒత్తిడికి దీనికి సంబంధం ఉందా?

మొదట ఒక విషయం స్పష్టంగా తెలుసుకోవాలి. యుపిఐ పూర్తిగా చార్జ్‌డ్ వ్యవస్థగా మారలేదు. ఒక వ్యక్తి మరో వ్యక్తికి ఎంత మొత్తం పంపినా ఇప్పటికీ ఎలాంటి రుసుము ఉండదు. అలాగే వ్యాపారికి రూ.2,000 వరకు చేసే యుపిఐ చెల్లింపులు కూడా ఉచితమే. చిన్న వ్యాపారుల కోసం ప్రత్యేక రక్షణ ఉంది. క్యూఆర్ కోడ్ ద్వారా నెలకు రూ.1లక్ష వరకు స్వీకరించే చిన్న వ్యాపారులకు కూడా శూన్య రుసుము కొనసాగుతుంది. కేంద్రం ప్రకారం మొత్తం వ్యాపారిచెల్లింపులలో దాదాపు 96 శాతం ఈ కొత్త రుసుము పరిధిలోకి రావు.

అయితే రూ.2,000 దాటిన కొన్ని వ్యాపార లావాదేవీలకు కొత్తగా 0.4 శాతం 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' లేదా ఎం.డి.ఆర్. విధించనున్నారు. ఇది వినియోగదారుడిపై వేసే పన్ను కాదు. వ్యాపారి డిజిటల్ చెల్లింపును స్వీకరించడానికి చెల్లించే వ్యవస్థాపక రుసుము. ఉదాహరణకు ఒక వ్యాపారికి రూ.10,000 యుపిఐ ద్వారా చెల్లిస్తే 0.4 శాతం అంటే రూ.40. అయితే రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీకి ఈ రుసుము గరిష్ఠంగా రూ.300కే పరిమితం చేశారు. రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఇన్‌పుట్లు వంటి తక్కువ లాభాలతో నడిచే ముఖ్య రంగాలకు రూ.2,000 దాటిన లావాదేవీలపై రూ.5స్థిర రుసుము మాత్రమే ఉంటుంది. మూలధన మార్కెట్‌కు సంబంధించిన కొన్ని చెల్లింపులకు 0.02 శాతం రేటు, ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా రూ.300 పరిమితి పెట్టారు. ఇక్కడ అసలు ప్రశ్న— ఈ రుసుమును ఎవరు భరిస్తారు? ప్రభుత్వ ప్రకారం వినియోగదారుడు నేరుగా చెల్లించాల్సిన అవసరం లేదు. బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు, యుపిఐ యాప్‌లకు సంబంధించిన వ్యవస్థలోనే ఈ రుసుము పంచబడుతుంది. బ్యాంకులు వ్యాపారులు ఈ ఖర్చును వినియోగదారులపై నేరుగా మోపకుండా చూడాలని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. అంటే యుపిఐ చెల్లించేటప్పుడు మన ఫోన్‌లో అదనంగా రూ.10, రూ.20 వసూలు చేయడం ఈ విధానంలో అనుమతించబడదు.

అయితే పరోక్ష ప్రభావం ఉండదని మాత్రం ఖచ్చితంగా చెప్పలేం. ఒక వ్యాపారికి చెల్లింపులపై కొత్త ఖర్చు వస్తే అతను దాన్ని తన లాభంలో నుంచి భరించవచ్చు. లేక వ్యాపార నిర్వహణ ఖర్చులో భాగంగా తీసుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో వస్తువులు, సేవల ధరలను పెంచే అవకాశం కూడా ఉంటుంది. అది జరిగితే ప్రత్యక్షంగా యుపిఐ రుసుము చెల్లించకపోయినా, వినియోగదారుడిపై పరోక్ష భారం పడవచ్చు. అయితే ఇది తప్పనిసరిగా జరుగుతుందని చెప్పడానికి ఇప్పుడే ఆధారం లేదు. మరి రూ.2,000నే ఎందుకు ప్రాతిపదికగా తీసుకున్నారు? దీనికి ప్రధాన కారణం చిన్న మొత్తాల చెల్లింపులను రక్షించడమే. ఒక చిన్న దుకాణంలో రూ.200 లేదా రూ.500 కొనుగోలుపై రుసుము విధిస్తే డిజిటల్ చెల్లింపుల ప్రయోజనం తగ్గిపోవచ్చు. అందుకే రోజువారీ చిన్న చెల్లింపులను ఉచితంగా కొనసాగిస్తూ, పెద్ద వ్యాపారి లావాదేవీల నుంచి యూపీఐ వ్యవస్థ నిర్వహణకు కొంత ఆదాయం సమకూర్చాలన్నది కొత్త విధానం వెనుక ఉన్న ఆలోచన. ఇది ఎందుకు అవసరమైంది? యుపిఐ వినియోగం విపరీతంగా పెరిగింది. 2026 జూలైలోనే యుపిఐ ద్వారా 2,366 కోట్ల లావాదేవీలు జరిగాయి; వాటి మొత్తం విలువ రూ.29.9 లక్షల కోట్లకు చేరింది. ఆగస్టులో లావాదేవీల సంఖ్య సుమారు 2,400 కోట్లకు, విలువ దాదాపు రూ.27.7 లక్షల కోట్లకు చేరినట్లు తాజా నివేదికలు పేర్కొన్నాయి. ఇంత భారీ వ్యవస్థ ను నిర్వహించడానికి సర్వర్లు, బ్యాంకింగ్ మౌలిక సదుపాయాలు, సైబర్ భద్రత, మోసాల నివారణ, సాంకేతిక నిర్వహణ, వినియోగదారుల సేవలకి నిరంతరం ఖర్చు అవుతుంది.

ఇప్పటివరకు యుపిఐలో 'శూన్య ఎం.డి.ఆర్.' విధానాన్ని ప్రభుత్వం ప్రోత్సాహకాల ద్వారా కొనసాగించింది. ఉదాహరణకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి చిన్న వ్యాపారుల తక్కువ విలువైన యుపిఐ చెల్లింపులను ప్రోత్సహించేందుకు రూ.1,500 కోట్ల ప్రోత్సాహక పథకాన్ని కేంద్రం ప్రకటించింది. అంటే వినియోగదారుడికి, చిన్న వ్యాపారికి రుసుము లేకుండా ఉంచడం వెనుక ప్రభుత్వ ఆర్థిక సహాయం కూడా ఉంది.అందువల్ల ఇప్పుడు వచ్చిన మార్పును కేవలం 'యూపీఐపై పన్ను'గా చూడటం సరైనది కాదు. ఇది యూపీఐ వ్యవస్థ నిర్వహణ ఖర్చును ఎవరు భరించాలనే దానిపై తీసుకున్న విధాన నిర్ణయం. ప్రభుత్వం మొత్తం ఖర్చును భరించాలా? బ్యాంకులు భరించాలా? లేక పెద్ద వ్యాపారి లావాదేవీల నుంచి కొంత ఖర్చు తిరిగి పొందాలా? అన్న ప్రశ్నకు ప్రభుత్వం మూడో మార్గాన్ని ఎంచుకుంది.

అయితే ఈ నిర్ణయంపై రాజకీయ వివాదం కూడా మొదలైంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, రూ.2,000కు పైబడిన వ్యాపారి లావాదేవీలకు ఎం.డీ.ఆర్. విధించే మార్గం తెరవడం అమెరికా ఒత్తిడికి సంబంధించినదని ఆరోపించారు. రూ.2,000కు పైబడిన లావాదేవీలు మొత్తం లావాదేవీల సంఖ్యలో సుమారు 5శాతం మాత్రమే అయినప్పటికీ, మొత్తం విలువలో దాదాపు 65 శాతం ఉంటాయని ఆయన వాదించారు.

అమెరికా కోణం ఇక్కడ ఎందుకు వచ్చింది? వీసా, మాస్టర్‌కార్డ్ వంటి అంతర్జాతీయ చెల్లింపు సంస్థలు సాధారణంగా వ్యాపారుల నుంచి రుసుములు పొందే విధానంలో పనిచేస్తాయి. భారతదేశం మాత్రం యుపిఐని శూన్య ఎం.డి.ఆర్. విధానంతో వేగంగా విస్తరించింది. అందువల్ల భారత యుపిఐ నమూనా అంతర్జాతీయ చెల్లింపు వ్యవస్థలకు భిన్నమైనది. ఈ నేపథ్యంలో అమెరికా, అంతర్జాతీయ చెల్లింపు సంస్థల ప్రయోజనాలను ప్రస్తావిస్తూ రాజకీయ విమర్శలు రావడం సహజమే. కానీ అమెరికా ఒత్తిడి వల్లే ప్రభుత్వం ప్రస్తుత నిర్ణయం తీసుకుందని నిరూపించే బహిరంగ ఆధారం ఇప్పటివరకు లేదు. కాబట్టి దాన్ని నిర్ధారిత వాస్తవంగా కాకుండా రాజకీయ ఆరోపణగా మాత్రమే చూడాలి.

మరోవైపు ప్రభుత్వ వాదన కూడా స్పష్టంగానే ఉంది. యుపిఐను మరింత సురక్షితంగా, వేగంగా, విస్తృతంగా నిర్వహించాలంటే దీర్ఘకాలిక ఆదాయ వ్యవస్థ అవసరం. కొత్త విధానం ద్వారా సాధారణ ప్రజల చెల్లింపులను ఉచితంగా ఉంచి, పెద్ద వ్యాపారి లావాదేవీల నుంచి పరిమిత మొత్తాన్ని వ్యవస్థలోని భాగస్వాములకు అందించాలని ప్రభుత్వం చెబుతోంది. ఎం.డీ.ఆర్. ప్రభుత్వం వసూలు చేసే పన్ను కాదు; యూపీఐ వ్యవస్థలో పాల్గొనే బ్యాంకులు, చెల్లింపు సంస్థల మధ్య పంచబడే రుసుము అని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది.అందువల్ల యూపీఐపై జరుగుతున్న చర్చను 'ఇకపై యుపిఐ వాడితే డబ్బు కట్టాలి' అనే భయంగా చూడటం తప్పు. అదే సమయంలో 'ఏ మార్పూ జరగలేదు' అనడం కూడా సరైనది కాదు. శూన్య ఎం.డి.ఆర్. యుగంలో ఒక ముఖ్యమైన మార్పు వచ్చింది. అక్టోబర్ 15 నుంచి నిర్దిష్ట పెద్ద వ్యాపారి లావాదేవీలపై రుసుము ఉంటుంది. కానీ వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే చెల్లింపులు, రూ.2,000 వరకు వ్యాపారి చెల్లింపులు, నిర్దిష్ట చిన్న వ్యాపారుల లావాదేవీలు ఉచితంగానే ఉంటాయి. చివరికి యుపిఐ భవిష్యత్తును నిర్ణయించేది రుసుము ఉందా లేదా అన్నది మాత్రమే కాదు. యుపిఐ సరళతను, ప్రజల నమ్మకాన్ని, చిన్న వ్యాపారుల ప్రయోజనాలను కాపాడుతూ దాన్ని ఆర్థికంగా నిలకడగా ఎలా నిర్వహిస్తారన్నదే అసలు ప్రశ్న. యుపిఐ భారతదేశం సృష్టించిన అత్యంత ప్రభావవంతమైన డిజిటల్ మౌలిక సదుపాయాల్లో ఒకటి. దాని నిర్వహణ ఖర్చును సమర్థంగా పంచుకోవడం అవసరమే. కానీ ఆ ఖర్చు చివరికి ఎవరి మీద పడుతుంది, చిన్న వ్యాపారాలపై ఎంత ప్రభావం చూపుతుంది, ధరలు పెరుగుతాయా, ప్రభుత్వం ప్రకటించిన రక్షణలు ఎంత సమర్థంగా అమలవుతాయి అన్నదే ఈ కొత్త విధానానికి అసలు పరీక్ష.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్,**
9849328496

# సాగుకు తొలి ప్రాధాన్యత

**• విద్య, వైద్య, సాగునీటి రంగాలపై ప్రత్యేక దృష్టి • హరిత ఇంధన రాష్ట్రంగా తెలంగాణ • ప్రజా పాలన దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్రంలో సాగుకు తొలి ప్రాధాన్యతనిస్తున్నామని సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు రైతాంగానికి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పదంలో నడిపించడం ద్వారా తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో పయనించేందుకు దోహదపడుతుందన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జాతీ య పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భం గా భట్టి విక్రమార్క మాట్లాడుతూ సెప్టెంబర్ 17 న భారతదేశంలో అంతర్భాగంగా తెలంగాణ మారిందన్నారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన లో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ప్రజాస్వామిక స్వేచ్ఛ కోసం ఉద్యమించిన యోధుల వెలకట్టలేని త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని విక్రమార్క గుర్తు చేశారు. సబ్బండ వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని ఆయన తెలిపారు. ఉచిత బస్సు, రైతు భరోసా, గృహ జ్యోతి కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా అనేక మంది లబ్ధి పొందుతున్నారని 2030 నాటికి తెలంగాణలో 20వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యమే లక్ష్యంగా తీర్చిదిద్దుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సాగునీటి సమస్య పరిష్కారానికి సీతారామ ఎత్తిపోతల పథకం పాలేరు లింక్ కెనాల్, మున్నేరు, పాలేరు లింక్ కెనాల్, జవహ ర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి దారులకు 491.08 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించామని ఆయన తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రతి ప్రాంత సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రభు త్వం పని చేస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు.ఈ సందర్భంగా తెలంగాణ అమర వీరులు జర్పుల సురేష్, వేణు, వెంపటి రామకృష్ణ, మహబూబ్ పాషా, వేణుగోపాల్ కుటుంబ సభ్యులను ఆయన ఘనంగా సత్కరించారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇపిఎఫ్ఒ పరిమితి పెంచేందుకు పుష్కరకాల జాప్యం

**• రూ.25వేలకు పెంచారని కేంద్రాన్ని మెచ్చుకోవడం అసాధ్యం • సకాల నిర్ణయం లేకపోవడంతో లక్షలాది కార్మికులు నష్టపోయారు • వేతన పరిమితి రూ.30వేలకు పెంచాలి • కాలానుగుణ సవరణకు క్రమబద్ధ యంత్రాంగం ఏర్పాటు చేయండి • ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ డిమాండ్**



**న్యూఢిల్లీ:** అర్హులైన ఉద్యోగులకు ఇపిఎఫ్ఒ వేతన పరిమితిని కేంద్ర మంత్రివర్గం పుష్కరకాలం సుదీర్ఘ జాప్యం తర్వాత రూ.25 వేలకు పెంచడాన్ని ఎఐటియుసి తీవ్రంగా తప్పుపట్టింది. పన్నెండు సంవత్సరాలు తీవ్ర జాప్యం జరగడం వల్ల అర్హులైన ఉద్యోగులు లక్షల మంది ఇపిఎఫ్ఒ సదుపాయాలకు దూరంగా ఉండిపోవాల్సి వచ్చిందని, వారంతా తీవ్రంగా నష్టపోయారని, ఐనా రూ.25 వేలు పరిమితి చాలా తక్కువ అనీ ఎఐటియుసి విమర్శించింది. ఎప్పుడో చేయాల్సిన పని తీవ్ర జాప్యం తర్వాత చేశారని, ఇందులో మెచ్చుకోవడానికి, ఆహ్వానించి హర్షం ప్రకటించడానికి ఏమీ లేదని, అలా చేయడం అసాధ్యమైన విషయమని కూడా ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్‌కౌర్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇప్పటికైనా ప్రస్తుత పరిస్థితులు, ధరలు, జీవన వ్యయాలకు అనుగుణంగా ఉద్యోగులకు ఇపిఎఫ్ఒ వేతన పరిమితిని రూ.30 వేలకు పెంచాలని ఆమె డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మిక సంఘాలు తీవ్ర ఒత్తిడి చేసి పదేపదే అడిగిన తర్వాత ఆలస్యంగా స్పందించడం కంటే, ఎప్పటికప్పుడు వేతనాలు, ధరలు, జీవన వ్యయాలకు అనుగుణంగా ఈ పరిధిని కాలానుగుణంగా సవరించడానికి, విస్తరించడానికి వీలుగా ఒక క్రమబద్ధమైన, స్వయం చాలక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కూడా డిమాండ్ చేశారు. ఇపిఎఫ్ఒ పరిధి విస్తరణ కేవలం ఒక సంఖ్యాపరమైన ప్రక్రియగా మారిపోకూడదని, పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని స్పందించాలని కోరారు. ఇపిఎఫ్ఒ పరిధిలోకి కార్మికులను తీసుకువచ్చినంత మాత్రాన సరిపోదని, యాజమాన్యాలు తమ తమ వాటాలను చట్టబద్ధంగా,క్రమబద్ధంగా జమ చేసేవిధంగా చూడాలని,కార్మికులకు అర్థవంతమైన ప్రావిడెంట్ ఫండ్,పెన్షన్,బీమా రక్షణ ఇవ్వాలని కోరారు. ఇపిఎఫ్ఒ పరిమితిని ఉద్యోగులకు పెంచుతూ చివరి సారి 2014 సెప్టెంబరునెలలో సవరించారని, అప్పటి నుండీ దేశంలో ధరలు,జీవన వ్యయాలు గణనీయంగా పెరిగిపోయాయని పేర్కొన్నారు. ఈ పరిమితి పెంచాలని అనేకసార్లు కార్మిక సంఘాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చాయని,పదే పదే అడిగినాగానీ పట్టించుకోలేదని విమర్శించారు. రూ.15 వేల వేతన పరిమితిపై తీవ్రమైన ఒత్తిడి పెరగడంతో 2022లో పార్లమెంటులో కూడా అధికారికంగా ప్రస్తావనకు తెచ్చారని, ఐనాగానీ పట్టించుకోలేదని విమర్శించారు. ఇపిఎఫ్ఒ సెంట్రల్ బోర్డులో ఉద్యోగుల తరపున ఉన్న ప్రతినిధులు కూడా రూ.25 వేలకు పరిమితిని పెంచాలని డిమాండ్ చేశారని, 2024 ఫిబ్రవరిలో ప్రత్యేకంగా ఈ విషయంపై ప్రతిపాదన లేవనెత్తినాగానీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని అమర్‌జీత్ కౌర్ విమర్శించారు. దీనివల్ల లక్షలమంది కార్మికులు రూ.15 వేలు కంటే ఎక్కువ సంపాదించుకున్నాగానీ, ఈ సదుపాయానికి నోచుకోలేకపోయారని, ప్రభుత్వం సకాలంలో నిర్ణయం తీసుకోకపోవడంవల్ల లక్షల మంది కార్మికులు తీవ్రంగా నష్టపోయారని,అందువల్ల కేంద్ర ప్రభుత్వాన్ని ఈ విషయంలో మెచ్చుకోవడం అసాధ్యమైన విషయమని విమర్శించారు. రూ.25 వేతన పరిమితిని ఇపిఎఫ్ఓలో పెంచడం చాలా తక్కువ, ఇలాంటి పెరుగుదల కార్మికుల సామాజిక భద్రతకు,వేతనాలకు,జీవన వ్యయాలకు అనుగుణంగా జరగాలి,ఉద్యోగులు అంతిమంగా నెలవారీ ఇంటికి తీసుకువెళ్ళే జీతం విషయంలో ఎఐటియుసి తీవ్ర ఆందోళన చెందుతోంది,ఒక ఉద్యోగిపై యాజమాన్యం ప్రతి సంవత్సరం ఖర్చు చేసేదానికి అదనంగా ఇపిఎఫ్ఓకు తన వాటాను జమ చేయాలి తప్ప అతడికి వచ్చే వేతనాలనుండి తగ్గించడం లేదా సర్దుబాటు చేయడం వంటి చర్యలకు పాల్పడకూడదు అని అమర్‌జీత్ కౌర్ తన ప్రకటనలో హెచ్చరించారు.

## ‘సెప్టెంబర్ 17ను’ సైనిక చర్యగా చూడటం సరికాదు

**టిజెఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెసిఆర్ కుటుంబం పేర్లతో అక్రమంగా ఉన్న ప్రభుత్వ భూములను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఆ భూములను పేదలకు, దళితులకు, తెలంగాణ ఉద్యమకారులకు పంపిణీ చేయాలని టిజెఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ డిమాండ్ చేశారు. ‘సెప్టెంబర్ 17ను’ కేవలం సైనిక చర్యగా చూడటం సరికాదని, నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటాల పాత్రను విస్మరించలేమన్నారు. ‘సెప్టెంబర్ 17’ విలీన దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలోఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన సందర్భాన్ని ఒక చారిత్రక వాస్తవాల నేపథ్యంగా అర్థం చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 17ను మతపరమైన కోణంలో ప్రచారం చేస్తూ తెలంగాణలోని గంగా జమునా తహజీబ్‌కు భంగం కలిగించే ప్రయత్నాలు చేయడం తగదని సూచించారు. నాటి నిజాం వ్యతిరేక పోరాటం నుంచి సీమాంధ్ర పాలకుల దోపిడీకి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ ఉద్యమం వరకు ప్రజాస్వామిక తెలంగాణ కోసం జరిగిన పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపు నిచ్చారు. ప్రజల ఆస్తిగా ఉన్న ప్రభుత్వ భూములు కొద్ది మంది చేతుల్లో ఉండకుండా సామాజిక న్యాయం కోసం వినియోగించాలని ఆయన సూచించారు.



నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ సంస్థానం విముక్తి పొంది భారత యూనియన్‌లో విలీనమైన సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో జాతీయ పతాకాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, అరుణ పతాకాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎగురవేశారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గసభ్యురాలు పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు కె.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కళవేణ శంకర్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.జ్యోతి, బొమ్మగాని ప్రభాకర్, ఆర్.అంజయ్య నాయక్, కౌన్సిల్ సభ్యులు ఫైమీదా బేగం, బి.వెంకటేశం, మారగోని ప్రవీణ్ కుమార్, మారపాక అనిల్ కుమార్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ క్రీడా శక్తిని మరింత బలోపేతం చేద్దాం

**ఎల్. బి.స్టేడియంలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను గురువారం ఎల్ బిస్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్, ఎండి డాక్టర్ ఏ.సోనీబాలా దేవి, ఐఎఫ్ఎస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ గత రెండున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి అనేక వినూత్న కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. క్రీడాకారుల అవసరాలకు అనుగుణంగా పలు కీలకమైన, క్రియాశీలక కార్యక్రమాలను అమలు చేస్తూ స్పోర్ట్స్ అథారిటీ క్రీడాకారులకు మరింత చేరువవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడా ప్రతిభను వెలికితీయడం, యువతను క్రీడల వైపు ఆకర్షించడం, క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, సదుపాయాలు అందించడం లక్ష్యంగా స్పోర్ట్స్ అథారిటీ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఆమె వివరించారు. ఎన్నో పోరాటాలు, త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజలో నిలిచినట్టే క్రీడారంగంలోనూ దేశంలో అగ్రగామిగా ఎదగాల్సిన అవసరం ఉందని డాక్టర్ సోనీబాలా దేవి అన్నారు. ఈ లక్ష్య సాధనకు క్రీడా సమాజం మొత్తం చిత్తశుద్ధితో సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, కోచ్‌లు, సిబ్బంది, క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటు బ్యాంకు కోసమే..‘హైదరాబాద్ విమోచన దినోత్సవం’ నిర్వహించడం లేదు

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డితో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాంచందర్ రావు మాట్లాడుతూ ఆగస్టు 15న దేశానికి బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం వస్తే, సెప్టెంబర్ 17న నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అకృత్యాల నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందన్నారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ‘ఆపరేషన్ పోలో’ ద్వారా హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తి చేసి భారత యూనియన్‌లో విలీనం చేశారన్నారు. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసమే కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రభుత్వాలు సెప్టెంబర్ 17ను ‘విమోచన దినోత్సవం’గా అధికారికంగా నిర్వహించడానికి భయపడుతున్నాయని విమర్శించారు. బిజెపి పోరాటాల ఫలితంగానే పేర్లు మార్చి అయినా వేడుకలు చేయాల్సిన పరిస్థితి ఆ పార్టీలకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు డాక్టర్ గౌతమ్ రావు, టి. వీరేందర్ గౌడ్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, పొంగులేటి సుధాకర్ రెడ్డి, నాయకులు శాంతకుమార్, జయశ్రీ, రాణి రుద్రమ పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాటంలో బిజెపి, కాంగ్రెస్ పాత్ర లేదు : కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుల స్ఫూర్తితో రాష్ట్రంలో అరాచక శక్తులను గద్దె దించుతామని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కాంగ్రెస్, బిజెపి పాత్ర లేదన్నా రు. ‘సెప్టెంబర్ 17’ తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని టిఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన జాతీయ జెండాను కవిత ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సెప్టెంబర్ 17 తెలంగాణ పౌరుషానికి, పోరాట పటిమకు, అమరుల త్యాగాల చరిత్రకు నిదర్శనమన్నారు. నిజాం పాలన నుంచి విముక్తి కోసం సాగించిన సాయుధ రైతాం గ పోరాటాన్ని కాంగ్రెస్, బిజెపిలు రాజకీయ పబ్బం గడుపుకునేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం ‘స్టేట్ కాంగ్రెస్’ వల్లే జరిగిందని ముఖ్యమంత్రి అబద్ధాలు చెబుతుంటే, ముస్లిం రాజుపై హిందువులు చేసిన మతపరమైన పోరాటంగా చిత్రీకరించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని కవిత మండిపడ్డారు. వట్టికోట ఆళ్వార్ స్వామి, సురవరం ప్రతాప రెడ్డి, రావి నారాయణ రెడ్డి వంటి మేధావులు ఉరూరా తిరిగి ప్రజలకు చదువు చెప్పారని, ఆంధ్ర మహాసభ ద్వారా ప్రజలను సంఘటితం చేశారని గుర్తు చేశారు. అదే సమయంలో కాళోజీ, దాశరథిల కలాల గర్జనలు, షోయాబుల్లాఖాన్, మగ్దూం మొయినుద్దీన్ వంటి మహనీయుల కృషి కారణంగా ప్రజల్లో చైతన్య స్ఫూర్తి రగిలిందని అన్నారు. ఆ చైతన్యం నుంచే దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ వంటి వీరులు పుట్టుకొచ్చారన్నారు.



వెయ్యి రోజుల ప్రజాపాలనలో..

## రవాణా రంగంలో టిజిఎస్ ఆర్‌టిసి నవ శకానికి నాంది

**టిజిఎస్ ఆర్‌టిసి వైస్ చైర్మన్, ఎండి వై. నాగిరెడ్డి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వెయ్యి రోజుల ప్రజాపాలనలో రవాణా రంగంలో నవ శకానికి టిజిఎస్ ఆర్‌టిసి నాంది పలికిందని టిజిఎస్ ఆర్‌టిసి వైస్ చైర్మన్, ఎండి వై.నాగిరెడ్డి అన్నారు. ప్రజాపాలన వెయ్యి రోజుల సందర్భంగా బస్‌భవన్‌లో వై.నాగిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆర్‌టిసి సేవలు ‘లైఫ్‌లైన్’గా మారాయని పేర్కొన్నారు. వెయ్యి రోజుల పాలనలో 2,932 నూతన బస్సులు, 1,024 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. హైదరాబాద్‌లో త్వరలో మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామన్నారు. 13 నూతన బస్‌స్టేషన్లు, డిపోల నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. ‘మహాలక్ష్మి’ ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళల సాధికారతకు దోహదపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సిహెచ్.వెంకన్న, ఎం.రాజశేఖర్, ఎఫ్ఎ విజయపుష్ప, సిపిఎం ఉషాదేవి, సిసిఇ కవిత, సిఎంఇ జానీరెడ్డి, సిటిఎం శ్రీదేవి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసు ఉద్యోగాల పరీక్షలకు తేదీలు ఖరారు

- నవంబర్ 29న ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్ష
- డిసెంబర్ 20న కానిస్టేబుల్ పరీక్ష
- 4 నోటిఫికేషన్లకు 4.29 లక్షల మంది అభ్యర్థులు.. 5.77 లక్షల దరఖాస్తులు
- అభ్యర్థులకు భారీ పోటీ.. 7,437 పోస్టులకు నియామక ప్రక్రియ వేగవంతం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పోలీసు శాఖలో ఉద్యోగాల భర్తీకి నిర్వహించనున్న ప్రిలిమినరీ రాత పరీక్షలకు తేదీలు ఖరారయ్యాయి. సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ), సమాన స్థాయి పోస్టులకు నవంబర్ 29న, పోలీస్ కానిస్టేబుల్, సమాన స్థాయి పోస్టులకు డిసెంబర్ 20న ప్రిలిమినరీ రాత పరీక్షలు నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టిఎస్ఎల్‌పిఆర్‌బి) సన్నాహాలు చేస్తోంది. ఆదివారం ఉదయం పరీక్షలు నిర్వహించనున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో నియామక మండలి చైర్మన్ వి.వి శ్రీనివాసరావు తెలిపారు. అయితే ఇవి తాత్కాలిక తేదీలు అని, తదుపరి పరిణామాల ఆధారంగా స్వల్ప మార్పులు ఉండవచ్చని స్పష్టం చేశారు. పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, అగ్నిమాపక–విపత్తుల స్పందన–అత్యవసర సేవలు, జైళ్లు–దిద్దుబాటు సేవల శాఖల్లో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి జూలై 29న నాలుగు నోటిఫికేషన్లు జారీ చేశారు. ఎస్ఐ, ఎఎస్ఐ స్థాయిలో 298, కానిస్టేబుల్ స్థాయిలో 7,139 పోస్టులు ఉన్నాయి. ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. ఈ నియామకాలకు మొత్తం 5,77,064 దరఖాస్తులు అందగా, వీటిని దాఖలు చేసిన వాస్తవ అభ్యర్థుల సంఖ్య సుమారు 4.29 లక్షలుగా ఉంది. అంటే ఒక్కో అభ్యర్థి సగటున 1.34 దరఖాస్తులు చేశారు. 68.45 శాతం మంది ఒక్క పోస్టుకే దరఖాస్తు చేయగా, 28.88 శాతం మంది రెండు పోస్టులకు దరఖాస్తు చేశారు. మూడు పోస్టులకు దరఖాస్తు చేసిన వారు 2.423 శాతం, నాలుగు పోస్టులకు 0.2 శాతం, ఐదు పోస్టులకు 0.046 శాతంగా ఉన్నారు. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసిన 1,35,359 మంది అభ్యర్థులకు ఉమ్మడి శారీరక కొలతలు, సామర్థ్య పరీక్ష నిర్వహణ ద్వారా ఆదా అయిన మొత్తానికి అనుగుణంగా ఫీజులో రాయితీ కల్పించినట్లు బోర్డు వెల్లడించింది. దరఖాస్తుల్లో బిసి వర్గాల వాటా దాదాపు 49.19 శాతం కాగా, ఎస్‌సి,ఎస్‌టి వర్గాలకు చెందిన దరఖాస్తులు 43.60 శాతంగా ఉన్నాయి. ఒసి వర్గాల దరఖాస్తులు 7.20 శాతంగా నమోదయ్యాయి. ఇందులో తెలంగాణేతర రాష్ట్రాలకు చెందిన అభ్యర్థుల దరఖాస్తులు 3.45 శాతం ఉన్నట్లు నియామక మండలి తెలిపింది. మహిళా అభ్యర్థుల నుంచి 1,46,220 దరఖాస్తులు (25.33 శాతం) రాగా, పురుష అభ్యర్థుల నుంచి 4,30,844 దరఖాస్తులు (74.66 శాతం) వచ్చాయి. ఎస్ఐ సివిల్, సమాన స్థాయి పోస్టులకు 1,60,756 దరఖాస్తులు, పిసి సివిల్, సమాన స్థాయి పోస్టులకు 3,89,356 దరఖాస్తులు అందాయి.ఎస్ఐ సివిల్, సమా న స్థాయి పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు మూడు దశల వడపోత ప్రక్రియలో భాగంగా ముందుగా ప్రిలిమినరీ రాత పరీక్ష ఉంటుంది. పిసి సివిల్, సమాన స్థాయి పోస్టులకు కూడా ఇదే విధంగా మూడు దశల ఎంపిక ప్రక్రియలో ప్రిలిమినరీ రాత పరీక్ష తొలి దశగా ఉంటుంది. ఏఎస్ఐ ఫింగర్ ప్రింట్ బ్యూరో, పిసి డ్రైవర్, పిసి మెకానిక్ పోస్టులకు దరఖాస్తు చేసిన వారికి మాత్రం రెండు దశల ఎంపిక ప్రక్రియలో భాగంగా ముందుగా శారీరక కొలతలు,శారీరక సామర్థ్య పరీక్ష నిర్వహించనున్నారు. సుమారు 1.60 లక్షల మంది అభ్యర్థులకు నవంబర్ 29న ఉదయం ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్షను తె లంగాణలోని గతంలో ఉన్న 10 జిల్లాల కేంద్రాల్లో నిర్వహించే అవకాశం ఉంది. ఇక సుమారు 3.89 లక్షల మంది పిసి అభ్యర్థులకు డిసెంబర్ 20న ఉదయం ప్రిలిమినరీ రాత పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకోసం గతంలోని 10 జిల్లా కేంద్రాలతో పాటు మొత్తం 15 నుంచి 18 ప్రాంతాలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేయనున్నారు.

### ఆధార్ ఫేస్ అథెంటికేషన్ తప్పనిసరి

పోలీస్ నియామక ప్రక్రియలో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఆధార్ ఫేస్ అథెంటికేషన్‌లో 97.4 శాతం మంది అభ్యర్థులు విజయవంతంగా ప్రక్రియను పూర్తి చేశారు. మిగిలిన 2.6 శాతం మంది అభ్యర్థులు సెప్టెంబర్ 30లోగా తమ లాగిన్‌లోకి వెళ్లి ఫేస్ అథెంటికేషన్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అనంతరం వారు తమ దరఖాస్తు ఫారాలను పిడిఎఫ్ రూపంలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని బోర్డు తెలిపింది. ఇదిలా ఉండగా, ఎస్ఐ/ఎఎస్ఐ స్థాయి పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిపై అదనంగా 7 సంవత్సరాలు, పిసి డ్రైవర్ పోస్టులకు 7 సంవత్సరాలు, ఇతర పిసి స్థాయి పోస్టులకు 10 సంవత్సరాల వయో సడలింపు ఇవ్వడంతో దాదాపు 1.13 లక్షల మంది అభ్యర్థులకు ప్రయోజనం కలిగినట్లు టిఎస్ఎల్‌పిఆర్‌బి వెల్లడించింది. పరీక్షకు తెలుగు మాధ్యమాన్ని 56.84 శాతం మంది, ఇంగ్లిష్‌ను 43.02 శాతం మంది ఎంచుకోగా, ఉర్దూ మాధ్యమాన్ని 0.12 శాతం మంది ఎంచుకున్నారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, డివిజన్-30, జిహెచ్ఎంసి.**

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
| --- | --- | --- | --- | --- |
| NIT No. 26/ E.E.30/ GHMC/ 2026-27, Dated: 16.09. 2026 | జిహెచ్ఎంసి, కెజెడ్, డివిజన్ 30 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు | రూ. 23.603 లక్షలు | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 17.09.2026 ఉ.11.00గం.లకు మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 18.09.2026 ఉ.11.00గం.ల వరకు (ఐటెమ్ నెం.1), బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 17.09.2026 ఉ.11.00గం.లకు మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 21.09.2026 ఉ.11.00గం.ల వరకు (ఐటెమ్ నెం. 02 to 05) | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-30, జిహెచ్ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ 30, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 10127-PP/CL/ADVT/2026-27, Date: 17-09-2026

**hmda హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.

**HMDA Act. 2008లోని సెక్షన్ 15 (3) ప్రకారం బహిరంగ ప్రకటన**

**(ప్రభుత్వ ఉత్తర్వు నెం. e3663401/Plg.I(1)/2026-1, తేదీ: 03.09.2026)**

HMDA చట్టం 2008 (చట్టం నం. 8/2008)లోని సెక్షన్ 15, ఉప-విభాగం (1) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ, G.O.Ms. నం. 33, MA & UD, తేదీ: 24.01.2013 ద్వారా ప్రభుత్వం ఆమోదించిన “మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ప్లాన్ (MDP-2031)”లో పేర్కొన్న భూ వినియోగ విధానానికి సంబంధించి ఈ క్రింది ముసాయిదా మార్పును ప్రతిపాదించడమైనది.

**యాదాద్రి-భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, దండుమల్కాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 617, 644, 705, 707, 708, 709, 710 మరియు 765 ల మీదుగా వెళ్లేలా MDP-2031లో ప్రతిపాదించిన 90 మీటర్ల RRR రోడ్డును (మొత్తం 39.51 ఎకరాల విస్తీర్ణంలో, A, B నుండి C, D వరకు గుర్తించబడినది) తొలగించడం.**

దీనికి సంబంధించిన వివరాలు http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్లలో అందుబాటులో ఉన్నాయి.

పైన పేర్కొన్న ప్రతిపాదనలపై ఎవరైనా వ్యక్తులు లేదా సంస్థల నుండి అభ్యంతరాలు / సూచనలు స్వీకరించబడతాయి. ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి **పదిహేను (15) రోజులలోపు,** వారు తమ అభ్యంతరాలు / సూచనలు లిఖితపూర్వకంగా HMDA మెట్రోపాలిటన్ కమిషనర్ (M.C)కు లేదా ప్రధాన కార్యదర్శి, MA & UD శాఖ, తెలంగాణ సచివాలయం, హైదరాబాద్ వారికి సమర్పించవచ్చు.

సం/- డైరెక్టర్ (ప్లానింగ్-I), HMDA

DIPR R.O. No. : 10176-PP/CL/ADVT/2026-27, Date: 17-09-2026

## ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/జగిత్యాల : జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పి కార్యాలయంలోఎస్పి అశోక్ కుమార్ జాతీయ జెండాలను ఎగురవేసి జగిత్యాల జిల్లా అభివృద్ధిని ప్రజలకు వివరించారు.అలాగే బిఆర్ఎస్ భవన్‌లో మాజీ మంత్రి జీవన్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి విమోచన దినోత్సవ వేడుకలను నిర్వహించారు.జెడ్పిమాజీ చైర్ పర్సన్ దావ వసంత తదితరులు ఉన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

## 19న 'ఆల్ఫోర్స్'లో జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక


ప్రజాపక్షం/సుల్తానాబాద్ : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే పెద్దపెల్లి జిల్లా కబడ్డీ జట్లను ఈనెల 19న సుల్తానాబాద్ లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కరుణాకర్ రెడ్డి తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో పెద్దపెల్లి జిల్లా స్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాల బాలికలకు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు శనివారం ఉదయం 11 గంటలకు సుల్తానాబాద్ లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం లేదా ఎస్ఎస్‌సిమెమోతో హాజరు కావాలన్నారు. జూనియర్ బాలుర విభాగంలో 20 సంవత్సరాల లోపు ఉండి 75 కిలోల బరువు ఉండాలన్నారు. బాలికల విభాగంలో 20 సంవత్సరాల లోపు ఉండి 65 కిలోల బరువు ఉండాలన్నారు.సబ్ జూనియర్ బాలబాలికల విభాగంలో 16 సంవత్సరాల లోపు వయస్సు ఉండి 55 కిలోల బరువు ఉన్నవారు అర్హులని తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. మిగతా వివరాలకు 9908133143, 9866974147 లో సంప్రదించాలని కోరారు.

## గన్నేరువరంలో విద్యుత్ సమస్యకు పరిష్కారం




ప్రజాపక్షం /గన్నేరువరం : గన్నేరువరం మండల కేంద్రంలో నిరంతరం జరుగుతున్న విద్యుత్ కోతల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ గురువారం 'ప్రజాపక్షం' దినపత్రికలో వెలువడిన కథనానికి అధికారులు తక్షణమే స్పందించారు. ప్రజాపక్షం వార్తకు స్పందించిన మండల విద్యుత్ శాఖఎఇ ఆంజనేయులు విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. మండల కేంద్రంలో ఎదురవుతున్న లోవోల్టేజ్ , విద్యుత్ అంతరాయాల సమస్యను పరిష్కరించేందుకు ఎఇ ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారు. గురువారం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

## ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠా అరెస్టు



ప్రజాపక్షం/మల్యాల : వ్యవసాయ పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ వైర్లను చోరీ చేస్తున్న అంతర్ జిల్లా ముఠాను జగిత్యాల జిల్లా మల్యాల పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేయగా.. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల, వెల్గటూర్, ధర్మపురి, గొల్లపల్లి, బుగ్గారం మండలాల్లోని వివిధ గ్రామాల్లో నిందితులు తొమ్మిది చోరీలకు పాల్పడి 10 ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైర్లను అపహరించినట్లు విచారణలో వెల్లడైనట్లు వివరించారు.రాత్రివేళల్లో నిర్మానుష్య ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను ప్రత్యేక పరికరాలతో తెరిచి వైర్లను తొలగించి ఆటోలో తరలించేవారని,నిందితుల నుంచి ప్రయాణికుల ఆటో, మొబైల్‌ఫోన్, 39 కిలోల కాపర్ వైర్, ట్రాన్స్‌ఫార్మర్లు తెరవడానికి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు తపాలా బాబును పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సిఐ వివరించారు.కేసును ఛేదించిన ఎస్ఐ సందీప్‌కుమార్, కానిస్టేబుళ్లు రాజేందర్,ఆంజనేయులు, విక్రాంత్,ఇతర సిబ్బందిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

## మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : మహిళలను ఆర్థికంగా, పారిశ్రామికంగా శక్తివంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.గురువారం కలెక్టరేట్‌లో మహిళా సాధికారత కేంద్రం పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.మహిళలకు బ్యాంకింగ్, పొదుపు, రుణాలు,ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని,మార్కెట్ డిమాండ్ ఉన్న రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి, స్వయం ఉపాధి కల్పించాలని ఆదేశించారు. మహిళలు ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు.జిల్లాలోని వీహబ్ సేవలను మహిళా పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని, ఆర్‌టిసిబస్సులు, పెట్రోల్ బంకులు, ఎంఎస్ఎం ఇ రంగాల్లో అవకాశాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో డిఆర్‌డిఎ, వైద్య ఆరోగ్య, ఉపాధి శాఖ అధికారులు,లీడ్ బ్యాంక్ మేనేజర్, వీహబ్, టాస్క్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం : కలెక్టర్

ప్రజాపక్షం/దుబ్బాక: దుబ్బాక మండలం రామక్కపేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలను జిల్లా కలెక్టర్ హైమావతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కలెక్టర్ అన్నం, పప్పు క్యాబేజీకర్రి, రసం, గుడ్డు, నెయ్యిని పరిశీలించి, భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రత, వంటశాల నిర్వహణపై ఆరా తీశారు. భోజన తయారికీ వినియోగిస్తున్న సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, కూరగాయాల పరిమాణాన్ని కూడా కొలిచి పరిశీలించారు, వంట శాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆహారం తయారి సమయంలో పరిశుభ్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కామన్ డైట్ మెనూ ప్రకారం ప్రతి రోజు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు.

# సంక్షేమంలో 'తెలంగాణ' దేశానికే ఆదర్శం

### మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి అజాహరుద్దీన్





ప్రజాపక్షం/జగిత్యాల : సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శమనిమైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి అజాహరుద్దీన్ పేర్కొన్నారు.గురువారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మైనారిటీ వెల్ఫేర్, శాఖ మంత్రిఅజాహారుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకావిష్కరణ చేశారు.అనంతరం మంత్రి అజాహరుద్దీన్ మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రాంతం నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొంది ప్రజాస్వామ్య భారతదేశంలో అంతర్భాగమైన చారిత్రాత్మక రోజు ఈ రోజు అని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పడి సెప్టెంబర్ 1 నాటికి 1000 రోజుల ప్రజాపాలనను పూర్తి చేసుకుందన్నారు. రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించడం, విద్యా ఉద్యోగ అవకాశాలను విస్తరించడం, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలకు బాటలు వేయడం, భవిష్యత్తు తెలంగాణకు దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించడం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశించిందన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి చేకూర్చే పథకాల అమలుతో పాటు కొత్త చట్టాలు, కొత్త విధానాలు, కొత్త సంస్థలు, కీలక పరిపాలనా సంస్కరణలకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. ప్రజా పాలన అంటే కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితమైన పాలన కాదని, ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపే పాలన, పారదర్శకత, జవాబుదారీతనం, సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం అనే నాలుగు ప్రధాన స్తంభాలపై ప్రజా ప్రభుత్వం తన పాలనను కొనసాగిస్తోందన్నారు. రాష్ట్రాన్ని భవిష్యత్ తరాలకు మరింత బలమైన, అభివృద్ధి చెందిన, ఆర్థికంగా శక్తివంతమైన తెలంగాణగా తీర్చిదిద్దేందుకు 'తెలంగాణ రైజింగ్–2047' దార్శనిక పత్రాన్ని రూపొందించామన్నారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం ఈ విజన్ ప్రధాన లక్ష్యమ ని వివరించారు. గ్రామీణ తెలంగాణను బలోపేతం చేస్తూనే పట్టణ ప్రాంతాలను ప్రపంచ స్థాయి ప్రమాణాల తో అభివృద్ధి చేయడం ద్వారా సమతుల్య ప్రగతిని సాధించాలన్నది ప్రజా ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు. ఈ 1000 రోజుల ప్రజాపాలనలో రాష్ట్ర ప్రగతితో పాటు జగిత్యాల జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో జగిత్యాల జిల్లాను అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పిఅశోక్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, అదనపు కలెక్టర్లు లత, రాజ గౌడ్, జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి ,తదితరులు ఉన్నారు.

## అస్తిత్వ పోరాట ప్రతీక తెలంగాణ

### ప్రజా పాలన దినోత్సవం వేడుకల్లో మంత్రి లక్ష్మణ్ కుమార్




ప్రజాపక్షం/కరీంనగర్: తెలంగాణ రాష్ట్రం అంటే ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదని అస్తిత్వ పోరాటానికి ప్రతీకగా తెలంగాణ నిలుస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా కరీంనగర్ లోని పోలీస్ గ్రౌండ్స్ లో నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి లక్ష్మణ్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మొదట కరీంనగర్ లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లు అర్పించిన మంత్రి లక్ష్మణ్ కుమార్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రతో పాటు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలాంతో కలిసి వేడుకల్లో మంత్రి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ 17 సెప్టెంబర్ 1948 సంవత్సరంలో తెలంగాణ నిజాం చెర నుండి విముక్తి పొంది, అఖండ భారత్ లో విలీనమైన రోజు అని గుర్తు చేశారు. ఇంతటి ప్రాముఖ్యత గల సెప్టెంబరు 17వ తేదీని "తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం"గా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. తెలంగాణ గడ్డపై జన్మించి ఈ ప్రాంతాన్ని సుసంపన్నం చేసిన ఆనాటి వీరయోధులకు జోహార్లు అర్పిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల పాటు చేపట్టిన "ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో 4 వేల 290 పెండింగ్ ఫైళ్లను పరిష్కరించారని, అన్ని గ్రామాలలో 15 రోజుల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించామని చొప్పదండి మండలం కోనేరుపల్లి, రామడుగు మండలం వెలిచాల గ్రామాలు ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా గుర్తింపు పొందడం విశేషంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన "భూభారతి చట్టం" అమల్లో భాగంగా భూవివాదాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సమగ్ర భూసర్వే కు శ్రీకారం చుట్టామని, తొలి దశలో జిల్లాలో 70 గ్రామాలు నోటిఫై చేశామని మొదటి విడతలో 7, రెండో విడతలో 9 గ్రామాల్లో భూముల రీసర్వే చేస్తున్నమని మూడో విడతలో మరో 15 గ్రామాల్లో రీసర్వే చేపట్టబోతున్నామని మంత్రి తెలిపారు.

## దేశభక్తి పేరుతో చరిత్రను వక్రీకరిస్తే సహించేది లేదు

### సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్




ప్రజాపక్షం/కరీంనగర్: దేశభక్తి పేరుతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించాలని చూస్తున్న బిజెపికి విమోచన దినోత్సవం జరిపే నైతిక హక్కు లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ హెచ్చరించారు. సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం కరీంనగర్ లోని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద జాతీయ జెండాను, సిపిఐ జెండాను పంజాల శ్రీనివాస్ ఎగురవేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భారత దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిందని ప్రజలందరికీ తెలుసు కానీ ఈ తెలంగాణ ప్రాంత ప్రజలకు 1948 సెప్టెంబర్ 17న స్వాతంత్ర్యం సిద్ధించిందనే విషయాన్ని తెలుసుకోవాల్సిన వశ్యకత ఉందన్నారు.మహత్తర పోరాటం మూలంగా మూడు వేల గ్రామాలు విముక్తై 4500 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేసిన ఘన చరిత్ర సిపిఐ కే దక్కిందన్నారు. తెలంగాణ భగత్ సింగ్ గా పేరొందిన వ్యక్తి అనభేరి ప్రభాకర్ రావు అని,రజాకార్ పోలీసుల తూటాలకు బలై ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన అనభేరి ప్రభాకర్ రావు ప్రాణత్యాగం వెలకట్టలేనిదని అన్నారు. అలాంటి వీరుల త్యాగాలను,చరిత్రను కనుమరుగు చేయాలని చూస్తున్న వారిని,సంస్థలను సిపిఐ చూస్తూ ఊరుకోదని హెచ్చరిస్తూ,చరిత్రను కాపాడుకుంటామని అన్నారు. ఈ మహత్తర పోరాట ఘట్టాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్, న్యాలపట్ల రాజు,జిల్లా కౌన్సిల్ సభ్యులు బండ రాజిరెడ్డి,బీర్ల పద్మ,బూడిద సదాశివ,శాఖ కార్యద ర్శులు కాంతాల తిరుపతి రెడ్డి,కసిబొజుల సంతోష్ చారి,నూనునావత్ శ్రీనివాస్,సావనపెల్లి నాంపల్లి, నాయకులు ఆవు నూరి రమేష్,తిరుపతి ,బీర్ల స్వాతి,పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



ప్రజాపక్షం/పెద్దపల్లి : ప్రజా సంక్షేమం,అభివృద్ధి, సామాజిక న్యాయమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు.గురువారం పెద్దపల్లి ఐడిఒసిలో జరిగిన ప్రజాపాలన దినోత్సవంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకుందన్నారు.జిల్లాలో ప్రజా ప్రభుత్వం అమలు 2.46 లక్షల బిపిఎల్ కుటుంబాల్లోని 7.18 లక్షల మందికి సన్నబియ్యం,1.40 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి రూ.141.64 కోట్ల సబ్సిడీ,5,982 ఇందిరమ్మ ఇళ్లకు రూ.135 కోట్ల ఆర్థిక సాయం,48,188 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.120.56 కోట్ల లబ్ధి,మహిళలకు ఉచిత బస్సు ద్వారా రూ.245 కోట్ల ఆదా చేస్తూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో రూ.82 కోట్లతో 4 వరుసల పెద్దపల్లి బైపాస్ రోడ్డు, రూ.8.40 కోట్లతో ఆర్‌టిసి బస్ డిపో, రూ.5 కోట్లతో మహిళా శక్తి భవనం అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రూ.700 కోట్లతో రత్నాపూర్‌లో కోకాకోలా పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ శ్రీరాములు, డిసిపి రాంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ఆర్‌డిఒగంగార ం,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, ఎసిపి గజ్జి కృష్ణ,అధికారులు పాల్గొన్నారు.

## ఆర్ఎంసిలో పైలట్ ఏజెన్సీలను రద్దు చేయండి

### కమిషనర్‌కు ఎఐటియుసి వినతి



ప్రజాపక్షం/పెద్దపల్లి : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7 డివిజన్లలో మున్సిపల్ అధికారులు పైలట్ ఏజెన్సీలను ఏర్పాటు చేసి, గత 26 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ర్యాగ్ పిక్కర్లను ఇతర డివిజన్లకు పంపడం సరైన విధానం కాదని, వెంటనే పైలట్ ఏజెన్సీలను రద్దు చేసి ఆ డివిజన్లలో ర్యాగ్ పిక్కర్లను కొనసాగించాలని కోరుతూ మున్సిపల్ కమీషనర్‌కు వినతి పత్రం ఇచ్చామని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఎఐటియుసి రామగుండం యూనిట్ కార్యదర్శి ఎంఎ గౌస్ పేర్కొన్నారు. గురువారం వినతి పత్రం ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా ఆర్ ఎం సి లోని 34, 49, 51,52, 60 డివిజన్లలో ఇంటింటి చెత్త సేకరణ చేసే కార్మికులను పైలట్ ఏజెన్సీలతో పాటు ఓనర్ పేరుతో 7 డివిజన్లలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి,అక్కడ పనిచేస్తున్న కార్మికులను ఇతర డివిజన్లకు మార్చడం వల్ల వారు అనేక ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా ఓనర్‌కమ్‌డ్రైవర్ విధానాన్ని రద్దు చేయాలని,పాత పద్ధతిలో ఏ డివిజన్ కార్మికులను ఆ డివిజన్ లోనే కొనసాగించాలని,ఔట్ సోర్సింగ్ జవాన్లు (సూపర్ వైజర్లు) మ హిళా కార్మికుల పట్ల అసభ్యంగా మాట్లాడుతూ, రాజకీయ పలుకుబడి ఉందని బెదిరిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని త దితర అంశాలపై వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఆయన పే ర్కొన్నారు.చెత్త సేకరణ కార్మికులు కూడా సమాజంలో భాగమేనని, వారి ఆకలి, ఆర్తనాదాలను అర్థం చేసుకోవాలని,సభ్యత, సంస్కారం లేకుండా దళితులపై అసభ్యకరంగా మాట్లాడే విధానాలు కొనసాగితే ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు వెనుకాడమని,జరగబోయే పరిణామాలకు ఆర్ఎమ్‌సియే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

## అధికారులు మిల్లర్లను వేధించటం మానుకోవాలి




ప్రజాపక్షం/ సిద్దిపేట : వచ్చే సీజన్‌లో రైతుల వద్ద నుండి ధాన్యం దించుకోమని, యజమానులను అధికారులు చర్చలకు సిద్దిపేట జిల్లా రైస్ మిలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతరాజు, మురవెల్లి చంద్ర శేఖర్‌లు హెచ్చరించారు. గురువారం సిద్దిపేట పట్టణంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనం నుండి మెయిన్‌రోడ్డు, లాల్ కమాన్‌మీదుగా ఆర్‌డిఒ కార్యాలయం వరకు ప్లకార్డులాతో ర్యాలీగా వచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్‌డిఒ సదానందం కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1500 కోట్ల విలువైన గత మూడు పంటల ధాన్యం తమ వద్ద నిల్వ ఉన్నదన్నారు. అది పూర్తిగా పాడవుతుందని దాన్ని మిల్లింగ్ చేస్తే 25% పాడయ్యే ఆస్కారం ఉందన్నారు. దాని వల్ల షార్టజ్ అయ్యే అవకాశం ఉందని అన్నారు. మళ్ళీ అధికారులు తనిఖీ చేస్తే ధాన్యం తక్కువ వచ్చే అవకాశం ఉందన్నారు. అ ందువల్లనే రైస్ మిల్లులు మూసివేస్తున్నామన్నారు. మీరు పాత ధాన్యం కొనుగోలు చేసిన త ర్వాతే మళ్ళీ ధాన్యం అలాంట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాయిల్డ్ రైస్ వద్దు రా రైస్ మాత్రమే ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని ఆ గ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గజ్వెల్ హుస్నాబాద్, చేర్యాల అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్,మారుతి,లక్ష్మినారాయణపాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి




ప్రజాపక్షం/సుల్తానాబాద్ : ట్రావెలర్ బస్సు ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సుల్తానాబాద్ బస్టాండ్ సమీపంలో చోటు చేసుకుంది. మినీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో మోరి శంకర్ మృతి చెందాడు. కూతురిని బస్టాండ్ నుంచి తీసుకెళ్లేందుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. బైక్‌లో లభించిన లైసెన్స్ ఆధారంగా మానకొండూరు మండలం ఉట్కూరు వాసిగా పోలీసులు గుర్తించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి విచారణ చేపట్టారు.

## తెలంగాణ ప్రజల త్యాగాలు, పోరాటం, స్వాభిమానం ఆకాంక్షలు స్ఫూర్తిదాయకం

### రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి




ప్రజాపక్షం/సిద్దిపేట: తెలంగాణ ప్రజల త్యాగాలు, పోరాటాలు, స్వాభిమానం ఆకాంక్షలు మనకు ఎల్లప్పుడు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట దయాకర్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య విలువలు కాపాడుతూ, ప్రజపాలన అందించటం , ప్రతికుటుంబానికి సంక్షేమం , ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధిని చేరవేయటం అందరి బాధ్యత అన్నారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గురువారం ఐడిఒసిలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి హాజరై పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలతో అలంకరించి, జాతీయ పతాకావిష్కరణ గావించి, అనంతరం జిల్లా ప్రసంగించారు. 1948 సెప్టెంబర్ 17, తెలంగాణ ప్రాంత నిజాం పాలన నుంచి విముక్తి పొంది ప్రజాస్వామ్య భారతదేశంలో అంతర్భాగమైన చారిత్రాత్మక రోజు. ఈ చారిత్రాత్మక ఘట్టానికి 78 సంవత్సరాలు పూర్తయి, 79వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సెప్టెంబర్ 17వ తేదీని తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా ఘనంగా నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ఎనుముల రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పడి సెప్టెంబర్ 1 నాటికి 1000 రోజులు ప్రజాపాలనను పూర్తి చేసుకుందన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ల బ్ధి చేకూర్చే పథకాల అమలుతో పాటు కొత్త చట్టాలు, కొ త్త విధానాలు, కొత్త సంస్థలు, కీలక పరిపాలన సంస్కరణలకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజా పాలన అంటే కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితమైన పాలన కాదు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యల ను తెలుసుకుని, వారికి పరిష్కారం చూపే పాలన. పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలన, సామాజిక న్యాయం అనే నాలుగు ప్రధాన స్తంభాలపై ప్రజా ప్ర భుత్వం తన పాలనను కొనసాగిస్తోంది. రాష్ట్రాన్ని భవిష్యత్తు తరాలకు మరింత బలమైన, అభివృద్ధి చెందిన, ఆర్థికంగా శక్తివంతమైన తెలంగాణగా తీర్చిదిద్దేందుకు "తెలంగాణ రైజింగ్– 2047" దార్శనిక ప్రణాళికను రూ పొందించాం. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం ఈ విజన్ ప్రధాన లక్ష్యమన్నారు.ప్రజల భాగస్వామ్యంతో సిద్దిపేట జిల్లాను అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. జిల్లా అభివృద్ధిలో భాగస్వాములైన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, పోలీస్ యంత్రాంగానికి, వైద్యులకు, పారిశుద్ధ్య కార్మికులకు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తె లిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కే. హైమవతి , రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్, సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మీ పెరుమాళ్, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీ కిరణ్, అదనపు డిసిపిలు సుభాష్ చంద్రబోస్, కుశాల్కర్, ఆర్‌టిఎ కమిటీ మెంబర్, ఆత్మ కమిటీ చైర్మన్, మున్సిపల్ కమిషనర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ , ఇతర ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## షబ్బీర్ అలీని సన్మానించిన మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



**ప్రజాపక్షం/మావల:** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీని మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం కలెక్టరేట్‌లో షబ్బీర్ అలీ జాతీయ జెండా ఆవిష్కరించారు. సంక్షేమ పథకాలు, జిల్లా అభివృద్ధిపై ప్రసంగించారు. కలెక్టర్ రాజర్షిషా, ఎస్పి అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్, గ్రంథాలయ చైర్మన్ సత్యనారాయణ, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి విచ్చేసి జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన ఆయన జిల్లా ప్రగతి నివేదికను వివరిస్తూ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ వేడుకల సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, సీపీ సాయిచైతన్య, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, అదనపు కలెక్టర్ భుజంగరావు, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఆర్ఓ గీత, ఆర్డీఓ రాజేంద్రకుమార్, మున్సిపల్ కమీషనర్ దిలీప్‌కుమార్, మాజీఎమ్మెల్సీ నర్సారెడ్డి, ప్రేమలత అగర్వాల్, నగేష్ రెడ్డి, ప్రజలు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆపద సమయాల్లో .. తొలి రెస్పాండర్లుగా యువతే కీలకం

కలెక్టర్ రాజర్షిషా



**ప్రజాపక్షం/మావల:** ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల సమయంలో క్షతగాత్రులను కాపాడే మొదటి రెస్పాండర్లుగా యువత ఎదగాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. యాపల్‌గూడలోని 2వ బెటాలియన్‌లో తెలంగాణ స్పెషల్ పోలీస్ ఎస్‌డిఆర్ఎఫ్, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'యువ ఆపద మిత్ర' శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారికి 16 రకాల అత్యవసర వస్తువుల కిట్‌తో పాటు సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. వాలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ బి.వెంకటేశ్వర రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు రఘునాథ్ చౌహాన్, శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

## పారదర్శకంగా చేయూత పెన్షన్ల పరిశీలన



**ప్రజాపక్షం / జైనూర్ :** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని జైనూర్ ఎంపిడిఒ కృష్ణవేణి స్పష్టం చేశారు. చేయూత సామాజిక భద్రత పెన్షన్ పథకం కింద కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను గురువారం మండలంలోని పవర్‌గూడ, రాసిమెట్ట గ్రామ పంచాయతీలలో ఆమె క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా వాస్తవ పరిస్థితులను నిర్ధారించేందుకే దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి నేరుగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. పవర్‌గూడలో స్థానిక సర్పంచ్ తొడసం రాజేందర్‌తో కలిసి కుటుంబ పరిస్థితులు, అర్హత ప్రమాణాలు, సమర్పించిన పత్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తొడసం రాజేందర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కరెంటు కోతలతో రోడ్డెక్కిన రైతన్నలు

పంటలకు నీరందక విలవిల

**ప్రజాపక్షం/పాపన్నపేట:** కరెంటు కోతలతో రైతులు కన్నెర చేసి రోడెక్కిన సంఘటన మండల పరిధిలోని నార్సింగి సబ్‌స్టేషన్ (ఏఈ కార్యాలయం) ఎదుట మెదక్‌బొడ్మట్‌పల్లి ప్రధాన రహదారిపై గురువారం జరిగింది. రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదనను అధికారుల ఎదుట వెళ్లగక్కారు. పంటలకు నీరు అందించాల్సిన సమయంలో కరెంటు సరఫరా నిలిచిపోతుండటం తో పొలాలు ఎండి పోతున్నాయని వాపోయారు. వరి పంట కోత దశకు చేరుకుంటున్న సమయంలో విద్యుత్ కోతల కారణంగా పంటను కాపాడుకోవడం ఎలా అని ప్రశ్నించారు. పెట్టుబడులు పెట్టి పంట సాగు చేశాం. నీరు పెట్టేందుకు కరెంటు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. కరెంటు రాక పంట దెబ్బతింటే మా నష్టాన్ని ఎవరు భరిస్తారు? అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలపై ఏఈ సంఘటనా స్థలానికి వచ్చి స్పష్టమైన సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ అధికారులతో రైతులకు మాట్లాడించారు. విద్యుత్ సమస్యపై అధికారులతో చర్చించిన అనంతరం రైతులు రాస్తారోకోను విరమించారు.



# రెండేళ్లలో దేశంలోనే అగ్రస్థానంలో 'సంగారెడ్డి' మెడికల్ కళాశాల

మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** రాబోయే రెండేళ్లలో సంగారెడ్డి జిల్లా మెడికల్ కళాశాలను వైద్య,విద్య ,వైద్యసేవలు మౌళిక వసతుల పరంగా దేశంలోనే అగ్రస్థానంలో నిలిచేలా అభివృద్ధి చేస్తామని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నఅన్నారు. గురువారం సంగారెడ్డి మెడికల్ కళాశాల ప్రాంగణంలో హిటీరో పౌండేషన్ సౌజన్యంతో రూ1.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసి బాస్కెట్ బాల్ ,క్రికెట్, కబడ్డీ కోర్టులు ఓపెన్ క్రికెట్ గ్రౌండ్‌ను టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ,జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలసి మంత్రి ప్రారంభించారు. అనంతరం వైద్య విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడి వారిని ఉత్సాహపరిచారు. ఈసందర్బంగా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన విద్యార్థుల ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి మాట్లడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. క్రీడల ద్వారా శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం ,ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. వైద్య విద్యార్థులు చదువులో మంచి ర్యాంకులు సాదించేందుకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే వైద్యం ,విద్య సాదికారిత ,సామాజిక భద్రత వంటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్టంలో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మెరుగైన వైద్య సదుపాయాలతో ఆసుపత్రుల నిర్మాణ పనులు చేపడుతున్నాయని పేర్కొన్నారు. సుమారు రూ. 500 కోట్లవ్యయంతో ఆధునిక సౌకర్యాలు కలిగిన ఆసుపత్రుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మెరుగైన వైద్య సేవలు ఆధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా తెలంగాణను వైద్య రంగంలో దేశంలోనే ముందజంలో నిలిపేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. భవిష్యత్తులో వైద్యులుగా ఉన్నత స్థాయికి ఎదిగినప్పటికి సమాజం పట్ల బాధ్యతను మరువరాదని మంత్రి అన్నారు. చదువుతో పాటు క్రీడలు ,సామాజిక సేవా కార్యక్రమాల్లోను విద్యార్థులు చురుకుగా పాల్గొన్నాలని సూచించారు. ప్రభుత్వాలు ,నాయకత్వాలు, శాశ్వతం కాదని ప్రజలకు నిరంతరం సేవలందించేలా వ్యవస్థలను బలోపేతం చేయడమే ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. వైద్య విద్య పూర్తియిన అనంతరం గ్రామీణా ప్రాంతాల్లో సేవలందిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని విద్యార్థులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావచ్చని సమాజ సేవ ద్వారా మంచి గుర్తింపు పొందవచ్చని అన్నారు. ఈ సందర్బంగ ఆ యూనియన్ బ్యాంక్ సోషల్ ఫౌండేషన్ సహకారంతో క్షయ వ్యాదిగ్రస్తులకు పోషకాహార కిట్లను మంత్రి పంఫిణి చేసినట్లు తెలిపారు. క్షయ వ్యాది నిర్మూలనలో ప్రజల బాగస్వామ్యంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకులు ఇతర సంస్థల సహకారం అవసరమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాయల సంస్త చైర్మన్ జి. అంజయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాండు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మురళీ కృష్ణ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్‌రావు, సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్ హిటీర్ పౌండేషన్ ప్రతినిధి సుధాకర్ ,మెడికల్ కళాశాల విద్యార్థులు సంబందిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనతో రాష్ట్ర అభివృదే లక్ష్యం

టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్

**ప్రజాపక్షం/ నిర్మల్ :** నిర్మల్ పట్టణంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్ ఆధ్వర్యంలో ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు . ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతున్న శుభ సందర్భంలో నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. అనంతరం రాంజీ గోండు వెయ్యి ఊడల మర్రికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల హరీష్, ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర కార్యదర్శి కొంతం గణేష్ ,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ అర్షద్, స్పోక్ పర్సన్ సజ్జద్,నాంపల్లి నర్సయ్య,తదితరులు పాల్గొన్నారు.



# 'తిర్యాణి' సమగ్ర అభివృద్ధే లక్ష్యం

కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** తిర్యాణి ఆకాంక్షిత మండలంలో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేసేందుకు సివైడిఒ సంస్థతో ఒ ప్పందం చేసుకున్నట్లు జిల్లా కలెక్టర్ కె హరిత తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌తో కలిసి సివైడిఒ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. మండల అభివృద్ధిలో భాగంగా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రాథమిక మౌలిక వసతులను బలోపేతం చేయడం, సంక్షేమ ఫలాలను ప్రజలకు సమర్థవంతంగా అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సివైడిఒ ఆధ్వర్యంలో మండలంలోని ఎంపిక చేసిన 20 గ్రామాలలో సమగ్ర అభివృద్ధి పనులు చేపడతారని వెల్లడించారు. విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, పోషకాహారం వంటి కీలక రంగాలలో అవసరాలను గుర్తించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. విద్యా ప్రమాణాల పెంపు, ఆరోగ్య సేవల బలోపేతం, సురక్షిత తాగునీరు, సాగునీటి వసతులు, పోషకాహార స్థాయిల పెంపు ద్వారా గ్రామీణులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రవీణ్ జాదవ్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నాగేశ్వర్, నీతి ఆయోగ్ కోఆర్డినేటర్ డాక్టర్ బాల రాజు రాజారాం పాల్గొన్నారు.

# స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి వివేక్



**ప్రజాపక్షం/మెదక్ :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మెదక్ కలెక్టరేట్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కార్మిక, గనుల భూగర్భ శాఖల మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా ఎస్‌పి శ్రీనివాస రావు మంత్రి వివేక్ పూలబొకేలు అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసు అధికారుల నుంచి మంత్రి గౌరవ వందనం స్వీకరించారు. మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, ఎస్‌పి శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. నిజాం పాలన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థకు తెలంగాణ పరివర్తన చెందిన చారిత్రక రోజును ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ప్రజా పాలనలో పారదర్శకతకు ప్రా ధాన్యం ఇస్తూ, అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే ప్రభు త్వ లక్ష్యమని పేర్కొన్నారు. శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.అనంతరం జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను, జిల్లా ప్రగతిని మంత్రి వివరించారు. మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## సామాజిక న్యాయ పోరాటయోధుడు 'పెరియార్'



**ప్రజాపక్షం/మంచిర్యాల :** వందేళ్ల క్రితమే సామాజిక న్యాయం కోసం గళమెత్తిన గొప్ప పోరాటయోధుడు పెరియార్ రామస్వామి నాయకర్ అని వివిధ సంఘాల నాయకులు కొనియాడారు. మంచిర్యాల అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం పెరియార్ 147వ జయంతి సంబరాలు నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుల వివక్షను ఎదిరించేందుకు పెరియార్ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి జస్టిస్ పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. దేశంలో తొలిసారిగా బడుగు వర్గాలకు రిజర్వేషన్ల చట్టం, 1950లో మొదటి రాజ్యాంగ సవరణ ఆయన పోరాటాల ఫలితమేనని పేర్కొన్నారు. ఆయన ఆత్మాభిమాన ఉద్యమాల స్ఫూర్తితోనే 1967లో బడుగు వర్గానికి చెందిన అన్నాదురై ముఖ్యమంత్రి కాగలిగారని తెలిపారు.

## గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

నిమజ్జన పాయింట్‌ను సందర్శించిన అధికారులు

**ప్రజా పక్షం /ఖానాపూర్ :** గణేష్ నవరాత్రి ఉత్సవాల నిమజ్జన ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. ఖానాపూర్ పట్టణంలోని గోదావరి తీరాన గల గణేష్ నిమజ్జన పాయింట్ ను బుధవారం ఖానాపూర్ తహసీల్దార్ సుజాత,సీఐ సత్యనారాయణ,మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, కలిసి సందర్శించారు.ఉత్సవాలకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఐ సత్యనారాయణ తెలిపారు.ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ తదితర శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.




# కలెక్టరేట్‌లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ప్రభుత్వ విప్ వేముల వీరేశం, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిళ పాల్గొన్నారు.ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ప్రభుత్వ విప్, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గేయం, జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు.ఉద్యానవన పంటల అభివృద్ధికి కృషి చేసిన మండల వ్యవసాయ అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారు పుట్ట సుమన్ కు ఎలక్ట్రిక్ ట్రాలీ ఆటోను అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్వో రాథోడ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీఆర్వో రాథోడ్ రమేష్, ఇతర అధికారులు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రాకేష్, బిసి, ఎస్సీ సంక్షేమ అధికారులు శ్రీనివాస్, దయానంద్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.కలెక్టరేట్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పూజారులు కలెక్టర్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాథోడ్ రమేష్, కార్యాలయ పర్యవేక్షకులు ప్రవీణ్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.నిర్మల్ పట్టణంలోని సోఫీనగర్‌లో విద్యుత్ ఉప కేంద్ర నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం పరిశీలించారు.



# దివ్యాంగులకు అవకాశాలు, సాధికారత కల్పించాలి

రూ.2.10 కోట్లతో 1000 మంది లబ్ధిదారులకు ప్రయోజనం, కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్‌కు ఎంపి అరవింద్ కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** 17ను సేవాదినంగా భావిస్తూ పిఎం మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయక పరికరాలు అందించటం ఎంతో అర్థవంతమైన కార్యక్రమమని ఎంపి అరవింద్ ధర్మపురి అ న్నారు. పిఎం మోదీ మార్గదర్శకత్వంలో దివ్యాంగుల సంక్షేమం, సాధికారతకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. దివ్యాంగులకు సానుభూతి కాదు అవకాశాలు, అందుబాటు, గౌరవం, సాధికారత అవసరమని ఎంపీ స్పష్టం చేశారు. సహాయక పరికరాలు వారి స్వాతంత్ర్యం, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవానికి సాధనాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రూ.2.10 కోట్లకు పైగా కేంద్ర ప్రభుత్వ నిధు తో సుమారు 1000 మంది దివ్యాంగులు, వయోవృద్ధుల కు వివిధ రకాల సహాయక పరికరాలు అందించటంతో ప్రయోజనం చేకూరనుందని ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో 19 ర కాల సహాయక పరికరాలు అందిస్తున్నామన్నారు. సహకరిస్తున్న కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్‌కు ఎంపీ అరవింద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన సహాయం మరింత చేరువవుతోందన్నారు. నిజామాబాద్ నార్త్, ఆర్మూర్, బోధన్, జగిత్యాల, కోరుట్ల ప్రాంతాల్లో ఇప్పటికే సుమారు 1000 మంది దివ్యాంగులను గుర్తించామని, మిగిలిన అర్హుల గుర్తింపు ప్రక్రియను కూడా కొనసాగిస్తామని తెలిపారు. అర్హులెవరూ ప్రభుత్వ సహాయానికి దూరం కాకుండా చూడాలని అధికారులను కోరారు.అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, స్రవంతిరెడ్డి, ప్రమోద్, కార్పోరేటర్లు నాగోల్ల లక్ష్మీ నారాయణ,శ్రీనివాస్‌రెడ్డి, మహిళా శిశో వికలాంగుల శాఖ జిల్లా అధికారి సౌందర్య, అలింకో ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి

ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గి రిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం నర్సాపూర్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు గిరిజనులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.గిరిజనులకు 6 శాతంగా ఉన్న రిజర్వేషన్‌ను కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 10 శాతానికి పెంచారని, దీని వల్ల గిరిజనులకు అన్ని రంగాల్లో సముచిత స్థానం దక్కుతోందన్నారు. గిరిజన విద్యార్థుల కోసం 92 గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలలను కేసీఆర్ ఏర్పాటు చేశారని, తండాలను గ్రామ పంచాయతీలుగా చేయడం వల్ల ఎంతోమంది గిరిజనులు సర్పంచులుగా, వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారని తెలిపారు.మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, మాజీ జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ బబ్యా నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రమేష్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మధుకర్ రెడ్డి, సర్పంచులు కొండల్ రెడ్డి, సుధాకర్ బిక్షపతి వర్మా సుదీప్. పద్మా. సింగ్ చంద్రశేఖర్, రాజేందర్, ఆనంద్ కుమార్, సత్యం గౌడ్, గిరిజనులు పాల్గొన్నారు.

## ఫలించిన ఎఐటియుసి పోరాటం



**ప్రజాపక్షం/కల్లూరు:** తమ 9 నెలల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని బుధవారం నుండి ఎఐటియుసి ఆధ్వర్యంలో కల్లూరు మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెను గురువారం తాత్కాలిక విరమణ చేశారు. మొత్తం తొమ్మిది నెలల వేతనాలకు కాను ఆరు నెలల వేతనాలను ఇవ్వడానికి కమిషనర్ చైర్మన్ ఒప్పుకొని తక్షణం నాలుగు నెలల వేతనాలను విడుదల చేయడంతో కార్మికులు సమ్మెను తాత్కాలిక విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి సీనియర్ నాయకులు సింగు నరసింహారావు మాట్లాడుతూ వేతనాల కొరకు సమ్మెలు చేయటం దురదృష్టకరమన్నారు. గతంలో సమ్మె చేసిన సమయంలో ఈ పరిస్థితి రానీయమని చైర్మన్ అప్పటి అధికారులు హామీ ఇచ్చారని కానీ మరలా సమస్య పునరావతం అవడంతో తప్పనిసరి పరిస్థితిలో సమ్మె చేయాల్సి వచ్చింది అన్నారు. ఎఐటియుసి సమ్మెకు స్పందించిన అధికారులు, చైర్మన్ ఆరు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించడానికి సుముఖత వ్యక్తం చేశారన్నారు. అందులో భాగంగానే నాలుగు నెలలు పెండింగ్ శాలరీను తక్షణమే విడుదల చేశారని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వేము రాంబాబు, బికెఎంయు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కల్లూరు అధ్యక్ష కార్యదర్శులు ఓడల కృష్ణ, సయ్యద్ వజీర్ మియా, సహాయ కార్యదర్శులు చింతపల్లి శ్రీను, బాబు గౌడ్, చిన్న, రాంబాబు మణిరాజు ఉపాధ్యక్షురాలు యశోద, అంజలి, మరియమ్మ , కోశాధికారి కంభంపాటి ప్రకాష్ నాయకులు ఖమ్మం పాటి సుధాకర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** శ్రీ విరాట్ విశ్వ కర్మ యజ్ఞ మహోత్సవాన్ని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖాధికారిణి జి. జ్యోతి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ జయంతి విశిష్టతను వక్తలు కొనియాడారు. అనంతరం విముక్తి జాతుల దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణుల సంఘం జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పెండేటి సోమేశ్వర చారి, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, బ్రహ్మశ్రీ రామడుగు నర్సింహస్వామి, విజయగిరి సదానందచారి, ఇనుగుర్తి వెంకటేశ్వర్లు, పద్మాచారి, పమ్మి వెంకటేశ్వర్లు, పాపాచారి, ఉమామహేశ్వరరావు, పుల్లారావు, రాంబాబు, సోమరాజు, సదాశివరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి, పాండురంగారావు పాల్గొన్నారు.

## పిల్లల క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

డాక్టర్ పరిణిత రెడ్డి గుత్తా




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పిల్లల క్యాన్సర్‌పై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని హైదరాబాద్‌లోని సోమాజీగూడ యశోద ఆసుపత్రి పిడియాట్రిక్ అంకాలజీ, హెమటాలజీ క్లినికల్ డైరెక్టర్ హెచ్‌వోడి డాక్టర్ పరిణితరెడ్డి గుత్తా తెలిపారు. చిన్న పిల్లల క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించి చికిత్స అందిస్తే 80 శాతం వరకు పూర్తిగా నయం చేయవచ్చునని తెలిపారు. గురువారం ఖమ్మం యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిన్న పిల్లల క్యాన్సర్ చికిత్సలో 20 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న డాక్టర్ పరిణిత రెడ్డి మాట్లాడుతూ పుట్టిన నాటి నుంచి 18 ఏళ్ల వయస్సు వరకు పిల్లల క్యాన్సర్లు, పెద్ద వారికి వచ్చే క్యాన్సర్లతో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ఉంటాయన్నారు. పిల్లల్లో తగ్గని నిరంతర జ్వరం, రక్తస్రవం, కీళ్ల నొప్పులు, రక్తహీనత, శరీరంలో కణితులు, గడ్డలు, ఎడతెగని వాంతులు, మెల్లకన్ను రావడం, తీవ్రమైన తలనొప్పి వంటివి కనిపిస్తే తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. సెప్టెంబర్ నెలను పిడియాట్రిక్ క్యాన్సర్ అవేర్‌నెస్ మంత్‌గా పాటిస్తారని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ సమావేశం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ అనీష్‌కుమార్ తివారీ, మేనేజర్లు బాలకృష్ణ, సాయిరాం పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వేంసూరు మండలం బీమవరం గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ పల్లెల ప్రదీప్ ఆధ్వర్యంలో గురువారం సా యం త్రం నిర్వహించిన దాడిలో నవకుమార్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, నాగయ్య పట్టుబడ్డారు. మరో ఆరుగురు పరారైనట్లు పోలీసులు తెలిపారు. దాడిలో 52 పేకముక్కలు, రూ.29,600, ఒక బైక్, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం పది మందిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రజాపాలన దినోత్సవాన్ని రఘునాథపాలెం మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. గురువారం ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణలో ప్రజాస్వామ్య పాలనకు నాంది పలికిన చారిత్రాత్మక ఘట్టానికి గుర్తుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తుంది. మండల పరిషత్ కా ర్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎంపిడిఒ అశోక్‌కుమార్ ఆవిష్కరించా రు. గ్రామాల్లో సర్పంచ్‌లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ పద్మయ్య నాయుడు, ఇసి దీపక్, సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రధాన అజెండా

173 మందికి రూ. 50.86లక్షల సిఎంఆర్‌ఎఫ్ సాయం
పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాల పంపిణీ
మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/కూసుమంచి:** పేదల సంక్షేమమే ప్రధాన అజెండాగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో గురువారం 173 మంది లబ్ధిదారులకు రూ. 50.86 లక్షల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు, మల్లేపల్లికి చెందిన 16 మందికి రెండు పడకగదుల ఇళ్లు, మునిగేపల్లికి చెందిన 12 మందికి ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సిఎంఆర్‌ఎఫ్ ద్వారా ఇప్పటి వరకు సుమారు రూ. 3,250 కోట్ల మేర వైద్య సాయం అందించినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల తొలి విడతలో 4.5లక్షలు, రెండో విడతలో 2.5లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో మధ్యలో నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేసేందుకు రూ 1,100కోట్లు వెచ్చించినట్లు పేర్కొన్నారు. పేదల కోసం గతంలో సేకరించి ఆక్రమణలకు గురైన నివాస స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకుని అర్హులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ దివాకర్ టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, తహసీల్దార్ సైదులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి

ఎఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్




**ప్రజాపక్షం/మధిర:** పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షనమే విరమించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే జిఒ నెంబర్ 97ను రద్దు చేయాలని ఎఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మధిర మండలం కాజీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఎఐఎస్‌ఎఫ్ మధిర మండల సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అని, పాలిటెక్నిక్ కళాశాలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల్‌మీరా, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకుడు ఉజ్వల్ చరణ్, మధిర మండల కార్యదర్శి అశోక్, మండల సహాయ కార్యదర్శి అక్షిత, సత్య, మండల నాయకులు సాయి, వెంకట్, హుస్సేన్, మౌనిక, శ్వేత, రమ్య, దివ్య, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో భద్రాద్రి అభివృద్ధికి కృషి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఐడిఒసిలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. విద్యవైద్యం వ్యవసాయ మౌలిక వసతులకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. జిల్లాలో మెడికల్ ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు ఎర్త్ సైన్స్ యూనివర్సిటీతో విద్యావైద్య రంగాలు మ రింత అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. రహదారుల రైల్వే మార్గాన్ని అనుసంధానం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పాండురంగాపురం–భద్రాచలం–మల్కనగిరి రైల్వే మార్గం అమరావతి–జగ్దల్పూర్ జాతీయ రహదారి అభివృద్ధికి చర్యలు సాగుతున్నాయని చెప్పారు. జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుతో పాటు గోదావరి నదీ రవాణా అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో భద్రాచలం పర్యాటక అభివృద్ధికి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డా.తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్, ఎస్‌పి రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్‌పి సిఇఒ నాగలక్ష్మి , జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

మేయర్ మూడ్ గణేష్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రతి నిత్యం పారిశుద్ధ్య కార్మికులు సక్రమంగా విధులకు హాజరు కావాలని, నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని కొత్తగూడెం నగర మేయర్ మూడ్ గణేష్ హెచ్చరించారు. గురువారం ఆయన కార్పొరేషన్ డివిజన్ అటెండెన్స్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలని, పారిశుద్ధ్యంపై డివిజన్‌లో వస్తున్న ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేలా చూసుకోవాలన్నారు. సంబంధిత సూపర్‌వైజర్లు పని వేళల్లో క్షేత్రస్థాయిలో ఉంటూ కార్పొరేటర్లు, ప్రజలతో అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలుతీసుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, జవాన్లు, పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచానికే ఆదర్శం

సింగ్ నరసింహారావు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** భూమి కోసం, భుక్తి కోసం, పీడిత జన విముక్తి కోసం, దున్నేవాడికే భూమి కావాలనే నినాదంతో నైజాం నవాబు, జమీందారులు, జాగీర్దారుల దోపిడీకి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచానికే ఆదర్శమని సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యుడు సింగ్ నరసింహారావు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవం సందర్భంగా గురువారం మండల పరిధిలోని యాతాలకుంటలో కొరస జోగయ్య, కొరస పెంటమ్మల స్థూపాల వద్ద పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ నాయకత్వంలో సాగిన పోరాటం సామాన్య ప్రజల్లో చైతన్యం నింపిందన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, బందగీ వంటి సామాన్యులు సైతం పోరాట యోధులుగా నిలిచారని తెలిపారు. నాటి పోరాటాన్ని మతపరమైన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు దండు ఆదినారాయణ, తోట రామాంజనేయులు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వేము రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శి తడకమళ్ల యోబు తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టుల త్యాగ ఫలితమే విలీనం

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు
బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కమ్యూనిస్టుల త్యాగ ఫలితంగానే తెలంగాణ ప్రాంతం భారతదేశంలో విలీనమైందని దీనిని వక్రీకరించేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. నైజాం నవాబ్‌కు వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లడని వారు శరణుచొచ్చి దయా దక్షిణ్యాల మీద బతికిన వారు తెలంగాణ త్యాగాల గురించి మాట్లాడేందుకు అర్హులా? అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన వారోత్సవ ముగింపు సభ నిర్వహించారు. అంతకు ముందు పార్టీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని బాగం హేమంతరావు పార్టీ కార్యాలయంపై అరుణ పతాకాన్ని జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ యావత్ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నిజాం రాజు స్వతంత్రుడిగా ప్రకటించుకుని పాలన సాగిస్తున్నప్పుడు కమ్యూనిస్టులు సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారన్నారు. నాలుగున్నర వేల మంది అమరుల రక్తతర్పణ తర్వాత తెలంగాణ ప్రాంతం భారతదేశంలో విలీనమైందని ఆయన తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటం కేవలం నిజాం రాజును గద్దె కూల్చడంతోనే ముగియలేదని ఆయన తెలిపారు. లక్షల ఎకరాల భూమి పేదలకు పంచడం జరిగిందని తెలంగాణ ప్రజల జీవన గతిలో మార్పు తెచ్చిన ఘనత కమ్యూనిస్టులదేనన్నారు. 78 సంవత్సరాల తర్వాత భారతదేశంలో ఇంచుమించుగా నిజాం రాజుల నాటి నిర్బంధాలు అమలవుతున్నాయని అప్పుడు ప్రత్యక్షంగా ఇప్పుడు పరోక్షంగా ప్రజలపైన నిర్బంధకాండ అమలవుతుందన్నారు. అప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయమే ప్రధానంగా ఉన్నప్పుడు వ్యవసాయ భూమి కొందరి చేతుల్లో కేంద్రీకృతమైందని ఇప్పుడు కూడా అదే తరహాలో సంపద తీరు మారిన తర్వాత కొందరి చేతుల్లో పోగుపడుతుందని ఆయన తెలిపారు. అప్పుడు ప్రశ్నించేవారిని హింసించే వారని ఇప్పుడు ప్రశ్నించే వారిని జైళ్లలో బంధిస్తున్నారని కనీసం కారణాలు కూడా తెలపడం లేదని హేమంతరావు తెలిపారు. అప్పుడైనా ఇప్పుడైనా ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్నది కమ్యూనిస్టులేనన్నారు. రానున్న కాలంలో ప్రజా ఉద్యమాలను మరింత విస్తృత పర్చాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ యోధులను స్మరిస్తూ వారి చరిత్రను నేటి తరానికి తెలియజేస్తూ భవిష్యత్తు పోరాటాలకు కార్యోన్ముఖులను చేయడమే మన లక్ష్యం కావాలన్నారు. ఈ సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, సిద్దినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే ఊరుకోం

అధికారికంగా విలీన దినోత్సవాన్ని జరిపించాలి
పోరాటంతోనే ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ
సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రకు మతరంగు పులిమి వక్రీకరించే మతోన్మాద శక్తుల కుట్రలను తిప్పికొట్టాలని తెలంగాణ అమరుల నిజమైన త్యాగాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని శేషగిరిభవన్ సిపిఐ జిల్లా కార్యాలయంలో గురువారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపు సభ, తెలంగాణ విలీన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ సెప్టెంబర్ 17ను ప్రభుత్వాలు అధికారికంగా తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రకటించాలని భావితరాలకు తెలిసేలా చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. నిజాం నిరంకుశ పాలనపై భూ స్వాముల వెట్టిచాకిరీ దోపిడీకి వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటానికి కమ్యూనిస్టు పార్టీయే ముందుండి నాయకత్వం వహించిందన్నారు. ఈ మహత్తర పోరాటం ద్వారా 10 లక్షల ఎకరాలు తదనంతరం ఉద్యమాలతో కలిసి మొత్తం 24 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర ఒక్క ఎర్రజెండాకే దక్కుతుందని కొనియాడారు. స్వాతంత్ర్య సాయుధ పోరాటాల్లో బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తుల పాత్ర ఏ మాత్రం లేదని, నాడు క్షమాబిక్షలు కోరిన వారు నేడు దేశభక్తి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్య పరిరక్షణకు కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ పునరాంకితమై పోరాడుతారని ఆయన పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న అమరుల కుటుంబాల వారిని శాలువాల పూల మాలలతో ఘనంగా సత్కరించారు. కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, గనిగళ్ల వీరస్వామి, కందుల భాస్కర్, వాసిరెడ్డి మురళీ, మువ్వ వెంకటేశ్వరరావు, భూక్య ధ్రస్ను, ఎస్‌కె ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు దీటి లక్ష్మీపతి, కొమారి హన్మంతరావు, భూక్య శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, జక్కుల రాములు, దారా శ్రీనివాస్, రమణమూర్తి, సప్క నాగేశ్వరరావు, యూసుఫ్, ధర్మరాజు,నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, గోపికృష్ణ, షాహీన్ కైసర్, పైడిపెల్లి లక్ష్మీ, కార్పొరేటర్లు బోయిన విజయ్ కుమార్, దుర్గయ్య, పోలమూరి ధనలక్ష్మి , కూరపాటి సుధాకర్, బండి నర్సింహ, దాసరి శ్రీనివాస్, సత్యనారాయణ చారి, సపావట్ రవి, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆమెకు సహకరించింది ఎవరు?

నకిలీ పింఛన్‌దారుల సంగతేంటి?
వదిలేస్తారా... చర్యలు తీసుకుంటారా?

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి కేంద్రంగా నకిలీ సదరం సర్టిఫికెట్ల ధ్రువీకరణ వ్యవహారంలో ఓ ప్రైవేటు వ్యక్తికి సహకరించింది ఎవరన్న దానిపై ఇప్పుడు చర్చ సాగుతుంది. ప్రభుత్వ ఆసుపత్రితో ఎటువంటి సంబంధం లేని ఓ ఫిజియోథెరపిస్టు సదరం క్యాంపుల్లో కూర్చుని వందలాది మంది అనర్హులకు వికలాంగ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో కీలక భూమిక పోషించడం ఇందుకు సంబంధించి పెద్ద మొత్తంలో వసూళ్లు చేయడం వెనుక ఎవరు ఉన్నారనే దానిపై చర్చ సాగుతుంది. సదరంలో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యుల సహకారం లేకుండానే సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యాయా అన్నది ఇప్పుడు ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది. కనీస వైకల్యం లేని వారికి కూడా 40 నుంచి 50 శాతం అంగవైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంతో ఇప్పుడు ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యా ప్తంగా పెద్ద సంఖ్యలో నకిలీ పింఛన్‌దారులు త యారయ్యారు. ఫిజియోథెరపిస్టుగా పనిచేసిన ఓ మహిళ వికలాంగ సదరం ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తానంటూ కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. సత్తుపల్లి మం డలంలోని ఒక గ్రామం నుంచే సుమారు 10 లక్షల రూపాయలు వసూలు చేసినట్లు తెలుస్తుంది. ఇందులో కొంత మందికి ధ్రువీకరణ ప త్రాలు జారీ కాకపోవడంతో తీసుకున్న డబ్బులకు గాను ప్రాంసరీ నోట్లు కూడా రాసివ్వడం జరిగిం ది. ఉన్నతాధికారులు సదరం క్యాంపుల్లో అర్హత లేని వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేసింది ఎవరు అన్నదానిపై విచారణ జరపాల్సి ఉంది. ఇదే సందర్భంలో ఇదే ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి అడ్డాగా ఒంటరి మహిళలకు ధ్రువీకరణ పత్రాల పేరుతోనూ పెద్ద మొత్తంలో వసూళ్లు జరిగాయి. ఫిజియోథెరపిస్టుగా పనిచేస్తున్న మహిళ డబ్బులు తీసుకున్న వారిలో సగం మందికి వై కల్యం లేకపోయినా ధ్రువీకరణ పత్రం ఇప్పించినట్లు ఆమె స్వయంగా ప్రకటించింది. ఇందుకు ఆధారాలు కూడా వెలుగు చూశాయి. హమాలీ పనిచేస్తున్న వారు, వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు, ఆర్థికంగా సంపన్నులు, రూ. 30 వేలు చెల్లించి యథేచ్ఛగా దివ్యాంగ ధ్రువీకరణ పత్రాన్ని పొంది పింఛన్ పొందుతున్నారు. అంగవైకల్యం ఉన్నట్లుగా ఫోటోలు చూపి పింఛన్ పొందుతున్న వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సదరం క్యాంపుకు సంబంధించి ఖ మ్మం జిల్లాలో జారీ అయినా వికలాంగ ధ్రువీకర ణ పత్రాలపై విచారణ జరపాలని కోరుతున్నా రు.

## పేదల ఇండ్లను తొలగించడం అన్యాయం

సిపిఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అభివృద్ధి పేరుతో పేదల ఇండ్లను తొలగించడం అన్యాయమని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మహ్మద్ సలాం తెలిపారు. ఖమ్మం నగరంలోని 27వ డివిజన్ శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో పేదల ఇండ్లను తొలగించేందుకు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో గురువారం బైపాస్ రోడ్డులో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మహ్మద్ సలాం మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా ఆ ప్రాంతంలో నివాసం ఉంటూ పట్టాలు పొంది ఇంటి పన్ను, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారన్నారు. పలువురికి ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు కూడా మంజూరయ్యాయన్నారు. అటువంటి పేదల ఇండ్లను తొలగించేందుకు అభివృద్ధి పేరుతో నోటీసులు ఇవ్వడం సరైంది కాదన్నారు. ఆ ప్రాంతంలో ఉన్న టింబర్ డిపోలను ఊరి బయటకు మార్చాలని డిమాండ్ చేశారు. పేదల ఇండ్ల జోలికి వస్తే సహించేది లేదని వారు పక్షాన పోరాడతామన్నారు. గతంలో పువ్వాడ నాగేశ్వరరావు ఎంఎల్‌ఏగా ఉన్నప్పుడు ఆ ప్రాంతంలో సౌకర్యాలు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, యానాలి సాంబశివరెడ్డి, తాటి నిర్మల, వరదా నర్సింహారావు, బోడా వీరన్న, ఎస్‌కె సైదా, నామా విజయ్‌కుమార్, జ్వాలా నర్సింహారావు, ఎస్‌కె చానా, ఎండి మజీద్, ఎస్‌కె కరీం, ఎం. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## పారదర్శక పరిపాలనే లక్ష్యం

అదనపు కలెక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజల సంక్షేమం, పారదర్శక పరిపాలనే ప్రజా పాలన యొక్క ప్రధాన లక్ష్యమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ పతాకావిష్కరణ చేశారు. అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగించిన పోరాటంలో విజయం సాధించి ప్రజాస్వామ్య పాలనకు నాంది పలికారన్నారు. ఈ చారిత్రక రోజును తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ప్రజాపాలన దినోత్సవం నిర్వహిస్తుందన్నారు. ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటికి సత్వర పరిష్కారం చూపడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడటమే ప్రజాపాలన ముఖ్య ఉద్దేశమన్నారు. బాధ్యత, పారదర్శకత, జవాబుదారీ తనం, సేవాభావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా దృష్టి మళ్లించేందుకు
# మోదీ సర్కార్ హేయమైన యత్నం

• యుపిఐ పన్ను నిర్ణయం తర్వాత తలెత్తిన తీవ్ర వ్యతిరేకతపై కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** అధిక విలువ కలిగిన యుపిఐ లావాదేవీలపై రుసుము విధించే నిర్ణయానికి పార్లమెంటరీ ఆర్థిక స్థాయీ సంఘంలోని తమ ఎంపిలు మద్దతు ఇచ్చారన్న వాదనలను కాంగ్రెస్ గురువారం తోసిపుచ్చింది. యుపిఐ పన్ను నిర్ణయం తర్వాత తలెత్తిన తీవ్ర వ్యతిరేకత నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి మోదీ ప్రభుత్వం హేయమైన ప్రయత్నాలు చేస్తోందని ఆ పార్టీ మండిపడింది. రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన వ్యాపారి యుపిఐ చెల్లింపులపై రుసుము విధించే నిర్ణయాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించడంపై ప్రభుత్వం ప్రశ్నించిన నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ ఈ ప్రకటన చేసింది. పార్లమెంటరీ స్థాయీ సంఘం అటువంటి చర్యకు మద్దతు ఇచ్చిందని, ఆ కమిటీలోని కాంగ్రెస్ సభ్యులు కూడా దానికి అనుకూలంగా ఉన్నారని ప్రభుత్వం పేర్కొంది. యుపిఐ కోసం శ్రేణుల వారీగా ఉండే 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండిఆర్) లేదా ఆదాయ విధానాన్ని అమలు చేయాలని పార్లమెంటరీ ఆర్థిక స్థాయీ సంఘం కోరిందని, దీనిని ఎటువంటి జాప్యం లేకుండా నోటిఫై చేసి అమలు చేయాలని సూచించిందని ప్రభుత్వంలోని ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఆగస్టు 12న ఆ నివేదికను ఆమోదించినప్పుడు పి. చిదంబరం, మనీష్ తివారీ, గౌరవ్ గొగోయ్, కిషోరి లాల్, కె. గోపీనాథ్ సహా ఐదుగురు కాంగ్రెస్ ఎంపిలు హాజరయ్యారని, ప్రచురించిన సమావేశ వివరాల్లో ఎటువంటి భిన్నాభిప్రాయాలు నమోదు కాలేదని బిజెపి నేత పేర్కొన్నారు. ఈ వాదనలను తోసిపుచ్చుతూ, మోదీ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన యుపిఐ పన్ను ప్రతిపాదనపై పార్లమెంటరీ ఆర్థిక స్థాయీ సంఘం చర్చించలేదని గొగోయ్ చెప్పారు. ఆర్థిక కమిటీ సభ్యులతో సమావేశమైనప్పుడు యుపిఐ పన్నుపై ఆర్థిక శాఖ వద్ద ఎటువంటి నిర్దిష్ట ప్రతిపాదన లేదని గొగోయ్ తెలిపారు. ఎండిఆర్ ఆవశ్యకతపై ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ, ఆ సమయంలో ప్రభుత్వ ప్రతినిధుల వద్ద ఎటువంటి నిర్దిష్టమైన లేదా సంతృప్తికరమైన సమాధానాలు లేవని గొగోయ్ పేర్కొన్నారు. గొగోయ్ పోస్ట్‌ను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ప్రస్తావిస్తూ, మోదీ హయాంలో తలెత్తిన వార్తల సృషి వ్యవస్థ బట్టబయలైందని, మీరు దీన్ని తిప్పికొట్టడం సంతోషకరమన్నారు. మరొక పోస్ట్‌లో, అమెరికన్ కంపెనీలను, డొనాల్డ్ భాయ్‌ను ప్రసన్నం చేసుకోవడానికి తీసుకున్న యుపిఐ పన్ను నిర్ణయం తర్వాత తలెత్తిన తీవ్ర వ్యతిరేకత నుండి దృష్టిని మళ్లించడానికి మోదీ ప్రభుత్వం హేయమైన ప్రయత్నాలు చేస్తోందని రమేష్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ కూడా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దురదృష్టవశాత్తు, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల సమావేశాలు గోప్యంగా, ప్రత్యేక అధికారాలతో జరగాల్సి ఉండగా, ఇప్పుడు ప్రభుత్వం వాటిని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని చూస్తోందని తివారీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

## 140 కోట్ల జనాభా ఇంధన భద్రతకు అన్ని చర్యలూ తీసుకుంటాం: భారత్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** అమెరికా దిగువసభలో రష్యాపై ఆంక్షల బిల్లును ఆమోదించడంతో ఈ విషయంలో భారత్ తన మౌనాన్ని విడనాడింది. బిల్లుపై స్పందిస్తూ, ఇంధన రక్షణకు, ఆర్థిక ప్రయోజనాలను రక్షించుకునేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని గురువారం ప్రకటించింది. గతనెలలో అమెరికా సెనేట్ "లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026" బిల్లును ఆమోదించిన తర్వాత దిగువసభ కూడా గురువారంనాడు బిల్లుకు పచ్చజెండా ఊపడంతో భారీ సుంకాలు విధించడానికి వీలుగా ట్రంప్‌కు విశేష అధికారాలు రానున్నాయి. 140 కోట్లమంది జనాభాగల దేశంలో ఆర్థిక,ఇంధన రక్షణ చర్యలకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని భారత విదేశీమంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.ఈ విషయంపై గడచిన కొద్ది నెలలుగా వివిధ స్థాయిల్లో అమెరికా అధికారులతో చర్చలు జరిగాయని, కేవలం ద్వైపాక్షిక సంబంధాలపైనే కాకుండా, అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై కూడా ఇది ప్రభావం చూపిస్తుందని పేర్కొంది.ఈ పరిణామాలు,పర్యవసానాలు,ప్రభావాలను ఎదుర్కోవడానికి భారత ప్రభుత్వం వాణిజ్య,పారిశ్రామిక సంస్థలతో కలిసి పనిచేస్తుందని ప్రకటించింది. రష్యాను అదుపు చేసేందుకు,యూరప్‌కు మేలు చేసేందుకు వీలుగా ఈ బిల్లుకోసం రిపబ్లికన్లు–డెమోక్రాట్లు అరుదైన ఐక్యత ప్రదర్శించారు.భారత్–చైనా దేశాలు రష్యా నుండి దిగుమతులు పొందే విషయంలో తమ తప్పులను సరిదిద్దుకోవాలని రిపబ్లికన్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంతల్ పిలుపు ఇచ్చారు.

గతంలో కూడా ట్రంప్ రష్యా నుండి చమురు కొనుగోలు చేయకుండా భారత్‌ను అడ్డుకున్నారు. గత ఏడాది ఆగస్టు నుండి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ భారతదేశంపై అమెరికా 50 శాతం అదనపు సుంకాలు వసూలు చేసింది.అమెరికా–భారత్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించిన తర్వాత రష్యా నుండి చమురు దిగుమతి చేసుకున్నందుకుగాను అమెరికా వసూలు చేస్తున్న 25 శాతం జరిమానా సుంకాలను ట్రంప్ రద్దు చేశారు.ఐతే ప్రపంచదేశాలతో వాణిజ్యం విషయంలో ట్రంప్ అనుసరిస్తున్న సుంకాల విన్యాసాన్ని వ్యతిరేకించిన అమెరికా అత్యున్నత న్యాయస్థానం ఈ ఏడాది ఫిబ్రవరిలో పూర్తిగా కొట్టివేసింది. ఈ భారీ అదనపు సుంకాలు చెల్లుబాటు కాబోవని, దీనికి అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేదని స్పష్టం చేసింది.

## పరీక్షల షెడ్యూల్ విడుదల చేసిన ఎన్‌టిఎ

**న్యూఢిల్లీ :** ఈ విద్యా సంవత్సరానికి గానూ (2026–27) డిసెంబర్ నుంచి మార్చి వరకు జరిగే పరీక్షల షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) గురువారం విడుదల చేసింది. ఈ తేదీలు తాత్కాలికమైనవని, పరిపాలనాపరమైన, విద్యాపరమైన, చట్టపరమైన, నిర్వహణపరమైన లేదా ఇతర ఊహించని పరిస్థితుల కారణంగా వీటిలో మార్పులు ఉండవచ్చు అని ఒక సీనియర్ అధికారి పేర్కొన్నారు. ఈ కాలంలో మొత్తం 14 పోటీ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష జెఇఇ మెయిన్ మొదటి విడతను 2027 జనవరి 2224, జనవరి 2830 తేదీలలో నిర్వహించాలని ప్రతిపాదించారు. జనవరి 31ని బఫర్ తేదీగా (అదనపు తేదీగా) కేటాయించారు. యుజిసినెట్ పరీక్షను డిసెంబర్ 14–19 మధ్య నిర్వహించాలని ప్రతిపాదించారు. డిసెంబర్ 2021 తేదీలను బఫర్ తేదీలుగా నిర్ణయించారు. సిఎస్ఐఆర్ యుజిసినెట్ జాయింట్ పరీక్ష డిసెంబర్ 2021 తేదీలలో జరుగుతుంది. సిఎంఎటి 2027 ఫిబ్రవరి 7న, క్యూట్ పిజి 2027లో మార్చి 15, మార్చి 8, మార్చి 12–20ష మార్చి 24–25 తేదీలలో జరుగుతుంది. మార్చి 30–31 తేదీలను బఫర్ తేదీలుగా ఉంచారు. ఈ కాలంలో నిర్వహించబోయే ఇతర పరీక్షలలో ఎన్ఐటిటిటి, ఎన్ఐఎఫ్‌టి, స్వయం, ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ పరీక్షలు ఉన్నాయి.

## ఇద్దరు ఎంపిలపై అవినీతి ఫిర్యాదులు కొట్టివేత :లోక్‌పాల్ తీర్పు

**న్యూఢిల్లీ :** మమతా బెనర్జీకి వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రకటించిన తృణమూల్ కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడిపై, డిఎంకె ఎంపిపై వేర్వేరు కేసులలో ఉన్న అవినీతి ఫిర్యాదులను అవినీతి నిరోధక అంబుడ్స్‌మన్ లోక్‌పాల్ కొట్టివేసింది. వారిపై ఉన్న ఆరోపణలు నిరాధారమైనవి అని లోక్‌పాల్ తీర్పు ఇచ్చింది. లోక్‌పాల్ నిర్ణయంపై తిరుగుబాటుదారుడైన తృణమూల్ నాయకుడు అరూప్ చక్రవర్తి స్పందిస్తూ తనపై ఉన్న ఆరోపణలను బాధాకరమైనవి, నిరాధారమైనవి అని పేర్కొన్నారు. కాగా, ఈ తీర్పు అన్నీ స్పష్టంగా చెబుతోంది అని డిఎంకె ఎంపి కలానిధి వీరస్వామి అన్నారు. ఈ విషయం ఇంకా కోర్టు పరిధిలో ఉన్నందున, దీనిపై మరింత వ్యాఖ్యానించడానికి ఆయన నిరాకరించారు. మే నెలలో బెంగాల్‌లో బిజెపి ఘనవిజయం సాధించిన కొద్ది రోజులకే, బంకురా లోక్‌సభ ఎంపి అయిన చక్రవర్తి, తమ పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రకటించి, రిజిస్టర్ అయిన, గుర్తింపు లేని రాజకీయ పార్టీ అయిన నేషనలిస్ట్ సిటిజన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సిపిఐ)లో చేరిన 20 మంది తృణమూల్ ఎంపిలలో ఒకరిగా ఉన్నారు. చక్రవర్తిపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపిన లోక్‌పాల్, సిబిఐ నిర్వహించిన ప్రాథమిక విచారణలో ఆయనపై ఉన్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొంది. అవినీతి నిరోధక సంస్థ గత ఏడాది నవంబర్‌లో, తన ఉత్తర్వులో ప్రతివాది ప్రభుత్వ ఉద్యోగి (ఆర్‌పిఎస్)గా పేర్కొన్న చక్రవర్తిపై ఉన్న ఆరోపణలపై ప్రాథమిక విచారణ జరపాలని సిబిఐని ఆదేశించింది. ఆగస్టు 28 నాటి తన నివేదికలో, విచారణ అధికారి 45కు పైగా పత్రాలను పరిశీలించి, ఆరుగురు సాక్షుల వాంగ్మూలాలను, ఆర్‌పిఎస్ వ్యాఖ్యలతో పాటు నమోదు చేసిన తర్వాత, అవినీతికి సంబంధించిన ఆరు ఆరోపణలను వివరించారు. చక్రవర్తి తన సోదరుడు ఆశిస్ చక్రవర్తి ద్వారా చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిర్వహించారని, అవినీతి పథకాలను అమలు చేయడానికి, అక్రమ వసూళ్లను రాబట్టడానికి, స్థానిక అధికారుల మద్దతుతో స్థానిక నివాసితులను బెదిరించడానికి ఆశిస్ చక్రవర్తి మధ్యవర్తిగా వ్యవహరించారని ప్రధాన ఆరోపణ అని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. కాగా, ఫిర్యాదులో ఎలాంటి యోగ్యత లేనందున దీనిని కొట్టివేస్తున్నట్లు లోక్‌పాల్ ఛైర్‌పర్సన్ జస్టిస్ ఎఎం ఖాన్విల్కర్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ధర్మాసనం జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొంది. వేరొక ఉత్తర్వులో, చెన్నై నార్త్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న డిఎంకె ఎంపి వీరస్వామిపై దాఖలైన ఫిర్యాదును లోక్‌పాల్ కొట్టివేసింది. సెప్టెంబర్ 10, 2025 నాటి ఆ ఫిర్యాదులో, ఎంపి మోసం, బెదిరింపులు, పలుకుబడిని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. చెన్నైలోని ఒక షాపింగ్ మాల్‌లో రూ. 1.70 కోట్ల పెట్టుబడి కోసం ఫిర్యాదుదారురాలిని రూ. 38 లక్షలు తీసుకోవాలని అతను బలవంతం చేశాడని కూడా ఆరోపణలు ఉన్నాయి. నవంబర్ 10, 2025న ఆదేశించిన సిబిఐ విచారణలో తొమ్మిది మంది సాక్షులను, 32 పత్రాలను పరిశీలించిన అనంతరం, విచారణ అధికారి ఆగస్టు 19న తుది నివేదికను సమర్పించారు. ఫిర్యాదుదారురాలు స్థానిక పోలీసులకు ఈ విషయాన్ని నివేదించిన తర్వాత జరిగిన సంఘటనల దృష్ట్యా, డిఎంకె ఎంపి ప్రమేయాన్ని చూపించేందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదని ఆయన ఆ నివేదికలో పేర్కొన్నారు. 'ఫిర్యాదులో ఆర్‌పిఎస్‌పై చేసిన ఆరోపణలకు ఆధారాలు లేవని విచారణ అధికారి తేల్చిన నిర్ధారణలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని మా అభిప్రాయం. మేము దానితో ఏకీభవిస్తున్నాము. పై విషయాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ఫిర్యాదులో ఎలాంటి అర్హత లేనందున దీనిని కొట్టివేస్తున్నాము' అని లోక్‌పాల్ పేర్కొంది.

## మణిపూర్‌లోని సహాయక శిబిరాలలో మరణాలపై...
# సుప్రీంకోర్టు 'దిగ్భ్రాంతి'

• అఫిడవిట్ దాఖలు చేయాలని సిఎస్‌కు ఆదేశం

**న్యూఢిల్లీ :** అంతర్గతంగా స్థానభ్రంశం చెందిన వ్యక్తుల (ఐడిపిలు) కోసం ఉద్దేశించిన మణిపూర్‌లోని సహాయక శిబిరాలలో పదుల సంఖ్యలో మరణాలు సంభవించడంపై గురువారం సుప్రీంకోర్ట్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించడానికి, క్రిమినల్ విచారణ ప్రారంభించడానికి, అక్కడ నివసిస్తున్న వారి భద్రతను నిర్ధారించడానికి తీసుకున్న చర్యల గురించి తమకు తెలియజేయాలని మణిపూర్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి(సిఎస్)ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. సహాయకత శిబిరాల్లో నిర్వాసితుల అసహజ మరణాలతో సహా, వాటికి సంబంధించిన జస్టిస్ గీతా మిట్టల్ కమిటీ అందించిన సమాచారంపై ఎందుకు గణనీయమైన చర్యలు తీసుకోలేదని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం రాష్ట్ర ఉన్నతాధికారిని హెచ్చరించింది. మణిపూర్‌లోని సహాయక శిబిరాలలో జరిగిన మరణాలు, ముఖ్యంగా అసహజ మరణాలపై అఫిడవిట్ దాఖలు చేయాలని మణిపూర్ చీఫ్ సెక్రటరీని మేం ఆదేశిస్తున్నాం' అని ధర్మాసనం తన ఉత్తర్వులో పేర్కొంది. 34 మరణ కేసులలో కేవలం 20 కేసులకు సంబంధించిన మృతదేహాలకు మాత్రమే పోస్ట్‌మార్టమ్ ఎందుకు నిర్వహించారని సిజెఐ సూర్యకాంత్ ధర్మాసనం ప్రశ్నించింది.'సహాయక శిబిరాలలో ఆశ్రయం పొందుతూ అసహజ మరణాలకు గురైన అంతర్గత నిర్వాసితులకు కేవలం రూ.20,000 నుంచి రూ.30,000వరకు మాత్రమే ఎందుకు చెల్లించారో రాష్ట్ర ప్రభుత్వం వివరించాల్సి ఉంది' అని ధర్మాసనం పేర్కొంది. ఈ విషయంపై స్పెషల్ స్టేటస్ రిపోర్ట్‌ను దాఖలు చేయాలని మణిపూర్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీని (ఎంఎస్ఎల్ఎస్ఎ) కూడా బెంచ్ ఆదేశించింది.



అన్ని అసహజ మరణాల కేసులలో ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యేలా చూడాలని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ధర్మాసనం ఎంఎస్ఎల్ఎస్ఎని కోరింది. ఎఫ్ఐఆర్‌లపై త్వరితగతిన దర్యాప్తు జరిగేలా చూడాలని, సహాయక శిబిరాలలో ఉంటున్న అంతర్గత నిర్వాసితుల భద్రతతోపాటు వారి గౌరవాన్ని కూడా నిర్ధారించాలని ధర్మాసనం మణిపూర్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీని ఆదేశించింది. మణిపూర్‌లోని సహాయక శిబిరాలలో 30కి పైగా మరణాలు సంభవించాయని, వాటిలో ఒక మరణం లైంగిక దాడి ఆరోపణల నేపథ్యంలో జరిగిందని జస్టిస్ మిట్టల్ కమిటీ, ఒక ఐఎఎస్ అధికారి ఇచ్చిన నివేదికలను పరిశీలించిన అనంతరం ధర్మాసనం ఈ ఉత్తర్వును జారీచేసింది. అంతేకాకుండా, రెండు స్పెషల్ ట్రయల్ కోర్టుల విచారణలు మణిపూర్‌లో 2023లో జరిగిన జాతి హింసాకాండకు సంబంధించి సిబిఐ, ఎన్ఐఎ కేసులను ప్రత్యేకంగా విచారించడానికి ఏర్పాటు చేసిన న్యాయస్థానాలు వాటి విచారణలను వేగంగా ముగిస్తాయి. నివేదికలను ప్రస్తావిస్తూ, కేసుల వివరాలను న్యాయసేవల న్యాయవాదికి అందించామని, బాధితులైన పిటిషనర్లు తమ కేసులను ముందుకు తీసుకెళ్లేందుకు వాటిని ఉపయోగించుకోవచ్చని సిజెఐ ధర్మాసనం తెలియజేసింది.మణిపూర్ హింసా కేసులలో సిబిఐ దర్యాప్తును పర్యవేక్షిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, మాజీ ఐపిఎస్ అధికారి దత్తాత్రేయ పద్సల్గికర్ ఈ వివరాలను అందించారని కూడా పేర్కొంది. సిబిఐ, రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి, కేంద్ర దర్యాప్తు సంస్థ 31కేసులను విచారించగా, వాటిలో 28కేసులకు ఫైనల్ రిపోర్టు దాఖలు చేయనున్నట్లు తెలిపారు. మూడు సిబిఐ కేసులు ఇంకా దర్యాప్తులో ఉన్నాయని ఐశ్వర్యా భాటి అన్నారు. సిబిఐ కేసులను మినహాయించి, రాష్ట్ర ప్రభుత్వం 8 జిల్లాలలో స్థానిక పోలీస్ అధికారులతో కూడిన 42 సిట్ బృందాలను ఏర్పాటు చేసిందని న్యాయాధికారి తెలిపారు. సిట్‌లు 3,020 కేసులను నమోదు చేయగా, 302 కేసుల్లో ఛార్జిషీట్లు దాఖలు చేశారని ఐశ్వర్యా భాటి వివరించారు. 1,583 కేసులలో సిట్‌లు ముగింపు నివేదికలను దాఖలు చేశాయని, 1,135కేసులలో దర్యాప్తు సాగుతుందని ఆమె చెప్పారు. సిట్‌లు దర్యాప్తు చేస్తున్న 33కేసులలో విచారణలు ప్రారంభం అయ్యాయని అదనపు సొలిసిటర్ జనరల్ భాటి జోడించారు.గతంలో మణిపూర్‌లో 2023లో జరిగిన జాతి హింసాకాండకు సంబంధించి తలెత్తిన సిబిఐ, ఎన్ఐఎ కేసులను ప్రత్యేకంగా విచారించేందుకు రెండు స్పెషల్ ట్రయల్ కోర్టులను ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలించాలని మణిపూర్, అసోం ప్రభుత్వాలు, ఇతరులను సుప్రీంకోర్టు కోరింది. మెజారిటీ మైతేయి వర్గం షెడ్యూల్ ట్రైబ్ హోదా కోసం చేస్తున్న డిమాండ్‌కు నిరసనగా హిల్ జిల్లాల్లో నిర్వహించిన గిరిజన సంఘీభావ యాత్ర అనంతరం, 2023 మే 3న మణిపూర్‌లో జాతి హింస చెలరేగిన విషయం తెలిసిందే. కాగా అప్పటి నుంచి 200మందికి పైగా మరణించగా, వందలాడి మంది గాయపడ్డారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

## మారాఠా కోటా కార్యకర్త
# జారంగే దీక్ష విరమణ

• మూడు నెలల్లోగా డిమాండ్లు నెరవేర్చకుంటే నిరసనను ముంబయికి తీసుకెళ్తానని హెచ్చరిక



**బీడ్ :** మరాఠా కోటా కార్యకర్త మనోజ్ జారంగే గురువారం నిరాహార దీక్షను విరమించారు. మరాఠా సామాజిక వర్గానికి కున్బీ సర్టిఫికేట్లు జారీ చేయాలని జారంగే గత 20 రోజులుగా నిరాహారదీక్ష చేస్తున్నారు. కాగా, మరాఠా రిజర్వేషన్ల కోసం తాను చేపట్టిన డిమాండ్లను మూడు నెలల్లోగా పరిగణనలోకి తీసుకోకపోతే, తన నిరసనను ముంబయికి తీసుకెళ్తానని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ దీక్షను విరమించారు. బీడ్ జిల్లాలోని పటోడాలో మంత్రులు రాధాకృష్ణ విఖే పాటిల్, దాదా భూసే, ఎమ్మెల్సీ ప్రసాద్ లాడ్, ఎమ్మెల్యే సురేష్ ధాస్, ఇతర సీనియర్ అధికారులతో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందంతో చర్చల అనంతరం జారంగే ఈ ప్రకటన చేశారు. ప్రభుత్వం ఎలాంటి బెదిరింపు చర్యలను సహించదని, జరుగుతున్న గణేష్ ఉత్సవాల సమయంలో ఈ ఆందోళన చేపట్టడంపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ప్రశ్నించిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది. జారంగే నిరాహార దీక్షను విరమించాలన్న నిర్ణయాన్ని ఫడ్నవిస్ స్వాగతించారు. ఆయన కోరిన 13 డిమాండ్లలో 12ను ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, వాటన్నింటినీ నెరవేరుస్తుందని తెలిపారు. ముంబయి వెళ్లే మార్గమధ్యంలో బీడ్ జిల్లాలోని పటోడాలో ఆగిన కార్యకర్త జారంగేతో జరిగిన సమావేశంలో, మరాఠా కోటా కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల గురించి ప్రతినిధి బృంద సభ్యులు ఆయనకు తెలియజేశారు. తన డిమాండ్లను పరిగణనలోకి తీసుకునేందుకు జరుగుతున్న అధికారిక పనుల పురోగతిని పర్యవేక్షించడానికి జారంగే ముగ్గురు ప్రతినిధులను నియమించాలని విఖే పాటిల్ సూచించారు. 'అడ్వకేట్ జనరల్ నుండి లిఖితపూర్వక వ్యాఖ్య అందిన తర్వాత కొల్హాపూర్, సతారా గెజిట్లపై చర్య తీసుకోవడానికి సుమారు మూడునాలుగు నెలల సమయం పడుతుంది' అని మంత్రి అన్నారు. తన నిరాహార దీక్షను విరమించుకోవాలని జారంగేను కోరారు. మరాఠాలు తమ కున్బీ వంశాన్ని నిరూపించుకుని, ఒబిసి రిజర్వేషన్ ప్రయోజనాలను పొందగలిగేలా, హైదరాబాద్ గెజిట్, సతారా గెజిట్, ఔంధ్ గెజిట్ వంటి చారిత్రక పరిపాలనా రికార్డులకు అధికారిక గుర్తింపు ఇవ్వాలన్న తన డిమాండ్‌పై తాను కట్టుబడి ఉన్నానని జారంగే అన్నారు. ప్రభుత్వం తనకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే, తన నిరసనను ముంబయికి తీసుకువెళ్తానని జారంగే అన్నారు. 'రాబోయే మూడు నెలల్లో మమ్మల్ని మోసం చేస్తే, మేమందరం మా పిల్లలు, మహిళలతో సహా నేరుగా ముంబయి వెళ్తాము' అని ఆయన అన్నారు. ఇప్పటికే ముంబయికి వెళ్లిన లక్షకు పైగా మరాఠాలను తమ ఇళ్లకు తిరిగి రావాలని ఆయన కోరారు. ఇదిలా ఉండగా, జాల్నా జిల్లాలోని తన సొంత గ్రామం అంతర్వాలి సరతి నుండి బయలుదేరిన జారంగే, అహిల్యానగర్, పుణె, రాయ్‌గఢ్ జిల్లాలోని ఖోపోలి మీదుగా సెప్టెంబర్ 19 నాటికి ముంబయి చేరుకోవాల్సి ఉంది. అయితే, కడుపు, పాదాలలో తీవ్రమైన మంటగా అనిపిస్తోందని పేర్కొంటూ, ముంబయి యాత్రను రద్దు చేసుకునే అవకాశం ఉందని ఆయన బుధవారమే సూచించారు. గత ఏడాది ఆజాద్ మైదాన్‌లో జారంగే చేపట్టిన నిరాహార దీక్ష సమయంలో వేలాది మంది మద్దతుదారులు నగరానికి తరలిరావడంతో దక్షిణ ముంబయి స్తంభించిపోయింది.

# విశ్వసనీయ తయారీ హబ్.. భారతదేశం

ప్రధాని మోదీ
చిప్ పరిశ్రమ కోసం పూర్తి సహకారం అందిస్తామని హామీ

**న్యూఢిల్లీ :** ప్రపంచ తయారీ రంగానికి భారతదేశం ఒక నమ్మకమైన ప్రత్యామ్నాయమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. సెమీ కండక్టర్ల రంగంలో దేశాన్ని ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటోందని ప్రధాని చిప్ పరిశ్రమ నాయకులను ఉద్దేశించి అన్నారు. ప్రపంచం కొత్త, విశ్వసనీయమైన తయారీ రంగం కోసం ఎదురుచూస్తోంది. సెమీకండక్టర్ వ్యవస్థకు ప్రాధాన్య గమ్యస్థానంగా మారడానికి భారతదేశం అవసరమైన ప్రతీ అడుగు వేస్తోందని అని గురువారం ఇక్కడ జరిగిన 5వ సెమికాన్ ఇండియా సదస్సును ప్రారంభిస్తూ ప్రధానమంత్రి మోదీ తెలియజేశారు. ఈ అవసరాన్ని తీర్చడానికి ఇండియా క్రమంగా సిద్ధం అవుతోందని చెప్పారు. ఇండియన్ మ్యాక్స్ చిప్స్ తొలిసారిగా వినియోగదారులకు చేరడం ప్రారంభించాయనే వార్తను కూడా మోదీ తన ప్రసంగంలో జతచేశారు. ఇప్పుడు భారతదేశంలోని ప్లాంట్ల నుంచి వస్తున్న మన చిప్స్ దేశం సహా ప్రపంచంలోని వినియోగదారులకు చేరడం ప్రారంభించాయని ఆయన చెప్పారు. మోదీ ఈ ఒత్తిడిని ఆర్థిక పురోగతి అనే విస్తృత కథనంలో భాగంగా పేర్కొన్నారు. 7.8శాతం త్రైమాసిక జిడిపి వృద్ధి, జపాన్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఇటీవల ఇచ్చిన సార్వభౌమ రేటింగ్ ఉన్నతీకరణ, న్యూఢిల్లీ వంటి అంశాలను ఉదహరించారు. ఈ నెలలో భారతదేశం ఆతిథ్యం ఇచ్చిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో ఆమోదించిన డిక్లరేషన్. 'భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతోంది. మరొకవైపు భారతదేశంపై ప్రపంచ విశ్వాసం కూడా పెరుగుతోంది' అని ఆయన అన్నారు. 2022లో ఈ మిషన్ ప్రారంభమైనప్పటి నుంచి ఈ వ్యవస్థ వేగంగా విస్తరించడంలో కీలకపాత్ర పోషించినందుకు, సమావేశానికి హాజరైన పారిశ్రామిక నాయకులను ఆయన ప్రశంసించారు. 'భారతదేశం సాధించిన ఈ విజయానికి మీరే మూల స్తంభాలు, మీరే భాగస్వాములు' అని ప్రధానమంత్రి మోదీ చెప్పారు. 2022లో ప్రారంభమైనప్పటి నుంచి భారతదేశ సెమీ కండక్టర్ కార్యక్రమంలో సాధించిన పురోగతిని కూడా ప్రధాని ముఖ్యంగా ప్రస్తావించారు. ఈ రంగం విధాన రూపకల్పన, ప్రాజెక్ట్ ప్రణాళికల నుంచి పైలట్ ఉత్పత్తి వాణిజ్య తయారీ దశలకు చేరుకుందని ఆయన చెప్పారు.

## మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ పుట్టినరోజు సందర్భంగా, రాజకీయ వర్గాలకు చెందిన నాయకులు గురువారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో ఆయన గడిపిన 25 ఏళ్లను ఈ సందర్భంగా ప్రముఖంగా ప్రస్తావించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పరిపాలనలో ఆయన రికార్డును ప్రశంసించగా, హోం మంత్రి అమిత్ షా ఒక సాధారణ బిజెపి కార్యకర్త నుండి దేశంలో అత్యున్నత రాజకీయ పదవి వరకు మోదీ సాగించిన ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారతదేశం ఆవిర్భవించడంలో మోదీ కీలక పాత్ర పోషించారని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ప్రశంసించారు. గుజరాత్ ముఖ్యమంత్రి నుండి ప్రధానమంత్రి వరకు ఆయన సాగించిన ప్రయాణం 'భారత వృద్ధి గాథకు కొత్త ఊపునిచ్చింది' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా మోదీ దీర్ఘాయుష్షుతో జీవించాలని ఆకాంక్షించారు. గుజరాత్‌లోని వద్నగర్‌లో 1950 సెప్టెంబర్ 17న జన్మించిన మోదీ, గురువారం 76వ ఏట అడుగు పెట్టారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేసి, 2014లో ప్రధానమంత్రి అయిన ఆయన, అక్టోబర్ 7న ప్రజా పదవిలో అప్రతిహతంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటారు.

## మధ్యప్రదేశ్‌లో అవినీతి,అసమర్థ ప్రభుత్వం

• 30 మందికి పైగా గిరిజన పిల్లలు మృతిపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు

**న్యూఢిల్లీ :** బాలాఘాట్ జిల్లాలో వివిధ వ్యాధుల కారణంగా 30 మందికి పైగా గిరిజన పిల్లలు మరణించడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ గురువారం మధ్యప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అత్యంత అవినీతిమయమైన, అసమర్థమైన ప్రభుత్వమని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను కూడా తప్పుబట్టిన రాహుల్‌గాంధీ, దీపాలు వెలిగించడం, వేడుకలు జరుపుకోవడం వంటి కార్యక్రమాల తర్వాత సమయం దొరికితే, రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను ఆయన పరిశీలించాలన్నారు. 'బాలాఘాట్‌లో అనారోగ్యం, పోషకాహార లోపం, కనీస ఆరోగ్య సదుపాయాల కొరత కారణంగా 30 మందికి పైగా గిరిజన పిల్లలు మరణించారు. నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందంటే, అమాయక ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం స్పందించడంలో జాప్యం చేస్తూ నిద్రపోతూనే ఉంది' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు 'ఎక్స్' వేదికగా హిందీలో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. వ్యాధుల నియంత్రణ లేకపోవడం, పోషకాహారం, స్వచ్ఛమైన నీటి కొరత, కుప్పకూలుతున్న ఆరోగ్య వ్యవస్థ పిల్లల ప్రాణాలను బలిగొంటున్నాయని ఆయన ఆరోపించారు.

## పంజాబ్, ఎంపిలో రైతులు ఆందోళనబాట

**పెర్రోజ్‌పూర్/హింగోలి :** పంజాబ్, మధ్యప్రదేశ్‌లో పలు సమస్యలపై రైతులు ఆందోళనబాటన పట్టారు. రుణమాఫీ సహా 12 డిమాండ్లు అమలు చేయాలని పంజాబ్‌లో, భూసేకరణకు వ్యతిరేకంగా మధ్యప్రదేశ్‌లో రైతులు నిరసనలు వ్యక్తం చేశారు. రుణమాఫీ, బాస్మతి, మొక్కజొన్న, పెసర, ఆవాలు, బంగాళదుంపలను కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేయడం వంటి తమ 12 డిమాండ్లను పరిష్కరించి, తమతో చర్చలు జరపాలని పంజాబ్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రైతులు గురువారం నాలుగు చోట్ల రైలు పట్టాలపై బైఠాయించారు. మల్లన్‌వాలా, అమృత్‌సర్, గురుదాస్‌పూర్, మోగా ప్రాంతాల్లో రైతులు రైలుపట్టాలపై బైఠాయించినట్లు ఈ నిరసనకు నాయకత్వం వహిస్తున్న కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) తెలిపింది. గురువారం మధ్యాహ్నం 12 గంటలలోపు తమ డిమాండ్లను నెరవేర్చాలని బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసిన తర్వాత తాము ఈ నిరసనను ప్రారంభించినట్లు కెఎంఎం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించకపోతే, రైలు పట్టాలపై బైఠాయించేందుకు ప్రణాళిక వేసినట్లు ఆ సంస్థ పేర్కొంది. గత ఆందోళనలలో పాల్గొన్న రైతులు, కార్మికులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని రైతులు తమ డిమాండ్లలో భాగంగా కోరుతున్నారు. ఆగస్టు 31న, రైతులు పంజాబ్ వ్యాప్తంగా డిప్యూటీ కమిషనర్ల కార్యాలయాల వెలుపల నిరసన తెలిపి, తమ డిమాండ్లను వెల్లడిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలోని పలువురు క్యాబినెట్ మంత్రుల నివాసాలు, కార్యాలయాల బయట ధర్నాలు నిర్వహించారు. ఫిరోజ్‌పూర్‌లో, శాంతియుత ప్రదర్శనలు జరిగినప్పటికీ, రైతులు, కార్మికులకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని కెఎంఎం నాయకుడు ఇందర్‌జిత్ సింగ్ బాత్ అన్నారు. రైతుల 12 సూత్రాల చార్టర్‌లో, రైతులు, వ్యవసాయ కార్మికులకు పూర్తి రుణమాఫీతో పాటు, ఆత్మహత్య చేసుకున్న రైతులు, కార్మికుల కుటుంబాలకు తగిన పరిహారం మరియు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP31BR 3177 | Sindhura kukkamudi | ACE 12XW | 2011 |
| 2 | TS08KA 3845 | Rajender Thota | SWIFT DIZERE VDI DIESEL 5 SEATER | 2013 |
| 3 | TS02EZ 5498 | Salendra Pavan Kalyan | JOHN DEERE 5210 | 2019 |
| 4 | TS07UE 7775 | Sadanandam Medipelly | TATA BOLT-P | 2017 |

**AUCTION DATE : 19-09-2026**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**

H No : 55-1-191, 1st Floor , Above HDFC Bank, Karimnagar Road, Ramaram Complex, Hanamkonda 506015 Cell : 9666576664, 9959103322 & 9676049567.

# ఎక్కడో దూరంగా కూర్చుని పెత్తనమా?

● అమెరికా ఆంక్షల బిల్లుకు చైనా తీవ్ర వ్యతిరేకత ● భద్రతామండలి జోక్యంలేని మూడోపక్షం జోక్యాన్ని పట్టించుకోం ● సమానత్వం,పరస్పర ప్రయోజనాలతోనే వాణిజ్య సహకారం ● చైనా విదేశాంగ ప్రతినిధి జాయాకున్ స్పష్టీకరణ ● సుంకాలపై సంప్రదింపులు



**బీజింగ్:**అమెరికా కాంగ్రెస్ దిగువసభలో రష్యాపై ఆర్థిక ఆంక్షల ఒత్తిడిని మరింత పెంచుతూ చేసిన తీర్మానాన్ని చైనా ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఎక్కడో దూరంగా కూర్చుని మాపై పెత్తనం చేస్తే సహించబోమని ఘాటుగా హెచ్చరిక చేసింది. రష్యాతో చైనాకు ఉన్న ఆర్థిక సహకారం,వాణిజ్యంపై మూడోపక్షం జోక్యం ఉండకూడదని స్పష్టం చేసింది. ''భద్రతామండలి ప్రమేయం లేని సుదూర అధికార పరిధి విస్తరణను వ్యతిరేకిస్తున్నాం'' అని ఎంతో మర్యాదగా స్పందించింది. ఒకవైపు ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తూనే,అమెరికా–చైనా వాణిజ్య బృందాలు పరస్పర సుంకాలను తగ్గించుకోవడంకోసం సన్నిహిత చర్చలు జరుపుతున్నాయని చైనా వాణిజ్యమంత్రిత్వశాఖ ప్రతినిధి గురువారం ప్రకటించారు.''లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'' అనే పేరుతో గురువారంనాడు అమెరికా బిల్లును ఆమోదించింది.అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా భద్రతామండలి జోక్యం లేని ఎలాంటి చర్యలనైనా చైనా తీవ్రంగా ప్రతిఘటిస్తుందని ఆ దేశ విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గ్వో జియాకున్ వారాంతపు మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. ''ఆమెరికా దిగువసభ,ఎగువసభ చేసిన తీర్మానం అంతర్జాతీయ చట్టాల పరిధిలోకి రాదు, ఈ విషయంలో భద్రతామండలి ప్రమేయం లేదు, దాని అధికారపరిధిలోకి ఈ బిల్లు లేదా తదుపరి చట్టం వర్తించదు,దీనిని ప్రతిఘటిస్తాం''అన్నారు.ప్రపంచ దేశాలతో చైనా సమానత్వం,పరస్పర ప్రయోజనాలు అనే సాధారణ సూత్రాల ఆధారంగా సాధారణ వాణిజ్య సంబంధాలను,ఆర్థిక సంబంధాలను కొనసాగిస్తుందని చెప్పారు.ఈ విధమైన వాణిజ్య సహకారంలో మూడోపక్షం జోక్యాన్ని చైనా పట్టించుకోదని,మూడోపక్షం బలప్రయోగానికి కట్టుబడి ఉండబోదని అన్నారు.ఇరాన్ నుండి చమురు కొనుగోలు చేయకూడదంటూ ఇంతకుముందు ఇదేవిధంగా ఎకనామిక్ డీ డే పేరుతో విధించిన ఆర్థిక ఆంక్షలను కూడా చైనా తిరస్కరించింది.రష్యా నుండి చైనాకు భూ సరిహద్దుల నుండి పైప్‌లైన్ ద్వారా చమురు,సహజవాయువులను రష్యా సరఫరా చేస్తుంది. అధికారిక గణాంకాల ప్రకారం గత ఏడాదిలో రష్యా నుండి చైనాకు చమురు సహజవాయువు దిగుమతుల విలువ 64 బిలియన్ డాలర్లకు చేరింది. 2026 జనవరి నుండి ఆగస్టు నెల వరకూ రష్యా నుండి చైనాకు దిగుమతులు 70 బిలియన్ డాలర్లు దాటాయి.

# ఇయు అసోసియేట్‌గా కెనడా: మార్క్ కార్నీ సమ్మతి

● ఈ పొత్తు ఇతర ప్రజాస్వామ్య దేశాలకు ఆదర్శం ● అగ్రరాజ్యాలకు పోటీగా కొత్త కూటమికి తిరస్కృతి



**బ్రస్సెల్స్:**యూరోపియన్ యూనియన్(ఇ.యు)లో మొట్టమొదటి అసోసియేట్ సభ్యదేశంగా ఉండాలని ఇ.యు కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండర్‌లేయన్ చేసిన ప్రతిపాదనను కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ స్వాగతించారు. సభ్యదేశంగా చేరడాన్ని ఒక సానుకూల చర్యగా అభివర్ణించారు. ఐతే ఇ.యులో పూర్తిస్థాయిలో 28వ సభ్యదేశంగా ఉండాలనుకోవడంలేదని నొక్కి చెప్పారు. కెనడా–ఇ.యు మధ్య పొత్తు ఇతర ప్రజాస్వామ్య దేశాలకు ఒక మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. అనేక రంగాలలో ఇయుతో కెనడా సన్నిహితం కాగలదన్నారు.కెనడా–ఇయు దేశాల ప్రజలమధ్య సంబంధాల గురించి ప్రస్తావించారు. యువత అట్లాంటిక్ మహాసముద్రానికి ఇరువైపులా రాకపోకలకు, నివాసాలకు, విద్యాభ్యాసానికి అవకాశాలు కల్పించాలని కార్నీ కోరారు. ఐతే అగ్రరాజ్యాలకు వ్యతిరేకంగా మరింత సన్నిహితమైన పోటీ ఇచ్చేందుకు ''యూరోపియన్ యూనియన్ భద్రతా మండలి'' ఏర్పాటు చేయాలన్న వోండర్‌లేయన్ ప్రతిపాదనను మాత్రం ఆయన తిరస్కరించారు. స్ట్రాస్‌బర్గ్‌లో బుధవారం జరిగిన ఇయు స్టేట్ ఆఫ్ ద యూనియన్ సమావేశంలో వోండర్‌లేయన్ కీలక ఉపన్యాసం తర్వాత గురువారం ఆమెతో కలిసి ఇయు పార్లమెంటులో మార్క్‌కార్నీ ప్రసంగించారు. యూరోపియన్ యూనియన్ భద్రతామండలి ఏర్పాటు చేయడం అనే ప్రతిపాదనను తోసిపుచ్చుతూ ఇది బహుశా శత్రుచర్యగా మారుతుందని, ఆమోదయోగ్యం కాదని కార్నీ అన్నారు.ఈ విధమైన ప్రతిపాదనలో ఎంతమాత్రం స్నేహభావం లేకపోతే భారీఎత్తున సుంకాలు విధిస్తానని డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక చేసిన నేపత్యంలో కార్నీ ఇ.యు పార్లమెంటు ప్రసంగంలో పైవిధంగా స్పందించారు.అమెరికా–కెనడా మధ్య గతనెలలో వాణిజ్య సుంకాలపై జరిగిన చర్చలు విఫలమైన తర్వాత కార్నీ ఇ.యుకు సన్నిహితంగా వచ్చారు.కానీ ట్రంప్ మాత్రం యూరోపియన్ యూనియన్‌లో కెనడా మొదటి అసోసియేట్ సభ్యదేశం అనే మాటను నవ్వులాటగా అభివర్ణించారు.రష్యా నుండి యూరప్ ఖండానికి ఎదురవుతున్న ముప్పు నేపథ్యంలో రాబోయే సంవత్సరంలో యునైటెడ్ కింగ్‌ఉక్రేన్‌లను కూడా యూరోపియన్ యూనియన్‌లో చేర్చుకుంటామని,కెనడాను కూడా ఆహ్వానిస్తున్నామని ఉర్సులా వోండర్‌లేయన్ స్టేట్ ఆఫ్ ద యూనియన్ ప్రసంగంలో చెప్పారు. ప్రస్తుతం ఎదురవుతున్న అభద్రతా వాతావరణంలో ఒక యూరోపియన్ భద్రతామండలిని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అమెరికాలో 51వ రాష్ట్రంగా ఎందుకు? యూరోపియన్ యూనియన్‌లో 28వ సభ్యదేశంగా ఉండకూడదా? అని మార్క్ కార్నీని ఆమె కోరారు. ఆమె ప్రశ్నకు కార్నీ గురువారం ఇజయు పార్లమెంటు ప్రసంగంలో సమాధానంగా ఆ ఆహ్వానాన్ని స్వాగతించారు.పాత్రికేయులతో మాట్లాడుతూ, ఇయుతో సన్నిహిత సంబంధాన్ని ఒక సానుకూల ప్రక్రియగా పేర్కొన్నారు. దీనివల్ల అమెరికాకు కెనడా మరింత సమర్థవంతమైన భాగస్వామిగా మారుతుందన్నారు. వివిధ కీలక రంగాలలో మరింత సన్నిహిత సంబంధాలుఏర్పాటు చేసుకోవడం ద్వారా కెనడాకు తలుపులు తెరిచేందుకు కృషి చేయాలని కోరుకుంటున్నట్లు ఆమె సభ్యదేశాల ప్రతినిధులకు తెలియజేశారు.ఈ సభ్యత్వ ప్రతిపాదన చేస్తున్నట్లు చెప్పారు.

## వామపక్షాల గెలుపు

(మొదటి పేజీ తరువాయి)

కూటమిల మధ్య 26,169 ఓట్లు తేడా మాత్రమే ఉంది. వామపక్ష కూటమిలో సోషల్ డెమోక్రాట్స్‌పార్టీకి చెందిన నాయకురాలు, ప్రతిపక్ష నేత మాగ్డలెనా ఆండర్సన్ నూటికినూరుశాతం ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. 2021 నుండీ ఆమె స్వీడన్ సోషల్ డెమోక్రటిక్‌పార్టీ నాయకత్వ బాధ్యతల్లో ఉన్నారు.2014నుండి 2021 వరకు స్వీడన్ ఆర్థికమంత్రిగా, తర్వాత 2021–2022 వరకూ ప్రధానమంత్రిగా ఆమె బాధ్యతలు నిర్వహించారు. సెప్టెంబరు 13న స్వీడన్‌లో ఎన్నికల ప్రక్రియ పూర్తికాగా, గురువారం 99.9 శాతం మేరకు కౌంటింగ్ పూర్తయ్యేసరికి మధ్యేవాద వామపక్ష కూటమి ఆధిక్యంలో కొనసాగుతూ ఉండటంతో ఆ కూటమి విజయం ఖరారైంది. దీంతో ప్రస్తుత ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టెర్‌సన్ తన పదవికి రాజీనామా చేశారు. స్వీడన్ పార్లమెంటు రిక్స్‌డాగ్‌లో 349 స్థానాలు ఉన్నాయి.ఆండర్‌సన్ కూటమి 175 స్థానాలు గెలుచుకునే దిశగా దూసుకుపోతోంది. పార్లమెంటుతోపాటే రాష్ట్రాలలోనూ,స్థానిక సంస్థలకూ కూడా పోలింగ్ జరిగడంతో దేశంలో ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ప్రస్తుత ప్రధానమంత్రి, పచ్చిమితవాద కూటమి నాయకుడు క్రిస్టెర్‌సన్ ఫలితాలు రాక ముందునుండీ తానే మళ్ళీ ప్రధానమంత్రి పదవి చేపడతానని ప్రచారం చేసుకున్నారు. ఆయన ఆశలు అడియాశలయ్యాయి.

## దారుణహత్య

(మొదటి పేజీ తరువాయి)

నిజామాబాద్ ఐదో ఠాణా పరిధిలోని ఇంద్రాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. రాజరాజేంద్ర చౌరస్తాలో మక్కబుట్టలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగే గురువారం మక్కబుట్టలు అమ్ముకుంటున్న క్రమంలో.. దాహం వేసి నీళ్ల కోసం పక్కనే ఉన్న చాట్‌బండి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో ఓ కారులో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆయన తలపై పదునైన ఆయుధంతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన హరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కారులో ముగ్గురు వ్యక్తులు ఉండగా... ఓ వ్యక్తి వచ్చి పదునైన ఆయుధంతో తలపై నరికిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. నిందితుడు 10 సెకన్లలో 9 సార్లు కత్తితో నరికిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

**వైష్ణవి హత్య కేసులో హరిబాబు నిందితుడు..**

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి (19), కోరుట్ల పట్టణం ఏసుకోనిగుట్టకు చెందిన చిత్తరి హరిబాబు(26)కి వివాహం జరిగింది. నాలుగు నెలల గర్భిణిగా ఉన్న వైష్ణవి గొంతు నులిమి, చేతులు, నుదిటిపై కత్తితో పొడిచి హత్య చేసినట్లు హరిబాబుపై ఆరోపణలున్నాయి. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు హరిబాబును అరెస్టు చేశారు. ప్రస్తుతం బెయిల్‌పై జైలు నుంచి బయటికొచ్చిన నిందితుడు గురువారం దారుణహత్యకు గురయ్యాడు.

## షెడ్యూల్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్హత (డిగ్రీ) కలిగిన పట్టభద్రులందరూ ఓటరు నమోదుకు అర్హులుగా ఉంటారని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనల మేరకు సెప్టెంబర్ 28న ఈ ఓటర్ల నమోదు ప్రక్రియకు అధికారిక పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నారు. అభ్యర్థులు సవరించిన ఫారం18 దరఖాస్తులను సమర్పించడానికి నవంబర్ 6 వరకు తుది గడువు కేటాయించారు. అనంతరం అందిన దరఖాస్తులను పరిశీలించి నవంబర్ 25న ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు లేదా సవరణలకు అవకాశం ఇస్తారు. వీటిపై సమగ్ర విచారణ చేపట్టి డిసెంబర్ 25 నాటికి పరిష్కారాన్ని పూర్తి చేసి, డిసెంబర్ 30న ఆయా నియోజకవర్గాల తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నట్లు వివరించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నిబంధనల ప్రకారం పాత ఓటర్ల జాబితాను నూతనంగా మళ్లీ సేకరిస్తారు కాబట్టి, గతంలో ఓటర్లుగా నమోదైన వారు కూడా తప్పనిసరిగా కొత్తగా ఫారం 18 ద్వారానో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అర్హత గల అభ్యర్థులు సిఈఓ తెలంగాణ అధికారిక వెబ్‌సైట్ (https://ceotelangana.nic.in) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా తగిన సర్టిఫికేట్ల నకళ్లను జతచేసి సంబంధిత, ఈఆర్ఓ, ఎఈఆర్ఓ డిసిగ్నేటెడ్ అధికారులకు నేరుగా కానీ, పోస్ట్ ద్వారా కానీ అందజేయవచ్చు అన్నారు.

# నాలుగుశాతానికి పెరిగిన అమెరికా వడ్డీరేట్లు

● ట్రంప్‌ను ఉల్లంఘించి ఫెడ్ ఛైర్ ఏకగ్రీవ తీర్మానం ● ద్రవ్యోల్బణం సమస్యగా ఉండిపోయింది:వార్ష్



**వాషింగ్టన్:**గడచిన మూడేళ్ళలో మొదటిసారి అమెరికాలో వడ్డీరేట్లు పెరిగాయి. అమెరికాలో శరవేగంగా పెరుగుతున్న ధరలకు కళ్ళెంవేసి వాటిని వేగాన్ని తగ్గించడం కోస ం ఈ వడ్డీరేట్లు పెంచారు. 3.5–3.75 శాతంగా ఉన్న వడ్డీరేట్లను 3.75 నుండి 4. 00 శాతం మేరకు పెంచుతూ ఫెడరల్ రిజ ర్వు గురువారం ఏకగ్రీవ తీర్మానం చేసింది. అ ధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఈ పెరుగుదల శరాఘాతంగా మారింది. ఎందుకంటే ఆయన ఏరి కోరి ఎంపిక చేసి పదవిలో కూర్చోబెట్టిన ఫెడరల్ రిజర్వు ఛైర్మన్ కెవిన్ వార్ష్, ఆయన మాట ధిక్కరించి వడ్డీరేట్ల పెంచారు. వడ్డీరే ట్లు తగ్గించాలని పిలుపు ఇచ్చిన డోనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్య తిరేకత వ్యక్తం చేసినప్పటికీ, ఫెడరల్ రిజర్వు ఏకగ్రీవం గా నాలుగూశాతానికి వడ్డీరేట్లు పెంచింది. ''ద్రవ్యోల్బ ణం చాలా ఎక్కువగా ఉంది, అంతేకాదు, చాలాకాలంగా అదేస్థాయిలో కొనసాగుతోంది కూడా, ఇప్పుడు మేం తీసుకున్న నిర్ణయం ఎంతో వివేకవంతమైనది, చాలా ఆలోచించి జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నాం,ఈ విషయంలో బాధ్యతాయుతంగా ప్రవర్తించాం'' అని కెవిన్ వార్ష్ చెప్పారు.ఈ వడ్డీరేట్ల పెరుగుదల వద్ద పొదుపుచేసే వారికి మేలు జరిగినప్పటికీ, అప్పుడు తీసుకోవాలనుకునేవారికి, కొత్తగా క్రెడిట్ కార్డులు తీసుకోవాలనుకునేవారికి,ఇంటి తనఖాలు పెట్టాలనుకునేవారికి పెనుభారంగా మారిపోతాయి.తాము ఆశావాదంతో ఉన్నప్పటికీ దేశంలో ద్రవ్యోల్బణం ఒక సమస్యగా మిగిలిపోయిందని అన్నారు. ద్రవ్యోల్బణాన్ని రెండూశాతం,అంతకంటే తక్కువ స్థాయికి తీసుకురావాలని ఫెడరల్ రిజర్వు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, ఐదేళ్ళుపైగా దేశంలో ద్రవ్యోల్బణం హెచ్చుస్థాయిలోనే కొనసాగుతోంది.ఏడు నెలలుగా ట్రంప్ చేస్తున్న యుద్ధం పుణ్యమాఅని ఈ పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. చమురు ధరలు గడచిన రెండు రోజులుగా చరిత్రాత్మకమైన పెరుగుదల సాధించాయి. నవంబరులో ద్వైవార్షిక ఎన్నికల నేపథ్యంలో ట్రంప్ ఈ వడ్డీరేట్ల విషయంలో వ్యతిరేకంగా ఉన్నారు. గతంలో వడ్డీరేట్లు తగ్గించలేదని ఫెడరల్ రిజర్వు ఛైర్మన్ జెరోమ్ పావెల్‌ను డోనాల్డ్ ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. ఆ తర్వాత వచ్చిన వార్ష్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆయన ట్రంప్ చేతిలో కీలుబొమ్మగా మారిపోతారని అంచనావేశారు. కానీ వార్ష్ వడ్డీరేట్లు పెంచారు. అమెరికన్లకు చమురు ధరలు, జీవన వ్యయాలు రోజు రోజుకూ సమస్యగా మారుతున్నాయి. యని వార్ష్ చెప్పారు.

## ట్రంప్ సుంకాలు

(మొదటి పేజీ తరువాయి)

వేశారు. మొత్తం 16 మంది వ్యతిరేకంగా స్పందించారు.57 మంది ప్రతిపక్ష డెమోక్రాట్లు మద్దతు ఇవ్వడంవల్లనే ఈ బిల్లు చాలా సులభంగా దిగువసభలో ఆమోదం పొందింది. ప్రపంచ ప్రామాణిక బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 100 డాలర్లు దాటిపోయిన దశలో ఈ పరిణామం సంభవించింది.

రష్యా ఇంధన పరిశ్రమలను,షాడో ఫ్లీట్ ట్యాంకర్స్(రహస్యంగా వేరే ముసుగులో చమురు వాణిజ్య రవాణా)ను లక్ష్యంగా చేసుకుని ప్రధానంగా ఈ ఆంక్షల బిల్లును ఆమోదించారు. ''లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'' అనే పేరుతో ఈ బిల్లును కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టారు. భారత్,చైనా దేశాలతోపాటు అజర్‌బైజాన్,స్లోవేకియా,హంగేరీ దేశాలను కూడా ట్రంప్ లక్ష్యంగా చేసుకుని భారీగా సుంకాలు విధించేందుకు సిద్ధపడతారు.ఇప్పటికే ఈ బిల్లు అమెరికా సెనేట్‌లో ఆగస్టు ఏడో తేదీన 86–11 ఓట్లతో ఆమోదం పొందింది. దిగువసభ ప్రతినిధులసభలో గడచిన సోమవారం నాడే ఈ బిల్లు ఆమోదం పొందాల్సి ఉండగా, ట్రంప్‌కు నూరుశాతం సుంకాలు విధించడంపై అధికారాలు కట్టేబెట్టే విషయంలో అధికార–ప్రతిపక్షాల మధ్య విభేదాలు నెలకున్నాయి. ఈ ప్రధానమైన చిక్కును పరిష్కరించి బిల్లును ఆలస్యంగా ఆమోదించారు.యూరప్ దేశాలు కూడా రష్యా నుండి చమురు కొనుగోళ్ళు చేస్తున్నాయి. కానీ క్రమంగా ఈ దిగుమతులను యూరప్ దేశాలు తగ్గించుకుంటున్నాయి. ఈ విషయంలో మరో ఏడాది గడువుగా నిర్ణయించుకున్నాయి. ఈ దృష్ట్యా అమెరికా నుండి యూరప్ దేశాలకు దిగుమతులపై మినహాయింపులు లభించే అవకాశాలున్నాయి.

కానీ ఇది ఆచరణలో ఎంతమేరకు ఆమోదయోగ్యంగా ఉంటుంది?ఎంతమేరకు ట్రంప్ ఆశయాలను నెరవేరుస్తుంది? అనే విషయాలు రాబోయేకాలంలోనే క్రియాత్మక ఫలితాలే తేల్చిచెబుతాయి. ఉక్రేన్‌పై నాలుగు సంవత్సరాలుగా యుద్ధం చేస్తున్న రష్యాను లొంగదీసి ఆ దేశాన్ని స్వయంగా చర్చల బల్లవద్దకు లాక్కొచ్చేందుకు మరింత ఒత్తిడి తీసుకువచ్చేందుకు తృతీయపక్షాలను దెబ్బకొట్టాలని,భారత్–చైనా నుండి రష్యాకు వచ్చే ప్రధాన చమురు ఆదాయాన్ని ఆడ్డుకోవాలని ట్రంప్ ప్రణాళిక వేశారు.

**రష్యా, భారత్, చైనాలకు ట్రంప్ షాక్**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆంక్షల బిల్లును దిగువసభలో ఆమోదింపజేసుకోవడం ద్వారా బ్రిక్స్ 18వ సదస్సులో అట్టహాసంగా పాల్గొని గొప్ప విజయాన్ని సాధించిన జోష్‌లో ఉన్న రష్యా,భారత్,చైనా దేశాలకు పెద్ద షాక్ ఇచ్చారు.జి–7 కూటమి బ్రిక్స్ కంటే గొప్పదేమీ కాదని, ప్రపంచ వాణిజ్యంలో,జిడిపిలో బ్రిక్స్ దేశాల వాటా చాలా అత్యధికమని, దేశాల సభ్యత్వసంఖ్యాపరంగా చూసినా బ్రిక్స్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆగ్రశ్రేణి కూటమి అనీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ న్యూఢిల్లీలో బ్రిక్స్ దేశాల సదస్సు ప్రారంభానికి ముందుగా వ్యాఖ్యానించారు. ఈ మూడు దేశాల నాయకులూ ఈ సమావేశాలలో పాల్గొనడం, ఎలాంటి విభేదాలు లేకుండా పశ్చిమాసియాలో యుద్ధంపై అమెరికా పేరు ప్రస్తావించకుండానే ఘాటు తీర్మానం ఇరాన్ సమక్షంలోనే చేయడం వంటి పరిణామాలు ట్రంప్‌కు ఆగ్రహం రప్పించేవే. ఆనాడు సదస్సు సమయంలో ట్రంప్ ఐర్లాండ్ పర్యటనకు వెళ్ళి తనను తాను బిజీగా ఉంచుకున్నారు. ఉక్రేన్‌లో యుద్ధం ముగించేందుకు సరికొత్త చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని మూడు రోజులక్రితం రష్యా నాయకులు లోవరోవ్ ప్రకటించారు. ఉక్రేన్–రష్యాల మధ్య ఇంధన వనరులపై ఎలాంటి దాడులు జరగకుండా ఒక అంగీకారం కుదిరిందని ట్రంప్ కూడా ప్రకటించారు. కానీ తర్వాత జెలెన్స్కీ దానిని తోసిపుచ్చారు. ఈ పరిస్థితుల్లో రష్యాను ఆర్థికంగా దెబ్బతీసేందుకు దానిపై చమురు,సహజవాయువుపై ఆధారపడిన భారత్,చైనాలను ఈ బిల్లు ద్వారా దెబ్బతీసేందుకు ట్రంప్ వ్యూహం పన్నారు.

## 22న మహాధర్నా

(మొదటి పేజీ తరువాయి)

మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్ బస్ భవన్ నుంచి లేబర్ కమిషనర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ పెద్ద ఎత్తున మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా డిపో, గ్యారేజీ, రీజినల్, జోనల్, రాష్ట్ర కమిటీల ప్రతినిధులతో పాటు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు త్వరగా నిర్వహించి, అనంతరం విలీన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## హైదరాబాద్ విలీనం

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ సమైక్యత మరింత బలోపేతం అవుతుందన్నారు. అనంతరం కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా నిజాం పాలనను కీర్తిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. నిజాం అంత మంచొడైతే వందేమాతరం రాంచందర్ రావు, భాగ్యరెడ్డి వర్మ, బండి యాదగిరి, కోదాటి నారాయణ రావు, రాంజీగోండు, సువరం ప్రతాప్ రెడ్డి, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణ రెడ్డి, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, కుమురం భీం, బోమ్మగాని ధర్మభిక్షం, సుద్దాల హనుమంతు, నారాయణరావు పవార్ వంటి యోధులు ఎందుకు పోరాటం చేశారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. రజాకార్ల కిరాతకాల నుంచి రక్షణ పొందేందుకు గ్రామాల్లో ప్రజలు బురుజులు ఎందుకు నిర్మించుకున్నారని ప్రశ్నించారు. స్వతంత్ర భారత సైన్యం నిజాంపై ఎందుకు యుద్ధం చేయాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయం కోసం మజ్లిస్ పార్టీకి భయపడి నిజాం అరాచకాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ రజాకార్ల సంస్థ 1940లో ఏర్పడి హిందువులపై, దేవాలయాలపై దాడులు చేసిందని, తెలుగు భాషను నిషేధించి ఉర్దూను రుద్దారని తెలిపారు. ముఖ్యమంత్రి నిజాంను పొగడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. మజ్లిస్ పార్టీ నేటికీ నిజాం వారసత్వ రాజకీయాలనే కొనసాగిస్తోందని విమర్శించారు. మజ్లిస్ ఒత్తిళ్లకు తలొగ్గి పాలకులు 80 ఏళ్లుగా తెలంగాణ విమోచన చరిత్రను తొక్కిపెట్టారని ఆరోపించారు. భావితరాలకు నిజమైన చరిత్రను తెలియజెప్పేందుకే ప్రధాని నరేంద్ర మోదీ ఐదేళ్లుగా అధికారికంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే పాటలు, సాంస్కృతిక నృత్య రూపకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

## ఎలా ఎదిగారు?

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌ల ఆధారంగానే కల్వకుంట్ల కుటుంబం బండారం బయటపడిందని, వారు అడ్డంగా దొరికిపోయారని మంత్రి విమర్శించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావును ట్యాగ్ చేస్తూ ఆయన సంచలన ఆరోపణలు చేశారు. 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల సమయంలో కెసిఆర్ సమర్పించిన అఫిడవిట్‌లో తనకు ఒక్క ఎకరం భూమి కూడా లేదని స్పష్టంగా పేర్కొన్నారని మంత్రి తెలిపారు. అప్పట్లో సున్నా ఎకరాలు ఉన్న కెసిఆర్‌కు, తెలంగాణ ఉద్యమ కాలంలో, ఆ తర్వాత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో వేల కోట్ల రూపాయల విలువైన భూములు ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. స్వయంగా కెసిఆర్ ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లను పరిశీలిస్తే ఆయన ఆస్తులు ఏ స్థాయిలో భారీగా పెరిగాయో ఇట్టే అర్థమవుతుందని, సున్నా నుంచి వేల కోట్లకు ఎదిగిన భూ బకాసురుడు కెసిఆర్ అని పొంగులేటి తీవ్ర విమర్శలు చేశారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిజమైన తెలంగాణ ఉద్యమకారులకు అప్పులు మాత్రమే మిగిలాయని, కానీ కెసిఆర్ కుటుంబానికి మాత్రం లక్షల కోట్ల ఆస్తులు వచ్చి చేరాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములతో పాటు నిరుపేదలు, దళితులకు చెందిన అసైన్డ్ భూములను దోచుకోవడం ద్వారానే ఈ అక్రమ ఆస్తులు కూడబెట్టారని ఆయన ఆరోపించారు. ఉద్యమకారుల త్యాగాల పునాదుల మీదే కల్వకుంట్ల కుటుంబం అక్రమంగా లక్షల కోట్లు సంపాదించుకుందని మండిపడ్డారు. పుట్టుకతోనే కెసిఆర్‌కు వందల ఎకరాల భూములు ఉన్నాయంటూ కెటిఆర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి తన ఎక్స్ ఖాతాలో కౌంటర్ ఇచ్చారు. 'పుట్టుకతోనే వందల ఎకరాలు ఉన్నాయని బొంకుతున్న డ్రామారావు.. ఈ విషయమై అప్పట్లో ఎన్నికల అఫిడవిట్‌లో తప్పులు రాసి మోసం చేశారా? లేక ఇప్పుడు ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారా?' అని కెటిఆర్‌ను నిలదీశారు.

## విచారణకు సిద్ధమా?

(మొదటి పేజీ తరువాయి)

విసిరారు. 'సెప్టెంబర్ 17' జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కెటిఆర్ గురువారం జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కెసిఆర్ తన ఎన్నికల అఫిడవిట్‌లోనే భూముల వివరాలను వెల్లడించారన్నారు. కెసిఆర్ 1954లో పుట్టినప్పుడే చింతమడకలో రెండెకరాల విస్తీర్ణంలో ఇల్లు ఉందని, ఆ కుటుంబానికి వందల ఎకరాల భూమి ఉండేదని, అంతకు ముందు నిజాం కాలంలో అప్పర్ మానేరు ప్రాజెక్టు ముంపు కింద భూములు పోతే వచ్చిన పరిహారంతోనే ఆ భూమి కొనుగోలు చేశారని వివరించారు. పుట్టుకతోనే వందల ఎకరాల ఆస్తి ఉన్న కుటుంబంలో జన్మించిన కెసిఆర్ తన 72 ఏళ్ల వయస్సులో 67 ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటుంటే, ఆస్తులు పెరిగినట్టా, తరిగినట్టా ? అని ప్రశ్నించారు. కూకట్‌పల్లికి చెందిన కొండల్ రావుకు చెందిన ఆస్తులన్నింటినీ కేసీఆర్ ఖాతాలో వేస్తూ, అబద్ధాలను ప్రచారం చేస్తున్నారన్నారు. తాను అమెరికాలో ఎంబిఏ చదివి, అక్కడే ఆరున్నరేళ్లు పాటు ఉద్యోగం చేశానని, కష్టపడి సంపాదించానని కెటిఆర్ వివరించారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం వనపర్తిలో గోడలపైన రాతలు రాసే స్థాయి నుంచి జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్‌ను నిర్మించుకునే స్థాయికి, వేల కోట్ల రూపాయలు ఎలా సంపాదించారని, ఆ ట్రిక్కును నిరుద్యోగ యువతకు చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభ సమావేశాలను నెల రోజుల పాటు పొడిగించి, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపైన విధించిన అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేస్తే, సిఎం కళ్లల్లో కళ్లు పెట్టి చూడటం కాదని, 420 హామీల మోసంపై నిలదీస్తామన్నారు.కెసిఆర్‌కు వెయ్యి ఎకరాల ఫామ్ హౌస్ ఉన్నదని గతంలో ఆరోపించిన రేవంత్ రెడ్డి, ఇటీవల అసెంబ్లీలో జరిగిన చర్చలో మాత్రం 67 ఎకరాలని స్వయంగా అంగీకరించారని, ఇందుకు కెసిఆర్‌కు సిఎం క్షమాపణచెప్పాలన్నారు. సిరిసిల్లలో కమ్యూనిస్టుల కాలంలో సిహెచ్ రాజేశ్వర రావు తదితర నాయకులు ఆ చెరువు ఎండిపోతే అందులోనే పేదలకు, కార్మికులకు 60,70 గజాల చొప్పున ప్లాట్లు చేసి, పట్టాలు పంపిణీ చేశారని కెటిఆర్ గుర్తుచేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ స్థలాలకు జీవో 58, 59 ప్రకారం క్రమబద్ధీకరించామని, దీనిని కూడా సిఎం కబ్జా అని మాట్లాడుతున్నారన్నారు.

**ఒక్క గజం కొన్నట్టు నిరూపించినా ఏ శిక్షకైనా సిద్ధమే..**

ధరణి వచ్చిన తర్వాత టెస్కాబ్ మాజీ అధ్యక్షుడు కొండూరు రవీందర్ రావు ఒక్క గజం కొన్నట్టుగా నిరూపించినా తాను ఏ శిక్షకైనా సిద్ధమని కెటిఆర్ వెల్లడించారు. సిరిసిల్లాకు వస్తానని చెబుతున్న సిఎం రేవంత్ రెడ్డి సిరిసిల్లలో 8వేల ఎకరాలు ఎక్కడ ఉన్నాయో, ఏ సర్వే నంబర్‌లో ఎవరు కబ్జా చేశారో సమగ్ర వివరాలతో ఒక అధికారిక శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ నవీన్ రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి తమ ఎన్నికల అఫిడవిట్లలో చట్టబద్ధంగా చూపించిన ఆస్తులపైన సిఎం అసత్య ఆరోపణలు చేశారన్నారు.

## తెలంగాణ పుట్టినిల్లు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్‌లో గురువారం ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన త్రివర్ణ పతాకాన్ని సిఎం ఎగురవేశారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ, రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా, భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటం ఉద్ధృతమైందని, ఆ ఉద్యమ, హైదరాబాద్ ప్రజల ఆకాంక్షల నేపథ్యంలోనే ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో ఆపరేషన్ పోలో సైనిక చర్యను చేపట్టారని, ఈ ఆపరేషన్ అనంతరం ఏడో నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయారని గుర్తు చేశారు. రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నరసింహారెడ్డి, అనభేరి ప్రభాకర్‌రావు, చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి ఎందరో యోధులు ఈ పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. సుదీర్ఘ పోరాట చరిత్రలో 'సెప్టెంబర్ 17'కు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. 'సెప్టెంబర్ 17' గతాన్ని మాత్రమే గుర్తు చేసే రోజు కాదని, బాధ్యతలను కూడా గుర్తు చేసే రోజుగా సిఎం అభివర్ణించారు.

**నిజాం పాలనలో అణచివేత..**

నిజాం పాలనలో హైదరాబాద్ పారిశ్రామిక, వ్యవసాయ, విద్యా, వైద్య రంగాల్లో పురోగతి సాధించిందని, నిజాం పాలనలో హైదరాబాద్ ప్రపంచ స్థాయి గుర్తింపును అందుకుందని, అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ,వెట్టిచాకిరి,అణచివేత తీవ్రంగా ఉండేదని



సిఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. చివరి దశలో రజాకార్ల దౌర్జన్యాలు ప్రజలను కల్లోలపరిచాయని,తద్వారా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడిందన్నారు. పాలనలో ప్రజలే కేంద్రంగా ఉండాలని, ప్రజల ఆశలు, ఆకాంక్షలే ప్రభుత్వ నిర్ణయాలకు ప్రామాణికం కావాలనే విషయాన్ని హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమయ్యే వరకు జరిగిన ఉద్యమాలు, త్యాగాలు, బలిదానాల చరిత్ర ఒక స్పష్టమైన సందేశమిస్తోందన్నారు. ఆ స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజా పాలన కొనసాగిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం పొరుగు రాష్ట్రాలతో మాత్రమే కాదని, ప్రపంచంతో పోటీ పడుతోందన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, ఇది దేశ తలసరి ఆదాయం కంటే దాదాపు 91 శాతం అధికమని, అభివృద్ధి అంకెల్లో మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలన్నదే తమ లక్ష్యమన్నారు.

**కృష్ణా జలాల్లో వాటా కోసం న్యాయపోరాటం ..**

కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా కోసం న్యాయపోరాటం చేస్తున్నామని, పాలమూరు రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతలు, ఎస్ఎల్‌బిసితో పాటు ఇతర పెండింగ్ ప్రాజెక్టుల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలని, ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలని ఆకాంక్షించారు.

**ఆహార కల్తీని సహించబోం:**

ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే ఆహార కల్తీని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. అందుకే టిజి సేఫ్ ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ఈగల్ వ్యవస్థను పటిష్ఠం చేశామని, యువత పెడదోవ పట్టకుండా ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రూ.38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాలకు అనుమతులను సాధించామని, ఇందుకు సంబంధించి భూసేకరణ చేపట్టామన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, హైదరాబాద్–నాగపూర్, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–విజయవాడ పారిశ్రామిక కారిడార్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చనున్నాయన్నారు. గ్రామం నుంచి మండలానికి,మండలం నుంచి జిల్లాకు, జిల్లా నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు పనులు చేపట్టామన్నారు.

**డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ ఆవిష్కరణ**

డిసెంబర్‌లో నిర్వహించే 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026' సందర్భంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించబోతున్నామని సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ విజన్ –2047 లక్ష్యాలను సాధించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని, 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నదే తమ సంకల్పమని, దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు.

**'ఎల్‌నినో'ఎదుర్కొనేందుకు ప్రజల సహకారం అవసరం..**

ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని సిఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్నామని, ఈ పరిస్థితులను ఎదుర్కునేందుకు ప్రజలవైపు నుంచి కూడా సహకారం ఆశిస్తున్నామని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మీడియా సహకారం కూడా ఉండాలని కోరారు. వీబీ జీ రామ్ జీలో ఎక్కువ పని దినాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

# టాస్ గెలిచిన అఫ్ఘనిస్థాన్.. వైభవ్ మళ్లీ బెంచ్ మీదే



మూడు టీ20ల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే గెలుపొందిన భారత్ వైట్‌వాష్‌పై కన్నేసింది. వరసగా రెండు ఓటములతో టీమిండియాకు సిరీస్ సమర్పించుకున్న అఫ్గనిస్థాన్ పరువు కోసం ఆడనుంది. నామమాత్రమైన మూడో టీ20లో టాస్ గెలిచిన అఫ్గన్ సారథి ఇబ్రహీం జద్రాన్ బౌలింగ్ తీసుకున్నాడు. అయితే.. అయ్యర్ సేన తుది జట్టులో వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కలేదు. వరసగా రెండు మ్యాచుల్లో విజయంతో సిరీస్ పట్టేసిన టీమిండియా క్వీన్‌స్వీప్ లక్ష్యంగా పెట్టుకుంది. గురువారం మూడో టీ20లోనూ అఫ్గనిస్థాన్‌ను ఓడించాలని భావిస్తున్న శ్రేయాస్ అయ్యర్ సేన టాస్ ఓడింది. ఓదార్పు విజయం కోసం ఎదురుచూస్తున్న అఫ్గనిస్థాన్ బలమైన భారత బ్యాటింగ్ లైనప్పు ఎంత వరకు నియంత్రిస్తుందో చూడాలి. వరసగా రెండు మ్యాచుల్లో బెంచ్మీదే ఉన్న వైభవ్ సూర్యవంశీ తుది జట్టులో లేడు. ఆఖరి గేమ్లో బెంచ్ను పరీక్షిస్తామని చెప్పిన కెప్టెన్ అయ్యర్ ఆశ్చర్యంగా పేసర్ యశ్ ఠాకూర్కు ఓటేశాడు. కాబూలీ టీమ్ కూడా రెండు మార్పులతో బరిలోకి దిగుతోంది. భారత తుది జట్టు : సంజూ శాంసన్(వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి, శివం దూబే, అక్షర్ పటేల్, యశ్ ఠాకూర్, సుందర్, బుమ్రా, రవి బిష్ణోయ్. అఫ్గనిస్థాన్ తుది జట్టు : ఇబ్రహీం జద్రాన్(కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), సెదీకుల్లా అటల్, దార్విష్ రసూలి, అజ్మతుల్లా ఒమర్జాయ్, అబ్దుల్లా అహ్మద్జాయ్, నబీ, రషీద్ ఖాన్, ముజీబ్, నూర్ ఉల్ రహమాన్, ఫజల్హక్ ఫారూఖీ.

## అజిత్ అగార్కర్ గుడ్‌బై

# టీమిండియా చీఫ్ సెలెక్టర్‌గా హైదరాబాద్ మాజీ క్రికెటర్!



టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవి కాలం సెప్టెంబర్‌తో ముగియనుంది. అతని కాంట్రాక్ట్ను 2027 వన్డే ప్రపంచకప్ వరకు పొడిగించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరిగింది. కానీ అగార్కర్ అందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది. సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరిగే వన్డే, టీ20 సిరీస్‌లో బరిలోకి దిగే భారత జట్లను బిసిసిఐ బుధవారం ప్రకటించింది. చీఫ్ సెలెక్టర్‌గా అజిత్ అగార్కర్ ఇదే చివరి సమావేశమని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. టీమిండియా తదుపరి చీఫ్ సెలెక్టర్ రేసులో భారత మాజీ వికెట్ కీపర్ పార్థీవ్ పటేల్‌తో పాటు హైదరాబాద్ ప్లేయర్, టీమిండియా మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా ఉన్నట్లు ఎన్డీటీవీ తమ కథనంలో పేర్కొంది. ప్రజ్ఞాన్ ఓజా ఇప్పటికే సెలెక్షన్ కమిటీలో సభ్యుడిగా ఉన్నాడు.

### అగార్కర్ హయాంలో..

అజిత్ అగార్కర్ 2023 జూలైలో టీమిండియా చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతని హయాంలో భారత్ జట్టు పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అద్భుతమైన విజయాలను అందుకుంది. కానీ టెస్టో ఘోర పరాజయాలను మూటగట్టుకుంది. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ చేరిన భారత్.. 2024, 2026 టీ20 ప్రపంచకప్లో విజేతగా నిలిచింది. 2025లో ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచింది. ఆసియా కప్ టైటిల్‌ను కూడా అందుకుంది. కానీ టెస్ట్‌లో ఎన్నడూ లేని విధంగా సొంతగడ్డపై టెస్ట్ సిరీస్‌ల్లో క్లీన్ స్వీప్ అయ్యింది. సౌతాఫ్రికా, న్యూజిలాండ్ చేతుల్లో సిరీస్ కోల్పోవడంతో పాటు ఆస్ట్రేలియా గడ్డపై బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఓటమిపాలైంది. కాని పరిమిత ఓవర్ల క్రికెట్‌లో టీమిండియా మెరుగైన విజయాలు సాధించడంతో ఈ ఏడాది జూన్‌లో ముగిసిన అగార్కర్ పదవి కాలాన్ని నాలుగు నెలల పాటు పొడిగించారు.

### కోహ్లీ, రోహిత్ విషయంలో..

అయితే భారత స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను వన్డే ప్రపంచ కప్ 2027 దాకా కొనసాగించే విషయంలో అగార్కర్, బిసిసిఐ పెద్దల మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. రోహిత్ శర్మ, కోహ్లీ ప్రపంచకప్ ఆడే విషయంపై స్పష్టత ఇవ్వలేమంటూ అగార్కర్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. అదే సమయంలో రోహిత్, కోహ్లీ మాత్రం తాము కచ్చితంగా వన్డే ప్రపంచకప్ ఆడుతామనే ధీమాతో ఉన్నారు. రోహిత్, కోహ్లీలు టెస్ట్ క్రికెట్కు వీడ్కోలు పలకడానికి కూడా అగార్కర్ వైఖరే కారణమని గతంలో వార్తలు వచ్చాయి. రోహిత్, కోహ్లీ విషయంలో అగార్కర్, బిసిసిఐ మధ్య దూరం పెరిగిందని, అందుకే అగార్కర్ తన పదవి నుంచి తప్పుకున్నాడని ప్రచారం జరుగుతోంది.

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## ఆరావళి పర్వత శ్రేణి ప్రధానంగా ఏ ప్రాంతంలో విస్తరించి ఉంది?

☞2026లో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాన్ని ఏ దేశం నిర్వహించింది?
భారత్. న్యూఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరిగింది.

☞2026 బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి భారత్ ప్రతిపాదించిన ప్రధాన ఇతివృత్తం ఏమిటి?
'బిల్డింగ్ ఫర్ రెసిలియెన్స్, ఇన్నొవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ'.

☞2026లో బ్రిక్స్‌లో పూర్తి సభ్యదేశాల సంఖ్య ఎంతకు చేరింది?
11 దేశాలు.

☞2026 బ్రిక్స్ సమావేశం తర్వాత తదుపరి అధ్యక్ష బాధ్యతలను ఏ దేశం స్వీకరించింది?
చైనా.

☞2026 బ్రిక్స్ న్యూఢిల్లీ ప్రకటనలో ఐక్యరాజ్య సమితికి సంబంధించి ప్రధానంగా ఏ అంశాన్ని ప్రస్తావించారు ?
ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సహా అంతర్జాతీయ సంస్థల్లో గ్లోబల్ సౌత్‌కు ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

☞2026లో భూఆధార్ అనే పేరుతో ప్రారంభించిన వ్యవస్థకు అధికారిక సంక్షిప్త రూపం ఏమిటి?
యుఎల్‌పిఐఎన్.

☞యుఎల్‌పిఐఎన్ ప్రధాన ఉద్దేశం ఏమిటి?
భూకమతాలకు ప్రత్యేక గుర్తింపును కల్పించి భూ రికార్డుల నిర్వహణను మెరుగుపరచడం.

☞2026లో భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టబద్ధ మెట్రాలజీకి సంబంధించిన కొత్త నియమాల పేరు ఏమిటి?
లీగల్ మెట్రాలజీ ఇండియన్ స్టాండర్డ్ టైమ్ రూల్స్, 2026.

☞భారత ప్రామాణిక కాలాన్ని సూచించడానికి ఉపయోగించే సమయ ప్రమాణానికి సంక్షిప్త రూపం ఏమిటి?
ఐఎస్‌టి.


☞2026లో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల మంజూరైన సంఖ్యను ఎంతకు పెంచే బిల్లును పార్లమెంట్ ఆమోదించింది?
34 నుంచి 38కు.

☞సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు ఏ అంశానికి సంబంధించినది?
సుప్రీంకోర్టు న్యాయమూర్తుల మంజూరైన న్యాయమూర్తుల బలానికి సంబంధించినది.

☞భారత రాజ్యాంగంలోని 142వ అధికరణం సుప్రీంకోర్టుకు ఏ అధికారం ఇస్తుంది?
పూర్తి న్యాయం చేయడానికి అవసరమైన ఆదేశాలు, ఉత్తర్వులు జారీ చేసే ప్రత్యేక అధికారాన్ని ఇస్తుంది.

☞2026లో సోన్ నది జలాల భాగస్వామ్యానికి సంబంధించి ఏ రాష్ట్రాల మధ్య అవగాహన కుదిరింది?
బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల మధ్య.

☞2026లో ఆరావళి ప్రాంతానికి సంబంధించిన కమిటీ నివేదిక సమర్పణ గడువును సుప్రీం కోర్టు ఎప్పటివరకు పొడిగించింది?
నవంబర్ 30, 2026 వరకు.



☞ఆరావళి పర్వత శ్రేణి ప్రధానంగా ఏ ప్రాంతంలో విస్తరించి ఉంది?
ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, గుజరాత్ ప్రాంతాల్లో.

☞2026లో వృద్ధులకు అనుకూలమైన కార్యాలయాల కోసం ఏ రాష్ట్రం ప్రత్యేక ధ్రువీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది?
కేరళం.

☞2026లో పార్లమెంట్ ఆమోదించిన జనన మరణాల నమోదు సవరణ బిల్లు దేనికి సంబంధించినది?
జననాలు, మరణాల నమోదుకు సంబంధించిన చట్టపరమైన వ్యవస్థను సవరించడానికి.

☞భారతదేశంలో జననమరణాల నమోదుకు ప్రాథమిక చట్టం ఏది?
రిజిస్ట్రేషన్ ఆఫ్ బర్త్స్ అండ్ డెత్స్ యాక్ట్, 1969.

☞2026లో భారత్–బెల్జియం సంబంధాల్లో ప్రధానంగా ఏ రంగాలకు ప్రాధాన్యం పెరిగింది?
వాణిజ్యం, సాంకేతికత, రక్షణ, పరిశ్రమ, వ్యూహాత్మక సహకారం.

☞2026లో భారత్–చైనా సంబంధాల్లో చర్చకు వచ్చిన ప్రధాన అంశాల్లో ఒకటి ఏమిటి?
సరిహద్దు నిర్వహణ, సైనిక ఉద్రిక్తత తగ్గింపు.

☞2026–27 కేంద్ర బడ్జెట్‌ను ఎవరు ప్రవేశపెట్టారు?
నిర్మలా సీతారామన్.

☞2026–27 కేంద్ర బడ్జెట్‌ను ఏ తేదీన ప్రవేశపెట్టారు?
ఫిబ్రవరి 1, 2026.

☞2026–27 బడ్జెట్‌లో మూలధన వ్యయం సుమారుగా ఎంతగా నిర్ణయించారు?
రూ.12.2 లక్షల కోట్లు.

☞2026–27 బడ్జెట్‌లో ఆర్థిక లోటు జిడిపిలో ఎంతగా అంచనా వేశారు?
4.3 శాతం.

☞2026లో ఆర్‌బిఐ పాలసీ రెపో రేటు ఎంతగా నమోదైంది?
5.25 శాతం.

☞2026 సెప్టెంబర్ నాటికి ఆర్‌బిఐ నగదు నిల్వల నిష్పత్తి ఎంతగా ఉంది?
3 శాతం.

☞2026లో ఆర్‌బిఐ ప్రధానంగా ఏ అంశంపై దృష్టి పెట్టింది?
ద్రవ్యోల్బణం, ద్రవ్యస్థిరత్వం, ఆర్థిక వృద్ధి, బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత నిర్వహణపై.

☞2026లో భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ప్రధాన చర్చాంశాల్లో ఒకటి ఏమిటి?
అధిక వృద్ధి కొనసాగింపుతో పాటు యువత ఉపాధి సృష్టి.

☞2026లో సెమీకాన్ 2.0 ఫ్రేమ్‌వర్క్ ఏ రంగానికి సంబంధించినది?
సెమీకండక్టర్ తయారీ, డిజైన్, సరఫరా గొలుసు అభివృద్ధికి సంబంధించినది.

☞సెమీకండక్టర్ పరిశ్రమకు వ్యూహాత్మక ప్రాధాన్యం ఎందుకు ఉంది?
ఎలక్ట్రానిక్స్, రక్షణ, టెలికమ్యూనికేషన్స్, కృత్రిమ మేధస్సు, ఆటోమొబైల్ రంగాలకు చిప్‌లు కీలకం.



## జనవరి 13న చిరంజీవి 'కాకా' విడుదల

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి 'వాల్తేరు వీరయ్య' సక్సెస్ తర్వాత ప్రతిష్ఠాత్మక చిత్రం 'కాకా'తో రాబోతున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్పై వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలను నెలకొల్పుతోంది. భారీ స్థాయిలో హైఇంటెన్సిటీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్‌లో మెగాస్టార్‌ను రెండు డిఫరెంట్ షేడ్స్‌లో చూపించడంతో సినిమాపై మాస్‌లో భారీ క్రేజ్ ఏర్పడింది. హీరోయిన్ అనశ్వర రాజన్ ఈ సినిమాలో మెడికల్ స్టూడెంట్‌గా నటిస్తోంది. చిరంజీవి 'సత్యం' పాత్రలో కనిపించబోతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుండగా, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి.ఈ సినిమాకు ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు. ఆంటోనీ ఎల్ రూబెన్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. కోన వెంకట్, కే చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి రైటర్స్ గా చేస్తున్నారు. భానునందు డైలాగ్స్ రాస్తున్నారు.'కాకా' 2027 జనవరి 13న సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

# 'ది ప్యారడైజ్' సెన్సార్ పూర్తి



నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో సినిమాపై భారీ అంచనాలను పెంచాయి.తాజాగా మేకర్స్ నాని, కయాదు లోహార్‌ను ఇంటెన్స్ రొమాంటిక్ అవతార్లో ప్రజెంట్ చేస్తూ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.పోసర్‌లో నాని రఫ్ అండ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తుండగా, కయదు లోహార్ కూడా ఇంటెన్స్ అవతార్‌లో కనిపించారు. ఇద్దరూ ఎదురెదురుగా నిలబడి.. సిగరెట్స్ ను లైటర్‌తో వెలిగించుకుంటున్న విజువల్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. చుట్టూ ఉన్న డార్క్, ఇంటెన్స్ వాతావరణం మధ్య ఈ సన్నివేశం వారి మధ్య ఉన్న బాండింగ్‌ను డిఫరెంట్‌గా ప్రజెంట్ చేస్తోంది. ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో హీరో, హీరోయిన్ మధ్య వచ్చే సన్నివేశాలు హైలైట్‌గా ఉండబోతున్నాయి. జడల్ సుబ్బు..ప్రేమ ఇంతకుముందెన్నడూ చూడనంత ప్రత్యేకంగా ఉండబోతుంది.'ది ప్యారడైజ్' సెన్సార్ ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసుకుంది. 'ది ప్యారడైజ్' సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

## నవంబర్ 20న 'ఆకాశంలో ఒకతార'



దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆకాశంలో ఒకతార' సినిమాకు సంబంధించిన విడుదల తేదీని మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ మూవీలో దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి, శ్రుతి హాసన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పవన్ సాధినేని దర్శకుడు. ఈ చిత్రాన్ని లైట్‌బాక్స్ మీడియా బ్యానర్‌పై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్నారు. స్వప్న సినిమా, గీతా ఆరట్స్ సంస్థలు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి.'ఆకాశంలో ఒక తార' సినిమాను నవంబర్ 20న థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తాజాగా ప్రకటించారు. ఈ అందమైన సినిమాను ప్రతి ఒక్కరికీ చేరువ చేసేలా టీమ్ భారీ స్థాయిలో డిఫరెంట్ స్టైల్ ప్రమోషన్స్ నిర్వహించేందుకు ప్లాన్ చేస్తోంది. రీసెంట్‌గా విడుదలైన ఫస్ట్ సింగిల్ 'చిట్టి చిట్టి చీమ' పాటకు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ పాట మ్యూజిక్ లవర్స్‌కు అడిక్షన్‌గా మారుతోంది. నేషనల్ అవార్డు విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. సినిమాకు సంబంధించిన ప్రతి అప్డేట్ తో మూవీపై పాజిటివ్ వైబ్స్, ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ సినిమా నుంచి వచ్చే అప్డేట్స్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు పవన్ సాధినేని క్రియేటివ్ విజన్తో తెరకెక్కుతున్న 'ఆకాశంలో ఒక తార' సినిమాపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. సినిమాటోగ్రాఫర్ సుజిత్ సారంగ్ ఈ సినిమాకు కెమెరామెన్‌గా పనిచేస్తున్నారు. శ్వేతా సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 'ఆకాశంలో ఒక తార' సినిమా తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతోంది. దుల్కర్ సల్మాన్ సరసన సాత్విక వీరవల్లి, శ్రుతిహాసన్ నటిస్తున్నారు.



## గూఢచారికి సీక్వెల్‌గా 'జీ2'

అడవి శేష్ హీరోగా నటించిన బ్లాక్ బస్టర్ స్పై థ్రిల్లర్ గూఢచారికి సిక్వెల్‌గా తెరకెక్కుతున్న మూవీ 'జీ2' రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. 2027 ఫిబ్రవరి 5న వరల్ వైడ్ థియేటర్లలో రిలీజ్ కానుంది. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రం, ఫస్ట్ పార్ట్ గూఢచారి సక్సెస్‌ను బేస్‌గా తీసుకుని అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్నారు ఇండియన్ సినిమాలో స్పై థ్రిల్లర్ జానర్‌ని రీడిఫైన్ చేయనుంది.ఈసారి ఏజెంట్ 116గా వామికా గబ్బి ఎంట్రీ ఇస్తోంది. యాక్షన్‌తో పాటు ఎమోషన్ వున్న క్యారెక్టర్ ఇది. ఈ మూవీలో ఇమ్రాన్ హష్మీ పవర్ ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. మురళీ శర్మ, సుప్రియా యార్లగడ్డ, మధు శాలిని కీలక పాత్రల్లో నటిస్తున్నారు.పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై టి.జి. విశ్వ ప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ సినిమాని భారీగా నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియాగా రిలీజ్ కానుంది.

## రీల్

# 'భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి 'షురూ



అమృత గాత్రంతో ప్రపంచవ్యాప్తంగా శ్రోతలను దశాబ్దాల పాటు ఉర్రూతలూగించిన సంగీత సామ్రాజ్ఞి, గాయని భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవిత చరిత్రను సినిమాగా రూపొందించే భారీ ప్రయత్నం చేయబోతున్నారు. ప్రొడ్యూసర్స్ అల్లు అరవింద్, రాక్ లైన్ వెంకటేష్, బన్నీ వాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి గా రశ్మిక మందన్న నటిస్తున్నారు. టాలెంటెడ్ డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి 110వ జయంతి సందర్భంగా లెజెండరీ యాక్టర్ కమల్ హాసన్ చేతుల మీదుగా లాంఛ్ చేశారు. రశ్మిక మందన్నపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి కమల్ హాసన్ క్లాప్ ఇచ్చారు. చెన్నైలోని మ్యూజిక్ అకాడెమీ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభించారు. అనంతరం నిర్మాతల్లో ఒకరైన అల్లు అరవింద్ మాట్లాడుతూ ఎంఎస్ అమ్మ గొప్ప సంగీతకారిణిగా మనందరికీ తెలుసు. కానీ ఆమె తన జీవితంలో ఎదుర్కొన్న ఘటనల గురించి తెలిశాక ఈ బయోపిక్ తీయాలని మరింతగా ఇన్స్ పైర్ అయ్యాం. ఆమె పాటించిన నిబంధనలు, చూపించిన ధైర్యం, క్రమశిక్షణ చాలా గొప్పవి. ఆమె పదేళ్ల ప్రాయం నుంచే సంగీతం పట్ల తన ఇష్టాన్ని చూపిస్తూ గొప్ప లక్ష్యం వైపు చెదరని ఏకాగ్రతతో పయణించారు. ఎంఎస్ అమ్మ ఎంత ఇబ్బందికరమైన జీవితాన్ని గడిపారో చాలామందికి తెలియదు. నాలుగు దక్షిణ భారత భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం అన్నారు.హీరోయిన్ రశ్మిక మందన్న మాట్లాడుతూ నటిగా నాకు ఈ గొప్ప అవకాశం దక్కినందుకు కృతజ్ఞతతో మనసు నిండిపోతోంది. ఎంఎస్ అమ్మ 110వ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ఈ వేదిక మీద నిల్చున్నందుకు దేవుడి సమక్షంలో ఉన్న భావన కలుగుతోంది. అమ్మ జీవిత ప్రయాణంలో చిన్న భాగంగా మారుతున్నందుకు ఎంతో గర్వంగా, గౌరవంగా భావిస్తున్నా. ఎంఎస్ అమ్మ పాత్రను మీ అందరికీ నచ్చేలా పోషించేందుకు సంపూర్ణ ప్రయత్నం చేస్తాను. అన్నారు.లెజెండరీ యాక్టర్ కమల్ హాసన్ మాట్లాడుతూ తన సంగీతంతో భారతదేశాన్ని, ముఖ్యంగా దక్షిణ భారత దేశాన్ని ఏకం చేసిన సంగీత సామ్రాజ్ఞి ఎంఎస్ సుబ్బులక్ష్మి అమ్మ. ఆమె సంస్కృతం, హిందీ సహా అనేక భాషల్లో పాటలు పాడారు. తెలుగు, తమిళం, కన్నడ ఇలా ఏ భాషలో ఆమె పాట పాడినా భాషకే అందం తెచ్చేలా ఆ పాట ఉండేది. ఆమె సంగీతమే మనకు అందించిన సందేశం. ఎంఎస్ సుబ్బులక్ష్మి అమ్మ నాలో ఎంతో స్ఫూర్తి నింపారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి అమ్మ. ఈ టీమ్ అందరికీ నా బెస్ట్ విసెస్ తెలియజేస్తున్నా. అన్నారు.ఈ కార్యక్రమంలో హీరోయిన్ సుహాసినీ, నటుడు శివకుమార్, దర్శకుడు మహేంద్రన్, నటుడు, దర్శకుడు సముద్రఖని, ప్రొడ్యూసర్స్ కలైపులి థాను, రాజేంద్రన్, కాట్రగడ్డ ప్రసాద్, ఎంఎస్ సుబ్బులక్ష్మి మనవడు చంద్రశేఖర్, ఆయన సతీమణి మాల, దర్శకుడు డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి,ప్రొడ్యూసర్ రాక్ లైన్ వెంకటేష్ , ప్రొడ్యూసర్ బన్నీవాస్ తదితరులు పాల్గొన్నారు.



## 'మాయలేడి' టీజర్ రిలీజ్

హీరో రాకేష్ వర్రే చేస్తున్న కొత్త సినిమా 'మాయలేడి'. ఈ సినిమా క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. రాకేష్ వర్రే గతంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎవరికీ చెప్పొద్దు, పేకమేడలు వంటి కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్ నిర్మించి అందరి ప్రశంసలు పొందారు. ఇప్పుడు 'మాయలేడి'తో మరో ఇంట్రెస్టింగ్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాను దర్శకుడు ప్రశంకర్ రూపొందిస్తున్నారు. మధుమిత సర్కార్ హీరోయిన్ గా నటిస్తోంది. అక్టోబర్ లో 'మాయలేడి' సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. 'మాయలేడి' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఇటీవల రిలీజ్ చేసిన 'మాయలేడి' సినిమా గ్లింప్స్, టైటిల్ సాంగ్, 'సరిగమలే గుండె అంచుల్లో..' పాటలకు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ బ్యాక్ డ్రాప్ తో సాగే లవ్ స్టోరీని థియేటర్స్ లో చూడబోతున్న ఫీల్‌ను ప్రేక్షకుల్లో తాజాగా రిలీజ్ చేసిన టీజర్ క్రియేట్ చేస్తోంది. రాకేష్ వర్రే, మధుమిత సర్కార్, ఇంద్రజ, సురేష్, సత్య, నటిస్తున్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
శుక్రవారం
18-09-2026
www.prajapaksham.in
LOCAL NEWS స్థానికం LOCAL NEWS

## మైనర్ బాలికపై అత్యాచారం.. నిందితుడికి యావజ్జీవ శిక్ష

గతంలో ఇదే బాలికపై అత్యాచారం కేసులో 51 ఏళ్ల జైలు శిక్ష

బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ బాలికను అపహరించి అత్యాచారం : జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ :** మైనర్ బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు 23 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఫాస్ట్ ట్రాక్ కోర్టు తీర్పు వెలువరించిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.తిప్పర్తి మండలానికి చెందిన షేక్ అలియాస్ మహమ్మద్ ఖయ్యూంకు పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి గురువారం ఈ తీర్పు ఇచ్చారని ఎస్‌పి తెలిపారు.కేసు వివరాల ప్రకారం నిందితుడు గతంలో అదే బాలికపై అత్యాచారానికి పాల్పడగా తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో 2021లో,2022గా కేసు నమోదైంది.ఈ కేసులో కోర్టు 51 ఏళ్ల శిక్ష విధించింది.బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత కూడా అదే బాలికను అపహరించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడడంతో నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మళ్లీ 2023లో మరో కేసు నమోదైంది.ఈ కేసులో విచారణ జరిపిన కోర్టు పోక్సో యాక్ట్ సెక్షన్ 5/6 కింద యావజ్జీవ కారాగార శిక్షతో పాటు 23 ఏళ్ల జైలు శిక్ష విధించింది.కేసు దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన అప్పటి టూ టౌన్ ఎస్ఐ ఎస్.సంపత్,ఎస్‌డిపీఓ వి.నర్సింహారెడ్డి,ప్రస్తుత డిఎస్‌పి శివరాంరెడ్డి, సీఐ ఆదిరెడ్డి, హెచ్‌ఎస్‌వో డి.సైదాబాబు,డీసీఆర్‌బి సీఐ శ్రీను నాయక్,కోర్టు డ్యూటీ ఆఫీసర్ సుమన్, లైజన్ అధికారులు నరేందర్,మల్లికార్జున్,స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ లను ఎస్‌పి అభినందించారు.

## పోక్సో కేసు -నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన పోక్సో కేసులో నిందితుడికి భువనగిరి ప్రత్యేక ఫాస్ట్రాక్ పోక్సో కోర్టు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు, రూ.10 వేలు జరిమానా విధించింది. తుర్కపల్లి ఎస్సై తెలి పిన వివరాల ప్రకారం, తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ ఐఆర్ నెం.138/2021 ప్రకారం, 2021 నవంబర్ 1న బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యా దు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దర్యాప్తు పూర్తి చేసి సంబంధిత ఆధారాలు సేకరించిన అనంతరం తుర్కపల్లి మండ లంలో ఓ గిరిజన తండా నిందితుడిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును ఎస్సీ నం.138/2022గా ప్రత్యేక ఫాస్ట్రాక్ పోక్సో కోర్టు విచారిం చింది. కేసులోని సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడు ధీరావత్ నవీన్ ను దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిందని ఎస్ఐ శివకృష్ణ తెలిపారు.

## ఎంజియు పిజి పరీక్ష ఫలితాలు విడుదల



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్,1,2,3 బ్యాక్ లాగ్ పరీక్ష ఫలితాలను గురువారం రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి విడుదల చేశారు.పీజీ నాలుగో సెమిస్టర్ లో మొత్తం 1265 మంది విద్యార్థులకు గాను 967 మంది 76.44 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు సీఓఈ డాక్టర్ జి.ఉపేందర్ రెడ్డి తెలిపారు. బ్యాక్ లాగ్ ఫలితాల్లో మొదటి సెమిస్టర్ లో 427 మందికి గాను 158 మంది 37 శాతం , రెండో సెమిస్టర్ లో 382 మందికి 65 మంది 17.02 శాతం, మూడో సెమిస్టర్‌లో 344 మందికి గాను 168 మంది 48.84శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పూర్తి వివరాలను ఎంజీయూ వెబ్ సైట్ లో పొందుపరిచినట్లు చెప్పారు.కార్యక్రమంలో పరీక్షల విభాగం అధికారులు డాక్టర్ డి. సంధ్యారాణి, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ ప్రవళిక పాల్గొన్నారు.

## గుప్తనిధుల కలకలం



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండల పరిధిలో గుప్తనిధుల తొవ్వకాల వ్యవహారం కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అనాజీపురం రెవెన్యూ గ్రామం రాజ్‌పేట శివారులో ఉన్న నిజాం కాలం నాటి పురాతన మసీదు పరిసర ప్రాంతంలో రహస్యంగా తొవ్వకాలు జరుపుతున్నారనే అనుమానాలపై సుమారు 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. బుధవారం అర్ధరాత్రి సమయంలో పురాతన కట్టడం పరిసర ప్రాంతంలో కొంతమంది వ్యక్తుల కదలికలు అనుమానాస్పదంగా కనిపించాయి. దీనిని గమనించిన స్థానిక రైతులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తొవ్వకాలకు ప్రయత్నిస్తున్నట్లు అనుమానిస్తున్న సుమారు 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఇదే మండలానికి చెందిన దోసపహాడ్, అనాజీపురం గ్రామాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. ఈ వ్యవహారానికి అంతర్రాష్ట్ర లింకులు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అనుమానితులను పోలీసులు ముమ్మరంగా విచారిస్తున్నారు. పూర్తి వివరాలను ఇంకా పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

## తెలంగాణ సాయుధ పోరాటంలో అణువంత పాత్రలేని బిజెపి

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం చింతలపాలెం మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ గన్నా చంద్రశేఖర్ హాజరై అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన పతాకాన్ని ఎగురవేసి అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మల్లారెడ్డిగూడెం చరిత్ర మరువలేనిదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో అణువంత పాత్రలేని బిజెపి నేడు సాయుధ పోరాటంపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉస్తెల సృజన, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లావుల రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉస్తెల నారాయణ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు, మల్లీశ్వరి, మండల కార్యదర్శి చింతిరాల రవి, గ్రామ శాఖ కార్యదర్శి గంధం మంగయ్య, నాయకులు చిత్తలూరు వీరబాబు, ఉపతల కోటమ్మ, పాపిరెడ్డి, వీరంరెడ్డి వీరారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గోనె అంకయ్య పాల్గొన్నారు.



## రాచరిక వ్యవస్థ నుండి ప్రజాపాలన వ్యవస్థ ఆవిర్భావానికి నాంది

ప్రజా పాలన దినోత్సవ వేడుకలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ ప్రజా పాలన రాష్ట్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మహనీయుల చిత్రపటాలకు, తెలంగాణ తల్లి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళాలు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ శుభసందర్భంగా, రాచరిక వ్యవస్థ నుండి ప్రజా పాలన వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికిన అమరులైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు, స్వాతంత్ర్య సమరయోధులందరికీ నా జోహార్లు అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఒక కీలకమైన రోజు అని, హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమై 78 సంవత్సరాలు పూర్తిచేసుకుని 79వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ ప్రజాపాలన దినోత్సవాన్ని జరుపుకుంటున్నాని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు, పాత్రికేయులు, ఉద్యమకారులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థినీ విద్యార్థులు, మేధావులు మరియు యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. జిల్లా వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన 8 మందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఇంచార్జీ కలెక్టర్ భాస్కర్ రావు, ఎస్పీ అక్షాంష్ యాదవ్,అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి,మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి,గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, అడిషనల్ ఎస్పీ లక్ష్మీ నారాయణ, డి.ఆర్.ఓ జయమ్మ,జెడ్పీ సీఈఓ శోభారాణి, ఆర్డీఓ కృష్ణా రెడ్డి, జె. ఏ.సి చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే లక్ష్యం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

గుండ్రాంపల్లి త్యాగాల గడ్డకు ప్రత్యేక స్థానం

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/నల్లగొండ:** నిజాం నిరంకుశ పాలనకు,రజాకార్ల అరాచకాలకు,భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజా సంక్షేమం,అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం కృషి చేస్తున్నామని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 అత్యంత కీలకమైన రోజని మంత్రి పేర్కొన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో నల్లగొండ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందని,ఈ ప్రాంతంలోని అనేక గ్రామాలు నిజాం పాలన,రజాకార్ల దౌర్జన్యాలు,భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.ముఖ్యంగా గుండ్రాంపల్లి త్యాగాల గడ్డగా చరిత్రలో నిలిచిందని,అక్కడి అమరవీరుల స్మారక స్తూపం, నెత్తుటి బావి ప్రజల పోరాట స్ఫూర్తికి,త్యాగాలకు నిలువెత్తు సాక్ష్యాలని అన్నారు. గుండ్రాంపల్లిలో 26 మంది పోరాటవీరులు దారుణంగా హతమార్చబడి బావిలో పాతిపెట్టబడిన విషాద సంఘటన చరిత్రలో చెరగని ముద్ర వేసిందని తెలిపారు. అదే విధంగా జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ కోసం 2,062 ఎకరాల భూమిని సేకరించి రూ.442 కోట్లు చెల్లించామని మంత్రి తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ లైనింగ్ పనులకు రూ.54 కోట్లు, ఏఎంఆర్‌పీ, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టుల హై లెవల్ కెనాల్ లైనింగ్ పనులకు రూ.442 కోట్లు, లో లెవల్ కెనాల్ లైనింగ్ పనులకు రూ.44.22 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించామని అన్నారు.బ్రాహ్మణవెల్లెంల లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ పనులు 90 శాతం పూర్తయ్యాయని,హెచ్‌ఎల్‌సీ, ఎల్‌ఎల్‌సీ ద్వారా యాసంగి పంటకు 2.61 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని తెలిపారు. డిండి హెడ్‌రిచ్‌లో రూ.1,800 కోట్లు మంజూరై పనులు పురోగతిలో ఉన్నాయని, జిల్లాలోని తొమ్మిది లిఫ్ట్ ఇరిగేషన్ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్,నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు హాఫీజ్ ఖాన్,జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్,జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవర్, అదనపు కలెక్టర్లు జే.శ్రీనివాస్, ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి,అడిషనల్ ఎస్‌పి రమేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగాల ఫలితమే స్వరాష్ట్ర ఆకాంక్ష

మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** అమరుల త్యాగాల ఫలితమే స్వరాష్ట్ర ఆకాంక్ష నెరవేరిందని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలలో మంత్రి జాతీయ పతాకావిష్కరణ గావించి, పోలీసులచే గౌరవ వందనం స్వీకరించి జాతీయ గీతాలాపన, రాష్ట్రీయ గీతాలాపన చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ తెలంగాణ ప్రాంతం భారత్ యూనియన్‌లో విలీనమై నేటికి 78 సంవత్సరాలు పూర్తి చేసుకొని 79వ సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభసందర్భంగా హాజరైన ప్రజాప్రతినిధులు, జిల్లా న్యాయమూర్తులు, అధికారులు, అనధికారులు, పాత్రికేయులు, ఉద్యమకారులకు, కళాకారులకు, కార్మిక, కర్షక, విద్యార్థిని, విద్యార్థులకు, జిల్లా ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా 4లక్షల 5వేల మంది వినియోగదారులకు 6లక్షల 43వేల సిలిండర్లపై రూ. 19కోట్ల సబ్సిడి అందించినట్లు వివరించారు. పేద కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం కింద జిల్లాలోని 1,91,803 లబ్ధిదారులకు రూ.164కోట్ల 77లక్షల విద్యుత్ రాయితిని కల్పించినట్లు తెలిపారు. వానాకాలం 2026 సీజన్‌కు సంబంధించి ఎకరానికి రూ.6వేల చొప్పున జిల్లాలోని 2లక్షల 90వేల మంది రైతుల ఖాతాల్లో రూ.364కోట్ల 8లక్షలు జమ చేసినట్లు చెప్పారు. రైతుభీమా, సన్న వరిపై బోనస్, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, మహిళా సాధికారత కింద వడ్డీలేని రుణాలు అందించామన్నారు. విద్యా, వైద్య, సామాజిక సంక్షేమ రంగాలకు పెద్దపీట వేసిసినట్లు చెప్పారు. సామాజిక సంక్షేమం, వసతి గృహాల అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఈ ఒక్క సంవత్సరంలోనే 23,310 మందికి రూ.69.40 కోట్ల ఉచిత చికిత్సలు అందించామన్నారు. జిల్లాలో బాలికలకు హెచ్‌పివి వ్యాక్సినేషన్‌లో 76శాతం సాధించి రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచామన్నారు. సాగునీటి రంగం, పరిశ్రమలకు ప్రణాళికబద్ధంగా నిధులు కేటాయించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె. నరసింహ, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్‌రాజ్, ఆర్‌డిఓ వేణుమాధవ్, మార్కెట్ కమిటి చైర్మన్ వేణారెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుల పోరాటాలతోనే తెలంగాణకు స్వాతంత్ర్యం

తెలంగాణ విలీనమే విమోచనం కాదు...పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/దేవరకొండ:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట 78వ వారోత్సవాల సందర్భంగా దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో జాతీయ జెండాను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ పల్లా దేవేందర్‌రెడ్డి ఆవిష్కరించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని మరియు అమరలు జీవిత చరిత్రలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాలలో చేర్చాలని, హైదరాబాద్‌లో స్మృతి వనం ఏర్పాటు చేయడంతో పాటు పోరాట యోధుల విగ్రహాలు ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించాలని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి మతోన్మాద శక్తులను తిప్పికొడదాం, ప్రభుత్వం కపట నాటకం ఆడుతున్నదని విమర్శించారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శ దేప సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, వెంకట్రాములు, యాదయ్య, వెంకటయ్య, మైనోద్దీన్, మండల కౌన్సిల్ సభ్యులు, పట్టణ శాఖ కార్యదర్శులు జ్యోతిబస్, వెంకటయ్య, గోవర్ధన్, మల్లయ్య, శ్రీను, ఆనంద్‌చారి, యాదయ్య, రాజమల్లయ్య, బక్కయ్య, వెంకటయ్య, రమేష్, శ్రీను, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.





## వేగవంతంగా డబ్లింగ్ పనులు

సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అమృత్ భారత్ నిధులతో చేపట్టిన మిర్యాలగూడ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ, రైల్వే డబ్లింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్ ఆదేశించారు. గురువారం మిర్యాలగూడ రైల్వే స్టేషన్, గూడ్స్ యార్డు రీ మోడలింగ్ పనులను ఆయన సుమారు 4 గంటల పాటు ఆకస్మికంగా పరిశీలించారు.నిర్మాణంలో ఉన్న పలు పనుల పురోగతిని పరిశీలించిన డీఆర్ఎం గోపాలకృష్ణన్, పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై సిగ్నల్స్ ఫోట్లు పనిచేయకపోవడాన్ని గుర్తించి వాటిని తక్షణమే మరమ్మతు చేయించాలని ఆదేశించారు. ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.గూడ్స్ షెడ్‌లో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని, అవసరాన్ని బట్టి అదనపు నిర్మాణాలు చేపట్టే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. సరుకు రవాణాకు సంబంధించిన మౌలిక వసతులు మెరుగుపడేలా పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.నడికుడిబీబీనగర్ రెండు లైన్ల నిర్మాణ పనులను కూడా సకాలంలో పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ పరిశీలనలో రైల్వే వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థినిపై దాడి చేసిన టీచర్‌ను సస్పెండ్ చేయాలి

గురుకుల పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా




**ప్రజాపక్షం/మునుగోడు:** మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థినిపై ఉపాధ్యాయురాలు దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది.రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనలో విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్,డీవైఎఫ్ఐ,విద్యార్థి సంఘాల నాయకులు గురువారం పాఠశాల ఎదుట ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి గోపగోని ఉదయ్ మాట్లాడుతూ దాడికి పాల్పడిన ఉపాధ్యాయురాలిని,నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థులపై విచక్షణారహితంగా దాడి చేయడం దారుణమని మండిపడ్డారు. విద్యార్థుల రక్షణ విషయంలో ప్రభుత్వం,అధికారులు నిర్లక్ష్యం వహిస్తే విద్యార్థి,యువజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బాధిత విద్యార్థినికి న్యాయం చేయాలని, గురుకులాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కట్ట దశరథ, ఏఐఎస్ఎఫ్ నాయకులు శివార్ల నాగరాజు, పగిళ్ల యాదయ్య,డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి,వరికుప్పల ముత్యాలు,బోయపల్లి సాయి,కట్ట ఆంజనేయులు,కుక్కల మహేష్,గాదెపాక రాకేష్,పగిళ్ల సాయితేజ పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యతోపాటు మౌలిక వసతులు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/చివ్వెంల :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు మౌలిక వసతులు పక్కాగా అందాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదుల్లోకి ఆయన నేరుగా వెళ్లి విద్యార్థులతో సంభాషించారు. పాఠ్యాంశాలపై వారిని పలు ప్రశ్నలు అడిగి వారి సందేహాలను నివృత్తి చేశారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలో ఏమైనా మౌలిక సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై. రమేష్, విద్యాశ్రీ పాల్గొన్నారు.

## 19న కోదాడలో 'మెగా జాబ్ మేళా'

జిల్లాలోని నిరుద్యోగ యువతకు చక్కటి అవకాశం

300 కంపెనీల ద్వారా 3500 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ఈనెల 19న కోదాడలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి, గ్రంధాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, జిల్లాలోని పరిశ్రమల శాఖ అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, కళాశాల కరస్పాండెంట్స్, జిల్లా విద్యా శాఖ అధికారులతో కలిసి మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య సమాజాన్ని ఎక్కువగా పీడించే సమస్యగా ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అందరి సహకారంతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీతోపాటు వివిధ వృత్తి విద్యాకోర్సులు ఉద్యోగ ఖాళీల వివరాలు తెలుసుకోవడం, పేరొందిన సంస్థలను సంప్రదించడం, పదేపదే హైదరాబాద్కు ప్రయాణించడం, ఇంటర్వ్యూలకు హాజరుకావడం గ్రామీణ యువతకు ఆర్థికంగా, సామాజికంగా పెద్ద సవాల్‌గా మారుతోందన్నారు. జాబ్మేళాకు సుమారు 300 కంపెనీలను ఆహ్వానించినట్లు మంత్రి వెల్లడించారు. జాబ్మేళా ద్వారా 3,500 మందికి పైగా యువతకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని మంత్రి చెప్పారు. అభ్యర్థులు క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిదులు, అధికారులు తమ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతను గుర్తించి జాబ్మేళా సమాచారం అందించాలని మంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య మాట్లడుతూ జాబ్ మేళా కు మా జిల్లా నుండి కూడా నిరుద్యోగ యువతి, యువకులను పంపడం జరుగుతుందని అన్నారు. భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లడుతూ జాబ్ మేళా ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు మాట్లడుతూ మా జిల్లా నుండి అందరి సహకారంతో జాబ్ మేళాకు యువతను పంపడం జరుగుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతంలోని నిరుద్యోగులను గుర్తించి అందరి సహాయంతో జాబ్ మేళాకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని కోరుతూ భూపాలపల్లి పట్టణంలోని స్థానిక రావి నారాయణరెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ నాయకులు గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ మాట్లాడుతూ, ఈ నెల 28, 29, 30 తేదీల్లో హనుమకొండ నగరంలో ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని, భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, తెలంగాణ ఉద్యమంలోనూ ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. 90 సంవత్సరాలుగా విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో చైతన్యాన్ని నింపుతున్న సంఘంగా ఏఐఎస్ఎఫ్ కొనసాగుతోందని అన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు, ఈ వేడుకల స్ఫూర్తితో భవిష్యత్తులో విద్యారంగ సమస్యలపై మరింత రెట్టింపు ఉత్సాహంతో పోరాటాలు నిర్వహిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉల్లరావు బన్నీ, సాయి, గట్ల మానస, చందు, పోతుల పవన్,దొడ్డె చరణ్, రాజుల శివ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/వరంగల్ :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని వరంగల్ జిల్లాలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఖిలా వరంగల్‌లోని అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు ముఖ్య అతిథి నివాళులర్పించారు. అనంతరం ఐడిఓసి గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి హాజరుకాగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డిసిపి అంకిత్ కుమార్ లు పూల బొకే అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విశ్వ కర్మ జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూల మాల సమర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ముందుగా వందేమాతరంజాతీయ గేయం ఆలాపన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతం, రాష్ట్ర గీతం ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి పోలీసు గౌరవ వందన స్వీకరించారు. ఈసందర్భంగా విజయలక్ష్మి ప్రసంగించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట శాసన సభ్యులు కేఆర్ నాగరాజు, మేర కార్పొరేషన్ చైర్మన్ వెంకట్రాజం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, డిసిపి అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ లు గణేష్, కిషోర్ కుమార్, డిఆర్వో విజయ లక్ష్మి, ఆర్డీవో సుమ, సంబంధిత మండల తహసీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు

## పేదల వైద్య చికిత్సకు అండగా ప్రభుత్వం



**ప్రజాపక్షం/హసన్ పర్తి:** వైద్య ఖర్చులు భరించలేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.వర్ధన్నపేట నియోజకవర్గంలోని 2వ డివిజన్ గుండ్లసింగారం గ్రామానికి చెందిన చల్లూరి రాజేందర్ కి వైద్య చికిత్స నిమిత్తం రూ.5 లక్షల విలువైన ఎల్ఓసీ చెక్కును ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సుబేదారిలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అవసరమైన సహాయాన్ని అందిస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం అందక ఎవరూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో అర్హులైన వారికి ఎల్ఓసీల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. చల్లూరి రాజేందర్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక 2వ డివిజన్ అధ్యక్షులు పుట్ట తిరుపతి,వర్ధన్నపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ గడిపి జీవన్,వంగపహడ్ మాజీ పాక్స్ చైర్మన్ అనిల్ రెడ్డి,సీనియర్ నాయకులు దోమ కోర్నేల్,రుద్రారపు శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయాలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూమి కోసం,భుక్తి కోసం, తెలంగాణ విమోచనం కోసం చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య వంటి మహనీయులతో పాటు ఎందరో అమరవీరులు, ఉద్యమకారులు చేసిన త్యాగాలు, పోరాటాలు తెలంగాణ సమాజానికి స్ఫూర్తిదాయకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గండ్ర సత్యనారాయణ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ, భూమి కోసం,భుక్తి కోసం, తెలంగాణ విమోచనం కోసం చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య వంటి మహనీయులతో పాటు ఎందరో అమరవీరులు, ఉద్యమకారులు చేసిన త్యాగాలు, పోరాటాలు తెలంగాణ సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. వారి ఆశయాలు, త్యాగాలను స్మరించుకుంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సంక్షేమం వంటి అన్ని రంగాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కర్ణాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాట్ల శ్రీనివాస్, స్థానిక ప్రజాప్ర తినిధులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధి

ప్రజాపాలన దినోత్సవంలో
మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/హనుమకొండ :** హైదరాబాద్‌సికింద్రాబాద్ జంట నగరాల తరహాలో హనుమకొండవరంగల్ ను సమగ్రంగా అభివృద్ధి చేసి, హైదరాబాద్ కు దీటైన మరో ప్రధాన నగరంగా వరంగల్ ను తీర్చిదిద్దాలన్నది ప్రజా ప్రభుత్వ సంకల్పం అని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ విలీనం సందర్భంగా గురువారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రగతి పాలన దినోత్సవంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే హనుమకొండ, వరంగల్ ప్రాంతాలను హైదరాబాద్ సమంగా అభివృద్ధి చేయాలని దిశగా బహుతరమైన ప్రణాళికలను అమలు చేస్తున్నామన్నారు.మాస్టర్ ప్లాన్ తో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నగర అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందిస్తున్నామని, రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి మౌలిక వసతులను ఇప్పటి అవసరాలకే కాకుండా భవిష్యత్ జనాభా పెరుగుదలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నామన్నారు.అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎస్టీపీలు, తాగునీటి పైపైన్లు, మెరుగైన రోడ్ల వ్యవస్థ వంటి ఆధునిక మౌలిక వసతులతో వరంగల్ను ఆధునిక నగరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా జాతీయ రహదారులను అనుసంధానం చేసి, నగర ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు టెక్స్టైల్ పార్క్ వంటి పారిశ్రామిక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించనున్నామన్నారు.వరంగల్ కేవలం ఆధునిక నగరం మాత్రమే కాదు.. కాకతీయుల ఘన చరిత్రకు, తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని, అందుకే వరంగల్ ను ఆధునిక సౌకర్యాలతో పాటు హెరిటేజ్ సిటీగా అభివృద్ధి చేస్తూ చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజా పాలన దినోత్సవం వేడుకలకు హాజరైన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి పోలీసులు తొలుత గౌరవ వందనం సమర్పించారు.అనంతరం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం, రాష్ట్ర, జిల్లా ప్రగతి సంబంధిత వివరాలను తెలియజేస్తూ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సందేశమిచ్చారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్. నాగరాజు, కుడా ఛైర్ పర్సన్ గుండు సుధా రాణి, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ రవి, కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, డీఆర్వో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర కమ్యూనిస్టులదే

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు స్టాలిన్, సదానందం



**ప్రజాపక్షం/హనుమకొండ:** నిజాంకు వణుకు పుట్టించిన చరిత్ర తెలంగాణ కమ్యూనిస్టు ప్రజలదని, నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర ముమ్మాటికి కమ్యూనిస్టులదేనని, తెలంగాణ సాయుధ పోరాటాన్ని, అమరుల జీవిత చరిత్రలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాలుగా చేర్చడంతో పాటు తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ ఎ స్టాలిన్, బత్తిని సదానందం డిమాండ్ చేశారు. గురువారం బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ విలీన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్ఎ స్టాలిన్, సిపిఐ జెండాను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తిని సదానందం ఎగురవేశారు. అనంతరం సాయుధ పోరాట అమరులకు నివాళులు అర్పించారు. 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించినా కూడా తెలంగాణ ప్రాంతం నైజాం రాజు ఆధీనంలో ఉండి నియంత, నిరంకుశ పాలన వల్ల భూస్వాములు, పటేల్, పట్వారిలు గ్రామాలలో తమ ఆగడాలు పెట్రేగి పోతున్న సందర్భంగా సిపిఐ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, వెట్టి చాకిరి, బానిసత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మక్దూం మొయినుద్దీన్ పిలుపునిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, కండె నర్సయ్య, అమృతయ్య, బాబు,దామోదర్, మమత, మధు, కృష్ణ, సరిత, కవిత, పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**ప్రజాపక్షం/జనగామ:** ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని కార్యాలయ ఆవరణలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణిలతో కలిసి ముఖ్య అతిథిగా బీర్ల ఐలయ్య హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, ప్రజాస్వామ్య ఆకాంక్షలకు ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గోపిరాం, వివిధ శాఖల అధికారులు, పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## పోరాటమే స్ఫూర్తి.. ప్రజాపాలనే లక్ష్యం

ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధే
ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సీతక్క






**ప్రజాపక్షం/ములుగు:**తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు విశిష్ట స్థానం ఉందని, నాటి పోరాట స్ఫూర్తి ప్రజాపాలనకు మార్గదర్శకమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కాలేదని మంత్రి తెలిపారు. నిరంకుశ పాలన, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా రైతులు, కూలీలు, మహిళలు, విద్యార్థులు, యువత సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఎన్నో త్యాగాల ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని పేర్కొన్నారు. నాటి పోరాట యోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే నిజమైన నివాళి అని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో జవాబుదారితనంతో కూడిన పాలన అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సీతక్క పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సీతక్క పేర్కొన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, రూ. 500కే వంటగ్యాస్, సన్నబియ్యం పంపిణీ తదితర పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు, ఎస్‌పి సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్‌పి, ఆర్‌డిఓ, డిఆర్‌ఓ, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రవిచందర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## మట్టిమనుషులను పోరాట యోధులుగా మార్చింది ఎర్రజెండానే

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి
తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/కాజీపేట:**సాయుధ పోరాటంలో పాల్గొని త్యాగాలు చేసిన సమర యోధులకు పెన్షన్లు నిరాకరించిన బిజెపి ప్రభుత్వం, చరిత్రను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందుదామనుకుంటుందని, సాయుధ పోరాటంలో ఇసుక రేణువంత పాత్ర కూడా బిజెపికి లేదని, మట్టి మనుషులను పోరాట యోధులుగా మార్చింది ఎర్రజెండానేనని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు అన్నారు. గురువారం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో జరుగుతున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఐ హనుమకొండ జిల్లా శ్రేణులు తరలి వెళుతూ కాజీపేట ఫాతిమా జంక్షన్ లోని తెలంగాణ వీరనారి చిట్యాల(చాకలి) ఐలమ్మ విగ్రహంకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సిపిఐ నాయకత్వం వహించిన తెలంగాణ సాయుధ పోరాటం గురించి మాట్లాడే నైతిక హక్కు బిజెపికి లేదని, సాయుధ పోరాటంలో ఇసుక రేణువంత పాత్ర కూడా బిజెపికి లేదని మండిపడ్డారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, భూస్వాముల అరాచకాలు ఆగడాలు సహించలేని సాధారణ ప్రజల సైతం బందూకులు చేతబట్టి సాయుధ పోరాటం చేసి భూస్వామ్య వ్యవస్థ మెడలు వంచారని గుర్తు చేశారు. ఆ మహత్తరమైన సాయుధ రైతాంగ పోరాటంలో తెలంగాణలో పది లక్షల ఎకరాల భూమి పంచబడిందని, మూడు వేల గ్రామాలను విముక్తి చేయడం జరిగిందని చెప్పారు. నాటి పోరాటంలో నాలుగున్నర వేల మంది వీరులు అమరులయ్యారని, తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని ప్ర భుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్రె బిక్షపతి, కరుణాకర్, అదరి శ్రీనివాస్, బిక్షపతి, ఎల్లేష్, రాములు, లక్ష్మణ్, ఎన్.అశోక్ స్టాలిన్, శ్రీనివాస్, బిక్షపతి, రాజు గౌడ్, శంకర్ నాయక్, శ్యామ్ సుందర్ రెడ్డి, యాకయ్య పాల్గొన్నారు.

## సాయుధ పోరాట దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సెప్టెంబర్ 17 దినోత్సవం సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ పార్కు నుండి స్ఫూర్తి ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ అమరులను స్మరిస్తూ అమర వీరుల స్తూపం ప్రదర్శిస్తూ మూడు కోట్ల సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సెప్టెంబర్ 17 తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి చిహ్నం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. జాతీయ జెండాను, పార్టీ జెండాను సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సాయుధ పోరాటాన్ని అధికారికంగా సెప్టెంబర్ 17 నిర్వహించాలని అన్నారు. భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనం అయిన రోజు సెప్టెంబర్ 17 స్వతంత్ర దినోత్సవంగా భావించాల్సిన అవసరం ఉందని కానీ నాడు బీఆర్ఎస్ నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించడం లేదని, వేరే పేర్లతో నిర్వహిస్తున్నారని అధికారికంగా సాయుధ పోరాటాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాటం లో ఎప్పుడు పాల్గొని బిజెపి సాయిధ పోరాటాన్ని హిందూ ముస్లిం పోరాటంగా ప్రజలను నమ్మించే విధంగా చరిత్రను వక్రీకరిస్తుందని బిజెపికి సాయుధ పోరాటానికి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ సాయుధ పోరాట దినోత్సవం లో మున్సిపాలిటీ నిర్మించిన స్ఫూర్తి చిహ్నం వద్ద ప్రతి ఏటా ఘనంగా నిర్వహించాలని విజయసారథి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపాలు మాసబత్తిని వెంకట మల్లు, సింగు నరసయ్య, ధర్మారపు లాలయ్య స్థూపాల వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఈ అజయ్ సారధి రెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, పెరుగు కుమార్, వెంకన్న, సాంబలక్ష్మి, పాండురంగా చారి ,వరిపెల్లి వెంకన్న, నెల్లూరి నాగేశ్వరరావు ,తండ సందీప్, బైస స్వామి, బంధు మహేందర్, జంపాల వెంకన్న, నర్రా సంధ్యా శ్రావణ్, వీరవెల్లి రవి, వెలుగు శ్రవణ్, మాలోతు రవీందర్, బానోతు లింగ్య నాయక్, కేచిర్ర వెంకన్న ఇతరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ భూములను రక్షించాలి

వరంగల్ అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం



**ప్రజాపక్షం/వరంగల్:** వక్ఫ్ భూములను రక్షించాలని, సెక్షన్ 22ఏలో తప్పుగా చేర్చిన రైతులు, ప్రైవేట్ భూములను వెంటనే తొలగించాలి తెలంగాణ ముస్లిం వక్ఫ్‌ల్యాండ్ ప్రొటెక్షన్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా అన్నారు. ముస్లిం వక్ఫ్‌ల్యాండ్ ప్రొటెక్షన్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్‌కు వక్ఫ్ భూముల గుర్తింపు, రక్షణ, సెక్షన్ 22ఏలో తప్పుగా చేర్చిన ప్రైవేట్, రైతుల భూములను తొలగించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో అనేక వక్ఫ్ భూములు ధరణి, భూ భారతి, భూ రికార్డుల పోర్టల్‌లో సరిగా నమోదు కాకపోవడం వల్ల వక్ఫ్ ఆస్తుల రక్షణకు తీవ్రమైన సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ ఎంఏ సమద్, ఎండి నయీమ్ ఉద్దీన్, సయ్యద్ అజాజ్ అహ్మద్ నియాజీ, ఎండి మీర్ అజ్మద్ అలీ, ఎండి ఖలీల్, ఎంఏ రషాద్, ఎండి షబాన్, ఎండి ఇక్బాల్, ఎండి షఫీ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ రాష్ట్ర సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను ఛేదించిన పోలీసులు

22 మంది అరెస్ట్, 216 పాస్‌బుక్‌లు,
వాహనాలు, సిమ్ కార్డులు స్వాధీనం
సిపి శ్వేత వెల్లడి




**ప్రజాపక్షం/వరంగల్‌క్రైమ్:** అంతర్రాష్ట్ర సైబర్ మోసాల వ్యవస్థపై వరంగల్ పోలీసులు కీలక విజయాన్ని సాధించారు. దేశవ్యాప్తంగా జరిగే ఆర్థిక సైబర్ మోసాల ద్వారా వచ్చిన నగదును మళ్లించేందుకు మ్యూల్ బ్యాంక్ ఖాతాలు, బ్యాంకింగ్ వివరాలు, సిమ్ కార్డులను సమకూర్చడం, నిర్వహించడం, దుర్వినియోగం చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న విస్తృతమైన నేర నెట్‌వర్క్‌ను వరంగల్ పోలీసులు ఛేదించారు.ఈ దర్యాప్తును వరంగల్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ (క్రైమ్. నెం. 29/2026), ఆజంజాహీ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ (క్రైమ్. నెం. 672/2026) సమన్వయంతో నిర్వహించారు. ఈ కేసుల్లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 316(2), 318(4), 319(2), 338, 336(3), 351(2), 111 rఆర్/డబ్ల్యు 3(5), ఐటీ యాక్ట్, 2000లోని సెక్షన్లు 66 సి, 66డి కింద కేసులు నమోదు చేయబడ్డాయి.ఈ సందర్భంగా పోలీస్ కమిషనరేట్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వరంగల్ సిపి ఎన్.శ్వేత కేసుకు సంబంధించిన విషయాలను వివరించారు.వరంగల్ డీసీసీ బ్యాంక్ నుండి అందిన సమాచారం మేరకు, ఖాతాదారుల ప్రకటిత ఆదాయ వనరులతో పోలిస్తే అసాధారణంగా అధిక మొత్తంలో లావాదేవీలు జరుగుతున్న అనుమానాస్పద బ్యాంకు ఖాతాలపై దర్యాప్తు నిర్వహించగా ఈ నెట్‌వర్క్‌లో స్థానిక ఏజెంట్లు, మ్యూల్ ఖాతాదారులు, ఖాతాలను నిర్వహించే వ్యక్తులు, మధ్యవర్తులు, రవాణాదారులతో కూడిన సంక్లిష్ట వ్యవస్థ ఉన్నట్లు వెల్లడైందన్నారు.స్థానిక ఏజెంట్లు ప్రధాన్ మంత్రి ముద్ర యోజన పథకం ద్వారా రూ. 50,000 రుణం ఇప్పిస్తామని చెప్పి అమాయక ప్రజలను నమ్మించారని,వారి మాటలను నమ్మిన బాధితులు డీసీసీబీ బ్యాంక్, నక్కలగుట్ట బ్రాంచ్ సహా వివిధ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి, తమ బ్యాంక్ పాస్‌బుక్‌లు, ఏటీఎం కార్డులు, పాన్ వివరాలు, అనుసంధానిత సిమ్ కార్డులను ఒక్కో ఖాతాకు రూ. 6,000 నుంచి రూ. 8,000 వరకు స్వల్ప మొత్తానికి కమిషన్‌గా అందజేశారని తెలిపారు.ఈ విధంగా సేకరించిన బ్యాంకింగ్ కిట్లను వడ్డేపల్లి రోడ్, హనుమకొండ ప్రాంతంలోని క్యాంటీన్,బుక్‌స్టాల్ వంటి స్థానిక వాణిజ్య సంస్థల్లో నిల్వ చేసి, అనంతరం ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, ఇతర ప్రాంతాల్లోని అంతర్ రాష్ట్ర హ్యాండ్లర్లకు రవాణా చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు.

**22 మంది అరెస్టు,216 పాసుబుక్‌లు, వాహనాలు స్వాధీనం:** మొత్తం 22 మంది నిందితులను ఈ నెల 8న అరెస్ట్ చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరచగా, వారిని న్యాయ రిమాండ్‌కు పంపించడం జరిగిందని తెలిపారు.వీరి వద్ద నుండి 216 బ్యాంకు పాస్ బుక్ లు, 22 ఏటియం/డెబిట్ కార్డులు,ఎస్బీఐ, ఒడిస్సా గ్రామీణ బ్యాంకు, ఉత్కల్ గ్రామీణ బ్యాంకు, డీసీసీబీ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా తదితర బ్యాంకులకు చెందిన థర్డ్ పార్టీ బ్యాంకింగ్ కిట్లు, 8చెక్ బుక్ లు, 2 కార్లు,ఎక్స్‌టర్నల్, హార్ట్ డిస్క్ లు, స్మార్ట్ ఫోన్ లు, సిమ్ కార్డులు, బ్యాంకు క్యూఆర్ కోడ్ స్కానర్లు, నాలుగు ట్రాన్సాక్షన్ డైరీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

**బ్యాంకింగ్ వివరాలను పంచుకోవద్దు**

డబ్బు లేదా కమిషన్ కోసం ఎవరైనా అడిగినా బ్యాంకు ఖాతా వివరాలు, ఏటియం/డెబిట్ కార్డు, చెక్ బుక్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలు లేదా సిమ్ కార్డు ఇతరులకు ఇవ్వకూడదని సిపి ఎన్. శ్వేత సూచించారు. రుణాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తులు లేదా సంస్థలను నమ్మి, వారి కోసం బ్యాంకు ఖాతాలు తెరవడం లేదా మీ వ్యక్తిగత పత్రాలను మూడో వ్యక్తులకు అప్పగించడం చేయకూడదని, అలా అందించే వ్యక్తులు నేరాలకు ప్రత్యక్షంగా సహకరించినవారిగా పరిగణించబడి, వారిపై క్రిమినల్ దర్యాప్తు, అరెస్ట్, చట్టపరమైన చర్యలు చేపట్టే అవకాశం ఉందన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలపై, సైబర్ మోసాల సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ / హెల్ప్‌లైన్ 1930 ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ దృశ్యాలు












రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో...


## పాలకులకు భయమెందుకు?

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఆ వీరోచిత సాయుధ పోరాట చరిత్రను గుర్తించాల్సిందేనని, విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాల్సిందేనని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సం దర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ మైదానంలో 'పోరాట స్ఫూర్తి సభ' జరిగింగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకట్‌రెడ్డి, కె.రామకృష్ణ, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సిపిఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్ళపల్లి శ్రీనివాస్, ఈ.టి. నరసింహా ప్రసంగించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనర్సింహ, వి.ఎస్. బోస్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, పి.ప్రేమ్ పావని, మౌలానా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల కార్యదర్శులు వేదికపై ఆశీనులయ్యారు.

**బిజెపి సర్టిఫికెట్లు ఇస్తుండడం సిగ్గుచేటు : కె.రామకృష్ణ**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోనే కాదు దేశ స్వాతంత్ర ఉద్యమంలో కూడా పాల్గొనని ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులు నేడు దేశభక్తులు, దేశభక్తులు కాదని సర్టిఫికెట్లు ఇస్తుడడం సిగ్గుచేటని కె.రామకృష్ణ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం రెండు మతాలు, కులాల మధ్య జరిగిన పోరాటం కాదని, భూమి, భుక్తి, నిజాం పాలన నుంచి విముక్తి కోసం సాగిన ప్రజా పోరాటమని ఈపోరాటంతో ఏ సంబంధం లేని బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులు చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్థిక, రైతు, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, కేవలం మతాల మధ్య చిచ్చు పెట్టి ప్రజలను విభజించే రాజకీయాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాద పరిరక్షణకు లౌకిక శక్తులన్నీ ఐక్యంగా ముందుకు రావాలని ఆయన కోరారు. వామపక్ష పార్టీలన్నీ ఐక్యమై కమ్యూనిస్టు ఉద్యమ పునరేకీకరణకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**ఉపరాష్ట్రపతితో అబద్ధాలు చెప్పిస్తున్నారు : నారాయణ**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో ఏ సంబంధంలేని బిజెపి విమోచనం దినం పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తూ దేశ ద్వితీయ పౌరుడైన ఉపరాష్ట్రపతితో అబ్ధదాలను చెప్పించే స్థాయికి ఆ పార్టీ నాయకులు దిగజారడం విచారకరమని డాక్టర్ కె.నారాయణ అన్నారు. చరిత్రను వక్రీకరించే కుటిల ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఏ భూమి కోసమైతే కమ్యూనిస్టులు నిలబడ్డారో వారు బలహీనపడటంతోనే భూమి కోసం ఇతర శక్తులు పోటీ పడుతున్నాయన్నారు. అదే కమ్యూనిస్టు ఉద్యమం బలంగా ఉండి ఉంటే పేదలకు ఆ భూమి దక్కేదని పేర్కొన్నారు. 'దున్నేవాడికే భూమి' నినాదంతో కమ్యూనిస్టులు సాగించిన పోరాట స్ఫూర్తితో పేదలకు భూములు దక్కేలా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కేవలం నిరసనలు, ఫొటోలకు పరిమితం కాకుండా స్థానికంగా ప్రజలను సమీకరించి ప్రత్యక్ష, సమరశీల పోరాటాలు నిర్వహించాలని కోరారు. జనాభా పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద దేశమైన భారత ప్రధాని అమెరికా అధ్యక్షుడి ముందు మోకరిల్లడం సిగ్గుచేటని పేర్కొన్నారు. దేశం నుంచి చమురు కొనాలో వద్దో డొనాల్డ్ ట్రంప్ నిర్ణయిస్తే ప్రధాని మోదీ దానిని పాటించడం ఆక్షేపనీయమన్నారు. ట్రంప్‌కు ప్రధా ని మోదీ బానిసగా మారితే మోదీకి ఎపి ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, తెలంగాణలో బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కెటిఆర్ బానిసలుగా మారి సమర్థిస్తున్నారని ఆయన విమర్శించారు.

**తెలంగాణ అమరవీరుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి: చాడ వెంకట రెడ్డి**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర, అమరుల త్యాగాలు శాశ్వతంగా ఉండాలంటే 'తెలంగాణ అమర వీరుల కార్పొరేషన్' ఏర్పాటు చేయడంతో పాటు త్యాగధనుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని చాడ వెంకట రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని మొదటి నుంచి కనుమరుగు చేసే కుట్ర సాగిందని, ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తర్వాత కెసిఆర్ ప్రభుత్వం ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా అదే చేస్తోందన్నారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులుగా వారి స్ఫూర్తితో దున్నేవాడికే భూమి, పేదవాడికి నివేశన స్థలం నినాదంతో ఉధృతమైన భూపోరాటాలకు కంకణబద్దులు కావాలని చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.

## చరిత్ర విచ్ఛిన్నకారులు

(మొదటి పేజీ తరువాయి)

వారు చరిత్ర విచ్ఛిన్నకారులని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'విమోచన దినం' పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్న బిజెపి నాయకులు ఎక్కడి నుంచి ఏమి విమోచన చేశారు? ఎందుకు ఆ పేరు పెట్టుకున్నారో చెప్పాలని సాంబశివరావు ప్రశ్నించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆ పార్టీకి చెందిన ఒక్క నాయకుడైనా పాల్గొన్నాడా, వారి వారసులు ఒక్కరైనా ఉన్నారా చెప్పాలని ఆయన నిలదీశారు. ''హైదరాబాద్ సంస్థానాన్ని మా సర్దార్ వల్లభాయ్ పటేల్ విమోచన చేశారని బిజెపి నాయకులు అంటున్నారు. నిజాంను రాజ్ ప్రముఖ్‌గా (గవ్నరర్) నియమిస్తూ నియామక పత్రాన్ని ఇచ్చింది మీ సర్దార్ వల్లభాయ్ పటేలే. గాంధీజి గాడ్సే హత్య చేసిన అనంతరం ఆర్ఎస్ఎస్‌ను నిషేధించింది కూడా మీ సర్దార్ వల్లభాయ్ పటేలే. మీ అనుకుంటున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇప్పుడు బతికి ఉంటే మీలాంటి మూర్ఖులు, మీలాంటి మతమౌఢ్యులకు నేను నాయకుడిని ఎలా అయ్యాను'' అని చింతించేవారని కూనంనేని సాంబశివరావు అన్నారు.

**ఎర్రజెండా వారసులమంతా ఒక్కటవుద్దాం**

కమ్యూనిస్టులుగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నిజమైన వారసులుగా ఈ నేల కోసం, పేదవాడి కోసం అమరులు చిందించిన రుధిర చుక్కలన్నీ కలబోసిన ఆ ఎర్రజెండాను భుజాన వేసుకున్న కమ్యూనిస్టులమంతా ఒక్కటవుదామని వామపక్ష పార్టీలకు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. అలా ఒక్కటైన కమ్యూనిస్టులంతా ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎటువంటి కష్టాలకైనా సిద్ధపడదామని, అవి జైళ్లు గాని, లాఠీలు గాని, తుటాలు గాని దేనికైనా సిద్ధపడదామన్నారు. తద్వారా పోరాటం, త్యాగం, వీరత్వం, జాలి, కరుణ అంటే కమ్యూనిస్టులని, దేనికైనా సరే మనుషుల కోసం పుట్టిన సిద్ధాంతమే కమ్యూనిజమని నిరూపిద్దామని కూనంనేని సాంబశివరావు అన్నారు.

## కాంగ్రెస్‌ది ప్రజాపాలనా?

(మొదటి పేజీ తరువాయి)

నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని విమర్శించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని అంత్యంత ఎక్కువ కాలం పాలించింది కాంగ్రెసేనని, సిఎంగా రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాతే కాంగ్రెస్ ప్రజా పాలన కొనసాగిస్తున్నదా? అంతకు ముందు ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రులది ప్రజా పాలన కాదా అని వెంకట రెడ్డి ప్రశ్నించారు. కమ్యూనిస్టుల నిజమైన చరిత్రను చెప్పే దమ్ము, ధైర్యం లేకనే కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ నాయకులు కేవలం రాజకీయ లబ్ది కోసమే ఈ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. బిజెపి ఏకంగా తమ మొదటి శత్రువులు కమ్యూనిస్టులుగా భావిస్తూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రను పూర్తిగా వక్రీకరిస్తూ దేశంలో మళ్లీ అర్ధ భూసామ్య వ్యవస్థను, మనువాద సిద్ధాంతాన్ని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోందన్నారు. అందులోభాగంగానే బిజెపి ప్రభుత్వం కమ్యూనిజాన్ని నామ రూపాలు లేకుండా చేయాలనే తలంపుతో మొదటగా మావోయిస్టులను ఏరివేసే కార్యక్రమం చేపట్టి ప్రస్తుతం కమ్యూనిస్టులను అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేస్తున్నదన్నారు. గత 12 ఏళ్లుగా దేశాన్ని పరిపాలిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బిజెపిని గద్దె దించడమే లక్ష్యంగా 'బద్లావ్ జరూరీ హై' నినాదంతో సిపిఐ దేశ వ్యాప్తంగా పాద యాత్రలు, ప్రజా ప్రచార యాత్రలు నిర్వహించి సెప్టెంబర్ 1న ఢిల్లీలో బహిరంగ సభను నిర్వహించిందన్నారు. ఈ క్రమంలోనే బీహార్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో గత 50 ఏళ్లుగా గెలుపొందుతూ వస్తున్న బిజెపి ఆ స్థానంలో ఓడిపోవడం ద్వారా మార్పునకు నాంది పలికిందన్నారు.

**కమ్యూనిస్టులే దేశ భవిష్యత్**

''రాజకీయ ప్రత్యామ్నయం కోసం దేశ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రత్యామ్నయం ఉన్న చోట ప్రజా వ్యతిరేక పాలకులను ప్రజలు ఖచ్చితంగా ఓడిస్తారు. ఆ ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులే కావాలని, అందుకు కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు'' అని పల్లా వెంకట రెడ్డి అన్నారు. ఇందుకు వామపక్ష పార్టీలు ఇప్పటికిప్పుడు ఏకం కాకపోయినా ఎన్నికల్లో మాత్రం కమ్యూనిస్టు పార్టీలన్నీ ఒకే గుర్తుపై పోటీ చేస్తే ప్రజలు ఆలోచిస్తున్న ప్రత్యామ్నయం కమ్యూనిస్టులు కాగలుగుతారని, ఆ దిశగా వామపక్ష పార్టీల నాయకులు కలిసి రావాలని పల్లా వెంకట రెడ్డి కోరారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com